అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 10-06-2024

సంపుటి : 10 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

ప్రజల కష్టాలు తెలిసిన వాళ్లే జడ్జిలుగా రాణించాలి

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాధారణ ప్రజల కష్టాలు తెలిసినవారు జడ్జిలుగా వస్తే మంచి ప్రమాణాలతో న్యాయాన్ని అందించగలమని హైకోర్టు విశ్రాంత న్యాయవాది ఎంఎస్‌కే జైస్వాల్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాలలో జరిగిన జూనియర్ సివిల్ జడ్జి నమూనా రాత పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తి వద్ద ఉండే న్యాయదేవత కండ్లకు నల్ల వస్త్రంతో అడ్డు పెడతారనీ, దానర్థం న్యాయదేవతకు కండ్లు కనబడవని కాదనీ.. తన ముందుకొచ్చే వారితో సంబంధం లేకుండా నిజమైన న్యాయాన్ని అందించే ఉద్దేశంతో అలా చేస్తారని తెలిపారు. విద్యార్థులు ప్రజల సమస్యలు అవగాహన చేసుకుని న్యాయమూర్తులుగా రాణించినప్పుడే సరైన విధంగా న్యాయం అందించడం సాధ్యమవుతుందని సూచించారు. ప్రస్తుతం న్యాయమూర్తుల పాత్ర కీలకంగా మారిందన్నారు. కింది కోర్టుల్లో న్యాయమూర్తుల పాత్ర మరింత ప్రాధాన్యతను సంతరించు కుంటుందని చెప్పారు. జూనియర్ సివిల్ జడ్జిలుగా రాణించాలంటే సమాజాన్ని చదవాలని సూచించారు. కోర్టుల్లో న్యాయమూర్తి తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజల జీవితం తీవ్రంగా ప్రభావితం అవుతుందని తెలిపారు. అందువల్ల న్యాయమూర్తులు అత్యంత జాగ్రత్తగా న్యాయం అందించే కృషి చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితులలో నిర్దోషులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత న్యాయమూర్తుల చేతుల్లో ఉంటుందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8 కేంద్రాల్లో నమూనా ప్రశ్న పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు అనేక కార్యక్రమాలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నిర్వహిస్తుందని వివరించారు. అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన, వైస్ ప్రిన్సిపాల్ రాంచందర్ మాట్లాడుతూ మారిన కాలానికనుగుణంగా విద్యార్థులు కష్టపడి విజయం సాధించాలని కోరారు.

మంచి కార్యక్రమాలకు తమ కళాశాల ఎప్పుడూ సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో అతిథులకు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, వెంకటేష్ స్వాగతం పలికారు. ఐలు సహాయ కార్యదర్శి మాధవరెడ్డి అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. హైకోర్టు న్యాయవాదులు సుదర్శన్ ఈశ్వర్ జితేంద్ర, అగ్నికుమార్, నరేందర్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రూప్-4 మెరిట్ జాబితా వచ్చేసింది

- టీజీపీఎస్సీవిడుదల

హైదరాబాద్: రాష్ట్రంలో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ ప్రక్రియలో కీలకమైన ధ్రువపత్రాల పరిశీలనకు టీజీపీఎస్సీ తేదీని ఖరారు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9న జనరల్ ర్యాంకుల జాబితాను ప్రకటించిన టీజీపీఎస్సీ.. తాజాగా ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన మెరిట్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు ఈనెల 13 నుంచి వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునేందుకు కమిషన్ అవకాశం కల్పించింది. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలని సూచించింది. వారిని మాత్రమే విడతల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు అనుమతిస్తామని పేర్కొంది. అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరుకావాల్సిన రోజువారీ తేదీలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపింది.పరిశీలన కోసం అవసరమైన పత్రాలన్నీ సిద్ధం చేసుకోవాలని అభ్యర్థులకు కమిషన్ సూచించింది. కులధ్రువీకరణ, బీసీ నాన్ క్రీమీలేయర్, దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు, ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు స్టడీ/నివాస ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 2021-22 ఏడాదికి సంబంధించిన ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రంతోపాటు అవసరమైన పత్రాలన్నీ దగ్గర ఉంచుకోవాలని తెలిపింది. ధ్రువీకరణ పత్రాల పరిశీలన సమయంలో తప్పనిసరిగా ఈ పత్రాలన్నీ సమర్పించాల్సి ఉంటుందని.. అభ్యర్థులకు అదనపు గడువు ఇవ్వబోమని ఇప్పటికే టీజీపీఎస్సీ స్పష్టం చేసింది.

రాజకీయాలకు పాండియన్ గుడ్‌బై

భువనేశ్వర్: ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సన్నిహితులు, మాజీ ఐఏఎస్ అధికారి వికె పాండియన్ రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. ఇటీవల జరిగిన ఒడిశా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ (బీజేడీ) ఓటమి నేపథ్యంలో పాండియన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు వీడియో సందేశం విడుదల చేశారు. తాను నవీన్ పట్నాయక్‌కు సహాయకారిగా ఉండాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పుడు రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తన ప్రయాణంలో ఎవరినైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అలాగే, తనపై జరిగిన ప్రచారం వల్ల పార్టీ ఓటమి పాలై ఉంటే అందుకూ క్షమించాలన్నారు. నవీన్ మరోసారి విజయం సాధించని పక్షంలో తాను రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని గతంలో చెప్పిన పాండియన్ అందుకు తగ్గట్టే తన నిర్ణయాన్ని వెలువరించారు.


(ఫైల్)

తమిళనాడుకు చెందిన పాండియన్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారిగా ఈ రాష్ట్రంలో విధుల్లో చేరారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సన్నిహితుగా మారారు. ఎన్నికల ముందు ఉద్యోగానికి రాజీనామా చేసి బీజేడీలో చేరారు. నవీన్ పట్నాయక్ నిర్ణయాలను పాండియన్ తీసుకుంటున్నారని ఎన్నికల ప్రచారంలో బీజేపీ విమర్శలు చేసింది.

శతకోటీశ్వర్ల పన్నుపై మీరెటు? : జైరాం రమేశ్

న్యూఢిల్లీ : శ్రమజీవుల కష్టార్జితంతో కోట్లకు పడగలెత్తిన శతకోటీశ్వర్లపై పన్నులు (బిలియనీర్ ట్యాక్స్) విధించాలంటూ ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో నూతన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టేవారికి కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఇదే అంశంపై ప్రశ్నలు సంధించారు. 'బిలియనీర్ పన్నుపై మీరెంటుంటారు?' అని ఆయన నిలదీశారు. శతకోటీశ్వర్లపై పన్ను విధించడానికి మద్దతు ఇస్తారా? లేదా ఎప్పటిలాగే పేదలపై భారాలు మోపడం కొనసాగిస్తారా? అని ఆయన ప్రశ్నించారు.

ఒకే సమయంలో రన్‌వే పై రెండు విమానాలు

ముంబయిలో తప్పిన ప్రమాదం

ఎటీసిఒపై వేటు



ముంబయి : ముంబయిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. రన్‌వేపై ఎయిర్ ఇండియా 657 విమానం ఇంకా టేకాఫ్ ప్రక్రియలో ఉండగానే ఇండిగో 5053 అదే రన్‌వే దిగింది. రెండింటికి మధ్య కొన్ని వందల మీటర్ల దూరమే ఉంది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రెండు విమానాలు ఒకే రన్‌వేపై ప్రయాణించడం.. ఇండోర్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండ్ అవుతుండగా.. అదే సమయంలో ఎయిర్ ఇండియా విమానం తిరువనంతపురం వెళ్లేందుకు గాల్లోకి ఎగిరడం వీడియోల్లో స్పష్టంగా ఉంది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విమానాశ్రయానికి చెందిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్ (ఎటిసిఒ)ను విధులను నుంచి తప్పించింది. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటనపై ఇండిగో స్పందించింది. తమ పైలట్ ముంబయి ఎయిర్ పోర్టు ఏటీసీ సూచనలను తూచా తప్పకుండా పాటించాడని పేర్కొంది. "జూన్ 8వ తేదీన ఇండిగో 6ఈ6053 విమానానికి ఏటీసీ నుంచి ల్యాండింగ్ క్లియరెన్స్ లభించింది. మాకు ప్రయాణికుల సురక్షితే ముఖ్యం. ప్రొసిజర్ ప్రకారం ఈ ఘటనపై మేం రిపోర్టు చేశాం" అని ఒక ప్రకటనలో వెల్లడించింది.

బంగ్లాదేశ్ ఎంపీ హత్య కేసు

- కీలక నిందితుడి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో కీలక నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. నేపాల్‌లో అక్కడి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేయగా, భారత్‌కు తీసుకువచ్చారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు చేపట్టగా.. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఒక కాలువలో ఎంపికి చెందిన కొన్ని శరీర భాగాలను గుర్తించారు. ఈ వివరాలను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఆదివారం వెల్లడించారు. "వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో గాలింపు జరపగా.. ఒక కాలువలో మనిషికి సంబంధించిన శరీర భాగాలు, ఎముకలు లభ్యమయ్యాయి. వీటిని ఎంపికి చెందినిగానే అనుమానిస్తున్నాం. వాటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపిస్తాం. ఇతర శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతుంది" అని పోలీసులు వెల్లడించారు. అంతకుముందు ఎంపి శరీరానికి సంబంధించినగా భావిస్తోన్న దాదాపు మూడున్నర కిలోల మాంసపు ముద్దను హత్య జరిగిన అపార్టుమెంటు సెప్టిక్ ట్యాంకులోనే గుర్తించారు.


(ఫైల్)

ఎంపిని హత్య చేసిన అనంతరం అతడి శరీర భాగాలను ముక్కలుగా చేసి పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్న విషయం తెలిసిందే. అయితే, వీటిలో కొన్ని ఇప్పటికే లభ్యం చేసుకున్నప్పటికీ.. అవి నిర్ధరించుకోవడం కష్టంగా మారింది. దీంతో డిఎన్ఎ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం మరణించిన ఎంపి కుమార్తె బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు రానున్నారు.

పత్రికా స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుడు డెలోయిర్ కన్నుమూత

- జర్నలిస్ట్స్ వితవుట్ బోర్డర్ నివాళి


(ఫైల్)


పారిస్: పత్రికా స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడిన యోధుడు, జర్నలిస్ట్స్ వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్ క్రిస్టోఫ్ డెలోయిర్ శనివారం మరణించారు. ఆయన వయసు53 సంవత్సరాలు. గత కొంత కాలంగా కేన్సర్‌తో పోరాడుతున్న ఆయన ఉన్నట్టుండి ఒక్కసారి ఆ మహమ్మారి ఉగ్రరూపం దాల్చడంతో తనువు చాలించారు. ఆయనకు భార్య, కుమారుడు, తల్లి దండ్రులు ఉన్నారు. ఆయన మృతి పట్ల పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్ట్స్ వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్లు, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 2012 నుంచి పన్నెండేళ్ల పాటు జర్నలిస్ట్స్ వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జనరల్‌గా, జర్నలిస్ట్స్ వితవుట్ బోర్డర్ సెక్రటరీ జనరల్‌గా పత్రికా స్వేచ్ఛను కాపాడడంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. ఉక్రెయిన్, టర్కీ, ఆఫ్రికా ఇలా ఏ దేశంలో జర్నలిస్టులు నిర్బంధానికి గురైనా వెంటనే అక్కడకు వెళ్లి ప్రభుత్వంతో చర్చించి వారిని విడిపించే దాకా విశ్రమించేవాడు కాదు. రెండేళ్ల క్రితం మాలిలో ఇస్లామిస్ట్ తీవ్రవాదుల చెర నుంచి జర్నలిస్టును విడుదలగావించడంలో డెలోయిర్ చూపిన చొరవ అమోఘం. జర్నలిజం స్వతంత్రతను, వైవిధ్యాన్ని కాపాడేందుకు అహరహం శ్రమించారు. జర్నలిజాన్ని జీవిత పోరాటంగా మలచుకున్నారు. జర్నలిజానికి పెద్ద ముప్పు రాజకీయ ఒత్తిళ్లేనని ఆయన అనేవారు. గత దశాబ్ద కాలంలో పత్రికా స్వేచ్ఛ సూచిలో భారత్ అధమ స్థానానికి పడిపోవడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 10-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల: 6.50


ఐఐటి జగతిపై చెరిగిపోని సంతకం...
మేధోప్రపంచంలో తిరుగులేని దిగ్గజం... నారాయణ
జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో 100 లోపు ఆల్ కేటగిరీ ర్యాంకులు,
AIR 24 KUNCHAM SHIVA HT. No.: 246121222
AIR 25 VIVEK NAGELLI HT. No.: 246157667
AIR 27 BADRINADH VARMA B HT. No.: 246014058
AIR 27 ARJAV JAIN HT. No.: 242002218 (DLP)
AIR 28 SHEKHAR JHA HT. No.: 242031290 (DLP)
AIR 31 SUSHANTH P HT. No.: 246149232
AIR 31 ISHAN GUPTA HT. No.: 242014288 (DLP)
AIR 33 SPARSH GUPTA HT. No.: 247019253 (DLP)
AIR 34 POLISETTY RITISH BALAJI HT. No.: 246161257
AIR 35 SARVAJITH KOLANU HT. No.: 246138129
AIR 36 AARUSH C HT. No.: 241050053
AIR 37 REVANTH ESWAR D HT. No.: 245014025
AIR 40 HARIPREETH P.S HT. No.: 246130165
AIR 40 ARNAV BARANWAL HT. No.: 242052079 (DLP)
AIR 42 SIDDHARTHI VIVEKANAND HT. No.: 246047026
AIR 44 SHRIJANI KOREPAKA HT. No.: 246183040
AIR 45 DHANUSH SANJAY N HT. No.: 246011188
AIR 49 BODIGEPALLY ARNAV B HT. No.: 246166124
AIR 49 AVADH HINDOCHA HT. No.: 241021073 (DLP)
AIR 50 DEV RAJ DAS HT. No.: 242103211
AIR 51 B CHARAN HT. No.: 246161542
AIR 51 RISHI GOUTHAM B HT. No.: 246153398
AIR 54 SAI TEJESH D HT. No.: 246056017
AIR 59 RISHIVARDHAN MAJJI HT. No.: 245014078
AIR 63 HUNDEKAR VIDITH HT. No.: 246183469
AIR 66 MRIGANK GOEL HT. No.: 241007021 (DLP)
AIR 69 SATYAM RAKESH SHARMA HT. No.: 241153239
AIR 69 VARUN SAI POTHULA HT. No.: 246158603
AIR 70 SRI SURYA VARMA D HT. No.: 246124096
AIR 72 B VENKATA SAKETH HT. No.: 246150205
AIR 73 MAHATHI REDDY CH HT. No.: 246049273
AIR 74 BHARATH KUMAR B HT. No.: 245010213
AIR 74 HIMANSHU THALOR HT. No.: 242050438 (DLP)
AIR 75 HEMANTH ALLU HT. No.: 245008033
AIR 76 EPPA LAXMI NARASIMHA HT. No.: 246154128
AIR 77 REVANTH SAI P HT. No.: 245010574
AIR 77 MD EMAAD ARIF HT. No.: 242054030 (DLP)
AIR 78 E SAI SHERVAN HT. No.: 246120066
AIR 81 SRINANDAN M HT. No.: 246162431
AIR 81 SAMNAVDEEP K HT. No.: 245010372
AIR 82 AMBAR GOGIA HT. No.: 2422014235 (DLP)
AIR 85 P SAI SINDHUSH HT. No.: 246121033
AIR 85 BIBASWAN BISWAS HT. No.: 245058146 (DLP)
AIR 87 MORA. ADARSH HT. No.: 246161228
AIR 87 V V AKASH REDDY HT. No.: 246053404
AIR 87 DEVANSH GATTANI HT. No.: 241113047 (DLP)
AIR 88 SATEESH KUMARCHINTU HT. No.: 245007385
AIR 89 JAIVEER SINGH HT. No.: 242061031 (DLP)
AIR 90 KRISHIV GOYAL HT. No.: 241101225
AIR 91 AMAR SINHA HT. No.: 242057008 (DLP)
AIR 94 NV SRI HARSHA HT. No.: 246037052
AIR 94 N NIRMALKUMAR HT. No.: 241110162 (DLP)
AIR 99 TANAY KAKLIYA HT. No.: 242057318 (DLP)
అడ్మిషన్ల కొరకు మీకు దగ్గరలోని బ్రాంచీలను సంప్రదించండి
JEE ADV. Repeater Batch starts from 15th June 2024
Disclaimer. Any inadvertent error published in this advertisement could be brought to our notice
Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams
Scan QR For Admissions
SRAMAYEVA JAYATHE
NARAYANA
EDUCATIONAL INSTITUTIONS
Trust Narayana to fulfil your NEET dreams, as #YourDreamsAreOurDreams
Toll Free: 1800 102 3344 | /TheNarayanaGroup | www.narayanagroup.com

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 10-06-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 161 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

కొలువుదీరిన సంకీర్ణం

మోడీ సహా 72 మంది ప్రమాణ స్వీకారం

- తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు
- 30 మందికి క్యాబినెట్ హోదా
- 36 మంది సహాయ మంత్రులు
- స్వతంత్ర హోదాలో మరో ఐదుగురు


మూడోసారి ప్రధానిగా మోడీ చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. దేశానికి 17వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణం చేశారు. వరుసగా మోడీ ప్రధాని కావడం ఇది మూడోసారి. ఆదివారం సాయంత్రం విద్యుత్ కాంతుల మధ్య రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలుత ప్రధానిగా మోడీతో ప్రమాణం చేయించారు. సాయంత్రం 7:23 గంటలకు మోడీ ప్రధాన మంత్రిగా ప్రమాణం చేశారు. అనంతరం కేంద్ర మంత్రివర్గానికి సంబంధించిన అధికారికారిక పుస్తకంలో సంతకం చేశారు. తర్వాత రాష్ట్రపతి మంత్రివర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 72 మందితో కూడిన మంత్రివర్గం ప్రమాణం చేసింది. ఇందులో 30 మంది క్యాబినేట్ మంత్రులుగా, 36 మంది సహాయ మంత్రులుగా, ఐదుగురు స్వతంత్ర హోదాలో సహాయ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. రాజ్యసభ నుంచి ఎనిమిది మంది ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రధాని మోడీ తర్వాత వరుసగా బీజేపీ ముఖ్యనేతలు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్ తదితరులు ప్రమాణం చేశారు. అలాగే ఎన్డీఎ కూటమిలోని సభ్యులు కూడా కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రధానితో పాటు బీజేపీ నుంచి 61 మంది ప్రమాణం చేశారు. ఇక మిత్రపక్షాలకు 11 మంత్రిపదవులు కేటాయించింది . అత్యధిక స్థానాలు గెలిచి కీలకంగా మారిన టీడీపీ, జేడీయూ, శివసేన (షిండే)కు తాలా రెండు స్థానాలు.. ఆర్ఎల్‌డీ, జేడీఎస్, అప్నాదళ్, హిందూస్తాన్ ఆవం మోర్చా, ఆర్పీఐ పార్టీల నుంచి ఒక్కో మంత్రికి స్థానం కల్పించింది. క్యాబినెట్‌లో 27 మంది ఓబీసీలు, 10 మంది ఎస్సీలు, ఐదుగురు ఎస్టీలు, ఐదుగురు మైనారిటీలు ఉన్నారు. క్యాబినెట్‌లో చేరిన 43 మందికి మూడుసార్లు మంత్రులుగా పనిచేసిన అనుభవం, 23 మందికి రాష్ట్రాల్లో మంత్రులుగా పనిచేసిన అనుభవం ఉంది.

ఏపీ నుంచి ముగ్గురు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం మూడు మంత్రి పదవులు దక్కాయి. కూటమిలో కీలకంగా వ్యవహరిస్తోన్న టీడీపీకి ఒక క్యాబినేట్, ఒక సహాయ మంత్రి ఇచ్చారు. ఇందులో భాగంగా వరుసగా మూడోసారి ఎంపీగా గెలిచిన రామ్మోహన్ నాయుడుకు క్యాబినేట్, పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రిగా అవకాశం కల్పించారు. అలాగే బీజేపీకి చెందిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు కూడా మంత్రి వర్గంలో సహాయ మంత్రిగా స్థానం లభించింది.

తెలంగాణ నుంచి ఇద్దరికి..

తెలంగాణ నుంచి ఇద్దరిని మంత్రి పదవులు వరించాయి. రెండోసారి కేంద్ర మంత్రిగా ...8లో

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ	- యూపీ
క్యాబినెట్ మంత్రులు	
రాజ్ నాథ్ సింగ్	యూపీ
అమిత్ షా	గుజరాత్
నితిన్ గడ్కరీ	మహారాష్ట్ర
జెపి నడ్డా	రాజ్యసభ
శివరాజ్ సింగ్ చౌహాన్	మధ్యప్రదేశ్
నిర్మలా సీతారామన్	రాజ్యసభ
జయశంకర్ సుబ్రమణ్యం	రాజ్యసభ
మనోహర్ లాల్ ఖట్టర్	హర్యానా
హెచ్ డి కుమార స్వామి	కర్నాటక (జేడీయస్)
పియూష్ గోయల్	మహారాష్ట్ర
ధర్మేంద్ర ప్రధాన్	ఒడిశా
జితిన్ రామ్ మాంజీ	బీహార్ (హెచ్ఏఎం)
లలన్ సింగ్	బీహార్ (జేడీయూ)
సర్బానంద్ సోనేవాల్	అసోం
వీరేంద్ర కుమార్	మధ్యప్రదేశ్
కింజరపు రామ్మోహన్ నాయుడు	ఏపీ (టీడీపీ)
ప్రహ్లాద్ జోషి	కర్నాటక
జోయల్ ఓరాం	ఒడిశా
గిరిరాజ్ సింగ్	బీహార్
అశ్వినీ వైష్ణవ్	ఒడిశా
జ్యోతిరాదిత్య సింధియా	మధ్యప్రదేశ్
భూపేంద్ర యాదవ్	రాజస్థాన్
గజేంద్ర సింగ్ షెకావత్	రాజస్థాన్
అన్నపూర్ణ దేవి	జార్ఖండ్
కిరణ్ రిజిజు	అరుణాచల్ ప్రదేశ్
హర్దీప్ సింగ్ పురి	రాజ్యసభ
మన్సుక్ మండవియ	గుజరాత్
జి. కిషన్ రెడ్డి	తెలంగాణ
చిరాగ్ పాశ్వాన్	బీహార్ (ఎల్‌జేపీ)
సిఆర్ పాటిల్	గుజరాత్


ఇద్దరు మిత్రులు

తెలంగాణ నుంచి...


జి. కిషన్ రెడ్డి..


బండి సంజయ్..

ఆంధ్రప్రదేశ్ నుంచి...


రామ్మోహన్ నాయుడు..



పెమ్మసాని చంద్రశేఖర్..


శ్రీనివాస వర్మ..

సహాయ మంత్రులు ఇంద్రజీత్ సింగ్ - హర్యానా, జితేందర్ సింగ్ - రాజస్థాన్, అర్జున్ రాం మేఘావల్ - రాజస్థాన్, ప్రతాప్ రావ్ గణపతి రావ్ యాదవ్ - మహారాష్ట్ర (శివసేన షిండే, మిత్రపక్షం), జయంత్ చౌదరి - రాజ్యసభ (రాష్ట్రీయ్ లోక్ దళ్, మిత్రపక్షం), జితెన్ ప్రసాద్ - యూపీ, శ్రీపాద్ యసో నాయక్ - గోవా, పంకజ్ చౌదరి - యూపీ, క్రిషన్ పాల్ - హర్యానా ,రాం దాస్ అత్వాలే - రాజ్య సభ (ఆర్పీఐ, మిత్రపక్షం), రాంనాథ్ ఠాకూర్ - రాజ్యసభ (జేడీయూ, మిత్రపక్షం), నిత్యానంద్ రాయ్ - బీహార్ , అనుప్రియా పాటిల్ - యూపీ (అప్నాదళ్, మిత్రపక్షం), వి సోమన్న - కర్ణాటక , పెమ్మసాని చంద్రశేఖర్ - ఏపీ (టీడీపీ, ఎత్రపక్షం), భూపతి రాజు శ్రీనివాస్ వర్మ - ఏపీ , ఎస్పీ సింగ్ భగేల్ - యూపీ (ఎస్సీ), శోభ కరణ్ లాజే - కర్నాటక , కీర్తి వర్ధన్ సింగ్ - యూపీ ,బీఎల్ వర్మ - రాజ్యసభ, శాంతన్ ఠాకూర్ - పశ్చిమ గోదావరి, సురేశ్ గోపి - కేరళ, ఎల్. మురుగన్ - తమిళనాడు (ఎస్సీ), అజయ్ టంటా - ఉత్తరాఖండ్ , బండి సంజయ్ - తెలంగాణ, కమలేశ్ పాశ్వాన్ - యూపీ, భగీరథ్ చౌదరి - రాజస్థాన్, సతీష్ చంద్ర దూబే - రాజ్యసభ, సంజయ్ సేత్ - జార్ఖండ్, రవ్ నీత్ సింగ్ - పంజాబ్ (లుధియానా నుంచి ఓటమి), దుర్గాదాస్ యూకే - మధ్యప్రదేశ్, రక్షా నిఖిల్ ఖడ్సే - మహారాష్ట్ర , సుకాంత ముజుందార్ - పశ్చిమ బెంగాల్ , సావిత్రి ఠాకూర్ - మధ్యప్రదేశ్ , టోఖన్ సాహూ - చత్తీస్‌గఢ్, రాజ్ భూషణ్ చౌదరి - బీహార్, హర్ష్ మల్హోత్రా - ఢిల్లీ, నీముబెన్ జయంతి భాయ్ బాంభానియా - గుజరాత్, మురళీధర్ మోహన్ - మహారాష్ట్ర, జార్జ్ కొరియన్ - కేరళ, పవిత్ర మార్గేరిటా - రాజ్యసభ

ఇక సెలవ్...

- అధికారలాంఛనాలతో ముగిసిన రామోజీరావు అంత్యక్రియలు
- పాడెమోసిన చంద్రబాబు
- అంతిమయాత్రలో పాల్గొన్న సినీ, రాజకీయ ప్రముఖులు





నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

రామోజీ గ్రూపు సంస్థల చైర్మెన్ రామోజీరావు అంత్యక్రియలు ఆదివారం ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పూర్తిచేశారు. గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రామోజీ స్వయంగా నిర్మాణం ...15లో



నెలరోజులు... వరుస సమీక్షలు

జోడెద్దులుగా అభివృద్ధి-సంక్షేమం

- అధికారుల బదిలీలకు తొలి ప్రాధాన్యత
- పాలన పరుగులుతీయాలి : సీఎం, డిప్యూటీ సీఎంల ఆకాంక్ష
- ప్రణాళికలు సిద్ధం చేసిన రేవంత్ సర్కార్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నెలరోజులు...వరుసగా అన్ని ప్రభుత్వ శాఖలపైనా సమీక్షలు. ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే సమీక్షలు. జిల్లా మంత్రుల అధ్యక్షతన అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వరుస సమావేశాల నిర్వహణ. అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగులు తీయాలి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్ణయించారు. దానిలో ...15లో

ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

రూ.10,355.18 కోట్ల చెల్లింపులు

- మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలకు..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డు నెలకొల్పింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లోనే డబ్బులు చెల్లించింది. ఇప్పటివరకు 8,35,109 మంది రైతులకు రూ. 10,355.18 కోట్లు చెల్లింపులు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ముందుగా ప్రారంభించింది. గతంలో ఏప్రిల్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేవి. ఈసారి దాదాపు రెండు వారాలు ముందుగా మార్చి 25వ తేదీ నుంచే కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి 7,178 కేంద్రాలను తెరిచింది. వీటిలో 6,345 కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగాయి. ఈ నెల 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా 47.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. చాలాచోట్ల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందనీ, మరో పది రోజుల పాటు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశముందని సివిల్ సప్లయిస్ విభాగం అంచనా వేస్తోంది. ఆలస్యంగా పంటలు వేసిన రైతులకు ఇబ్బంది తలెత్తకుండా.. ఈ నెలాఖరు వరకు అవసరమైన చోట్ల కేంద్రాలు తెరిచి ఉంచాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ ఏడాది దాదాపు 75.40 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోళ్లు జరుగుతాయని సివిల్ సప్లయిస్ విభాగం మొదట్లో అంచనా వేసింది. కానీ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ రేటు రావటం, ప్రయివేటు వ్యాపారులు పోటీ పడి మంచి ధరకు కొనుగోలు చేయటంతో కేంద్రాలకు వచ్చే ధాన్యం అంచనా తగ్గింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈసారి సివిల్ సప్లయిస్ విభాగం పక్కాగా ఏర్పాట్లు ...15లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి

ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతికి టాప్ ర్యాంక్



న్యూఢిల్లీ: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) 2024 ఫలితాలును ఆదివారం ప్రకటించారు. ఈ పరీక్షకు 1.8 లక్షల మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో 48,248 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో మహిళా అభ్యర్థులు 7,964 మంది, వికలాంగులు 594 మంది ...8లో

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది

- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

వివరాలు 8లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఆరుగురు మావోయిస్టులు మృతి

- పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందినవారిగా గుర్తింపు



ఛత్తీస్‌గఢ్ : ఛత్తీస్‌గఢ్‌లో మరోమారు భద్రతా బలగాల కాల్పుల మోతలు వినిపించాయి. ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్ నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోబెల్, తుల్తులి గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొదట ఏడుగురిని చంపినట్టుగా ప్రకటించి, తర్వాత ఆరుగురేనని పోలీసులు వెల్లడించారు. వారిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. వారంతా తూర్పు బస్తర్ ఫార్మేషన్‌కు చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)కు చెందినవారిగా గుర్తించారు. మావోయిస్టుల ఉనికిపై ...15లో

బడి ఊడ్చేదెవరు..?

- బడులకు రంగులు, మరమ్మతులు సరే.. పరిశుభ్రత మాటేమిటి!
- అపరిశుభ్రమైన గదులు, టాయిలెట్ల నడుమ చదువులెలా..
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

స్కావెంజర్ల వ్యవస్థ రద్దుతో స్కూళ్లలో పారిశుధ్యం ప్రశ్నార్థకం



నవతెలంగాణ-సిటీబ్యూరో

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల రిపేరింగ్, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రైయినేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు ఎలక్ట్రికల్ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ఈ నెల 12లోపు పాఠశాలలను అందంగా తీర్చిదిద్ది విద్యార్థులకు మంచి వాతావరణంలో స్వాగతం పలికేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రారంభ అనంతరం పరిశుభ్రత గురించి ప్రభుత్వం ఆలోచించింది లేదు. తరగతి గదుల శుభ్రత, మొక్కలకు నీళ్లు, ప్రాంగణాల పరిశుభ్రత, మరీ ముఖ్యంగా టాయిలెట్స్ క్లీనింగ్ పనులు స్కావెంజర్లకు బదులు జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు



రెండేండ్ల క్రితం గత ప్రభుత్వం అప్పగించడంతో పనులు సరిగ్గా జరగడం లేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, శానిటేషన్ ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పుడీ సమస్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభంలోపే స్కావెంజర్ల వ్యవస్థ పునరుద్ధరణపై ఒక నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఉపాధ్యాయ సంఘాల భేటీలో ...15లో

పూరణ



యుద్ధ ట్యాంకులు ఎదురొచ్చినప్పుడే
సముద్రం బిక్కచచ్చిపోయింది
అలలపై విరుచుకుపడినప్పుడే
కలలు కందిపోయాయి
ఇక, పగలైనా రాత్రయినా-
కమ్ముకునేది చీకటేనని అప్పుడే తెలిసిపోయింది
చెట్ల మీద గూళ్లలో గుడ్లు ఎదురుచూస్తున్నప్పుడే
పొదగాల్సిన పక్షులు తూటాల మధ్య
కలవరపడినట్టు కబురొచ్చింది
పురిటి నెప్పులేవీ బాంబు పేలుళ్ల నడుమ వినబడలేదు
పాలసీసాలు పగిలిపోయిన ఆ క్షణమే
పాలస్తీనా అమ్మతనం నేలపాలైంది
తొమ్మిది నెలల కలల స్వప్నం పొలమారింది.
విరిగిపోయిన ఇంద్ర ధనస్సు
శిథిలాల మధ్య చెదిరిపడింది
దాన్లో తమ ముఖాలను పోల్చుకోలేక
పిల్లలు గుక్కపెట్టారు
గుట్టలుగా పోగుపడుతున్న శవాల మధ్య
కొన ఊపిర్ల మనుషుల బుక్‌మార్క్ లవుతున్నాయి
ఆరడుగులుండే దేహానికి
ఆరించులైనా లేని నోటితో..
నినాదాన్ని పూరించలేని తల్లిదండ్రులు
దుఃఖాన్ని తమ పాడె మీదకే ఎత్తుకుంటున్నారు
గళ్ల నుడికట్టులో పూద్చేయగా మిగిలిన ఖాళీలను
ఇప్పుడిక ఎవరి ఆత్మలతో పూరిస్తావురా?
పిల్లలా? తల్లులా? తండ్రులా??
-లేదూ, చివరాఖరిగా మిగిలే నీతోనా?

- దేశరాజు

కాంతి-భ్రాంతి



అవనిని అలుముకున్న
సామాజిక మాధ్యమ రేఖలు...
కల ఏదో కళ ఏదో
కాంతి ఏదో భ్రాంతి ఏదో
తెలియనంతగా నట్టింట
నెట్టింటి వలలు....
కాలాన్ని దూరాన్ని తన గుప్పిట్లోకి
లాక్కున్న సాంకేతిక స్వర దృశ్య లయలు..
మనసులోని స్నేహ లతలు
మాటలోని ప్రేమ కృతులు
అనుబంధ గంధాల అనురాగ శృతులు
మానవతా గీతాల సరిగమలన్నీ...
సెల్ అలలలో గిలగిల చేపలు...

శబ్దాన్ని నిశ్శబ్దంగా తనలోకి
ఇముడ్చుకున్న మాయపొర
పద సంపదలు వాక్య మధురిమలు
పలకరింపుల పరిమళాలన్నీ నేడు
అర చేతి వైకుంఠపు గడులు
పద కోకిలల కిలకిల ధ్వనులతో
వాక్య కిరణాల వేకువ వెలుగులను
మనో గగనంలో ప్రసరింపజేద్దాం
భద్రమైన జీవన భాగ్యాన్ని తరతరాలుగా
అందిస్తున్న పుస్తక నేస్తాన్ని గుండె గుడిలో నిలుపుదాం..

- వెల్మల జయపాల్ రెడ్డి, 9441168976

మెచ్యూరిటీ!

ఎప్పటికీ.. బద్దలుకాని అగ్నిపర్వతాల్ని
మౌనంగ కనీసం గుండెల్లోనైనా గుట్టుగ
పేర్చుకోవడం నేర్చుకోవాలి!

తిట్లని, శాపనార్థాల్ని ఉద్దీపనా బహుమతులుగ
మనసు పొరల్లో రహస్యంగ ఎవరి కంట
పడకుండ దాచుకోవాలి..!

చివరాఖరికి మాటల్లోనైనామనమే ఓ ముందడుగేసి
శత్రువులైనా సరే.. హద్దుల్ని చెరిపేసుకోవాలి!

కినుకలు, అర్థంలేని అలకలు దూరదూరంగ ఉండటం..
నిశ్శబ్దాల్ని మోయడం.. మూతులు తిప్పుకోవడాలూ..
ముఖాల్ని దాచుకోవడాలు..

రానున్నవి గడ్డు రోజులు.. ఏకాంతం అతి ప్రమాదకరం!
ఆస్తులు, అంతస్తులెన్నున్నా ఎంతటి వారికైనా
ఆలోచనల అపరిపక్వత
'మెచ్యూరిటీ' అనిపించుకోదు!!


చూపు సక్కగలేనప్పుడు దృష్టి సంక్లిష్టత సహజం!
మనుషుల్తో సావాసమంటెనే కాళ్ళల్ల కట్టెరికినట్లు..
జరంత సల్లు బిగుండాలే!!

అహమో, అజ్ఞానమో రెంటిని పక్కన పెడితే
అందరిలో ఆనందంగ వుంటాం!
ఒకమెట్టు దిగితే ఏం పడిపోం
నెగ్గడం కాదు తగ్గడమే మజా!!

ద్వేషం అసహజాతం!
ప్రేమ సర్వమోద సమ్మతం!!

- అశోక్ అవారి, 9000576581

కొల్లి వెంకన్న కవిత్వంలో 'దళిత వేదన'




"ఎంత కోయిల పాట వృథయయ్యెనో కదా చిక్కు చీకటి వనసీమలందు" అని జాషువ ఆవేదన చెందాడు. "పుట్టరాని చోట పుట్టుకతన ఎన్ని వెన్నెల వాగులు ఇంకిపోయనో గదా?" అని వాపోయాడు. నేటికీ ఎంతోమంది అణగారిన వర్గాల కవులు, కవయిత్రులు వెలుగులోకి రాకుండా పోయారు. సాహిత్య చరిత్రలో వారికి సముచిత స్థానం దొరకలేదు. దళిత సాహిత్య ఉద్యమ ఉధృతిలో కొంతమంది తొలితరం కవులు వెలుగులోకి వచ్చారు. డాక్టర్ కల్లూరి ఆనంద రావు, గోగుశ్యామల, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి పరిశోధకులు పాత తరం కవులను, కవయిత్రులను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. దళిత సాహిత్య చరిత్ర ఊట చెలిమ లాంటిది. ఈ సృజన చెలిమ నుండి మధురమైన కవితాజలాన్ని ఇంకా వెలికి తీయాల్సిన అవసరముంది. తరతరాలుగా అక్షరానికి దూరం చేయబడిన జాతిలో వెల్లువెత్తిన, సాహిత్య జీవ నదులతో వర్తమాన కాలానికి అంటిన కాలుష్యాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలి. ఇలాంటి మరొక కవితా జీవనది కొల్లి వెంకన్న. వెంకన్న మాష్టారుగా ప్రఖ్యాతిగాంచిన ఈ కవి తూర్పు గోదావరి జిల్లా కోలంక గ్రామంలో 1932 ఫిబ్రవరి 4వ తేదీ మహాలక్ష్మి (తండ్రి పేరు) గంగమ్మ దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో వెంకన్న ఐదవ తరగతి వరకు చదివి, ఆర్థిక ఇబ్బందుల వలన విధిలేని పరిస్థితుల్లో పశులకాపరిగా భూస్వామి వద్ద చేరాడు. ఆ తరువాత మేనమామ వడ్డి వెంకన్న, గురువు వీరన్నల ప్రోత్సాహంతో విద్యనభ్యసించి ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించాడు. పల్లి పాలెం, కోలంక గ్రామాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించాడు. విద్యార్థులకు కొంగుబంగారంగా, గ్రామ ప్రజలకు తలలో నాలుకగా విలసిల్లి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నాడు. రచయిత దాట్ల దేవదానంరాజు వెంకన్న ప్రియ శిష్యుడు. ఆయన ఏలుబడిలో అక్షరాలు దిద్దుకొని, తరువాత గురువుతో కలిసి ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. కోనసీమ ప్రాంత ప్రజల గుండెల్లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొలువైన కొల్లివెంకన్న 1996 జూన్ 11న మరణించాడు.

డెబ్బయ్యో దశకంలో ఆధునికదృష్టితో దళిత స్పృహతో వెంకన్న ఎన్నో పద్యాలు, గేయాలు, శతకాలు రాశాడు. నిరుపేదలు, వ్యసాయకూలీలు, అణగారిన వర్గాలు నిత్య జీవితంలో అనుభవిస్తున్న కష్టనష్టాలను వాస్తవ దృష్టితో కవిత్వీకరించాడు. స్పందనాస్పద హృదయంతో కవిత్వం రాసుకుంటూ పోవటం తప్ప ప్రచురణ విషయం వెంకన్న పట్టించుకోలేదు. అమూల్యమైన వెంకన్న అముద్రిత రచనలను సేకరించి వారి కుమారుడు కొల్లి సత్యనారాయణ 'దళిత వేదన' పేరుతో కవితా సంపుటిని ప్రచురించాడు. పద్య, గద్య, శతక, వచన, గేయ రూపంలో వెలువడిన ఈ సంపుటిని ఇటీవల హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తరువాత యానాంలో పరిచయ సభ నిర్వహించారు.

ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుడైన వెంకన్న ప్రత్యేకించి భాషా శాస్త్రాలను అధ్యయనం చేయకపోయినప్పటికీ కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ, బోయి భీమన్నల ప్రభావంతో సామాజిక అసమానతలు, ఆర్థిక అంతరాలు, ప్రజాసమూహంలో వేళ్లూనుకున్న మూఢ నమ్మకాలను తీవ్రంగా నిరసిస్తూ సరళంగా పద్య కవిత్వం రాశాడు. సందేశాత్మకమైన గేయాలు రాశాడు. ఒక్కొక్క అంశం గురించి భావ పరమైన పునరుక్తి లేకుండా ఎనభైకి పైగా పద్యాలు రాశాడు. కొన్ని పద్యాలు శతకశైలిలో ప్రబోధాత్మకంగా సాగాయి. కులపిశాచుల కుటిలత్వాన్ని, మత గజంబుల మదాన్ని మట్టు బెట్టాలని, 'మనువు చూపిన బాటను మంట గలపాలని వెంకన్న పిలుపునిచ్చాడు. దళిత జనుల వేదనను కవిత్వంలో శక్తివంతంగా పలికించాడు. మనువాదుల గుండెలదిరేలా ప్రశ్నాస్త్రాలను సంధించాడు. **"నీదు తల్లివలెనె నా తల్లి యున్నది/ నిన్ను గన్న యట్లు నన్ను గనెను/ నీదు రూపు గూడ నాదు రూపేనోయి/ ఏల వచ్చె నాకు మాల తనము?"** అంటూ సమర్థుడైన న్యాయవాదిలాగా కులవ్యవస్థ రూపొందించిన కుట్రను వ్యతిరేకించాడు. **'ఇరువురందు భేద మిసుమంతయు లేదని'** పద్యాల ద్వారా శాస్త్రీయంగా నిరూపించాడు. **"కోట్లకొలది సొమ్ము/ కూడ బెట్టు నరుడు కూడా"** కూలి వాని అండదండ లేకపోతే ఒక్క క్షణం కూడా మనుగడ సాగించలేడని వెంకన్న తెగేసి చెప్పాడు. కిందికులంలో పుట్టిన కారణంగా కూలివాడిగా మారాల్సి వచ్చిందనే ప్రగాఢమైన విశ్లేషణతో కవిత్వం రాశాడు. కుల నిర్మూలనా పోరాటంలో ముందుకు నడిచిన ఈలి వాడపల్లి, బి. వి రమణయ్య, పావన మూర్తి, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితర దళిత వైతాళికుల, నాయకుల అచంచల కృషిని పద్యాలలో కొనియాడాడు.

కవికి అపూర్వ వస్తు నిర్మాణ దక్షత ఉండాలి. విస్తృత వస్తువులను వేయి కళ్లతో పరిశీలించి, పాఠక లోకానికి సరికొత్త రసస్ఫూర్తి కలిగించాలి. కొల్లి వెంకన్న అతి సాధారణ వస్తువులను గ్రహించి, పీడిత ప్రజల జీవితాలకు అన్వయించి రమణీయమైన పద్యాలను రచించాడు. డాక్టర్ బోయి విజయభారతి అన్నట్లుగా వెంకన్న ఊహాశక్తి గొప్పది. ఆయన ఎంచుకున్న కవితా వస్తువులలో వైవిధ్యం ఉంది. 'ఉప్పు మాత' లాంటి కవితల్లో ఈ రకమైన దృష్టి కనిపిస్తుంది.

అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు.



"నీళ్ళు నీది తండ్రి, నేల నీదు జనని/ ఇరువురకును బుట్టి యిలను వెలసి/ సర్వ జనుల కిలను చప్పదనము బాపె/ గొప్ప దానివమ్మ ఉప్పు మాత" అంటూ కవి ఉప్పు పుట్టుక తీరును కవిత్వంగా మలిచాడు. **"నిన్ను గన్న తండ్రి, నీరు మళ్ళీ నిన్ను హతమారుస్తుందని, కరుణ లేనట్టి వాడు నీదు కన్న తండ్రి"** అంటూ నీటికి ఉప్పుకు ఉన్న విలక్షణ బంధాన్ని తేటతెల్లం చేసి, ఉప్పు మాతతో ఆత్మీయంగా కవి సంభాషిస్తాడు. నిత్య జీవనంలో ఉప్పు ప్రయోజనాన్ని, ఆహారంలో ఉప్పు ప్రాధాన్యతను, కడలి తీరంలో ఉప్పు ఉత్పత్తివిధానాన్ని, ఉప్పు వలన కలిగే లాభ, నష్టాలను వెంకన్న సముచితంగా అక్షరబద్ధంచేశాడు. జనుల నాలుకల మీద ఉప్పు 'రుచి మొలకలు' మొలిపిస్తుందని, ఆహారవిజ్ఞానికి ఉప్పుగల్లు 'ఒజ్జవిత్తు'గా ఉపయోగపడుతుందని కవితాత్మకంగా సంభాషించాడు. కోటీశ్వరునికీ, కటిక నిరుపేదకు ఉప్పు ఒకేరకంగా మేలు సమకూర్చుతుందని, ఉప్పుకు ఉన్న సమబుద్ధి మనుషులకు లేదని ఆవేదన చెందుతాడు కవి. ఉప్పుకు కూడా పన్ను చెల్లించాలని హుకూం జారీ చేసిన సీమదొరల దోపిడీ విధానాన్ని వెంకన్న నిరసించాడు. 'గొప్పదానివమ్మ ఉప్పు మాత' అనే మకుటంతో ఉప్పుతో సంభాషిస్తున్నట్లుగా సాగిన వెంకన్న పద్యశైలి విశిష్టంగా ఉంటుంది. 'తాటి చెట్టు జనని నీకు దండమమ్మ' అనే మకుటంతో హృద్యమైన భావధారతో వెంకన్న రాసిన పద్యాలు ఎంతగానో ఆకట్టు కుంటాయి. **"నీదు రక్తము కాశించి నీదు సుతులు/ తలలను నరికి నెత్తురు త్రాగు చుండె"** అంటూ కవి ఆవేదన చెందాడు. ఈ పద్యాలు చదువుతుంటే కరుణశ్రీ 'పుష్ప విలాపం' మదిలో మెదులుతుంది. **"దాన కర్ణుడు నీలోన దాగియుండె/ నిన్ను బోలిన సహకారి ఇలనెవరు గలరు?"** అంటూ వెంకన్న బహుళ ప్రయోజన దాయిని తాటిచెట్టు ఔన్నత్యాన్ని పద్యాల్లో ప్రస్తుతించాడు. కష్టజీవుల కడుపులో చెలరేగే ఆకలి మంటలనార్పే తల్లియని కీర్తించాడు. మద్యపానం, చీట్లపేక వల్ల సంభవించే ప్రమాదాలను కవిత్వంలో వెంకన్న ఆమోదయోగ్యంగా చిత్రించాడు. ఈ వ్యసనం సిరులను నోటన బెట్టియు కర కరమని నమిలి.. కడుపున దాస్తుందని" నరులను నాశన మొనర్చు పరమ పిశాచి' యని కవి హెచ్చరించాడు. "మేడల రేడుల యందున ఆడమని, పాడుబడిన బ్రతుకుల ఇళ్ళలో కాలు పెట్టవద్దని చీట్లపేకను వెంకన్న వేడుకున్నాడు. 'కోడిరేడు' కవితలో కోడికి మనిషికి మధ్యవున్న సంబంధ బాంధవ్యాలను, కాలికి కత్తి గట్టుకొని రణరంగంలో వీరోచితంగా పోరాడే కోడిపుంజు ధీరత్వాన్ని రమణీయంగా వర్ణించాడు .

అసమ సమాజంలో బుసలుకొడుతున్న కులవివక్ష, పేదరికం, మతాధిపత్యాలను ఎదుర్కొనే క్రమంలో వెంకన్న ప్రతిఘటనాత్మకమైన చైతన్యాన్ని అందిపుచ్చుకున్నాడు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే పాఠశాలలో కూడా ఆయన అనేక అవమానాలను ఎదుర్కొని, ఆత్మగౌరంతో వాటిని ధిక్కరించి నిలబడ్డాడు. డాక్టర్ ఏ.టి కోవూరు, గోరా, తాపీధర్మారావు వంటి వారి ప్రేరణతో హేతువాదిగా పరిణామం చెందాడు. మనుషులను నిలువెల్లా కలుషితం చేస్తున్న మూఢాచారాలను తరిమికొట్టే శాస్త్రీయ ఆలోచనలను విద్యార్థుల్లోనూ, తనజాతి జనుల్లో రేకెత్తించాడు. యెండ్లూరి చిన్నయ్య అంబేద్కర్ జీవిత చరిత్ర అధ్యయనస్ఫూర్తితో వెంకన్న సామాజిక విముక్తి తత్వాన్ని అర్థం చేసుకున్నాడు. బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా' రాజకీయాలను, ఆశయాలనుప్రచారం చేశాడు. ఈశ్వరీ బాయి, బి.వి.రమణయ్య లాంటి నాయకులు కూడా ఎన్నికల సమయంలో అంబేద్కర్ భావజాల ప్రచారానికి వెంకన్నను ఆహ్వానించటం విశేషంగా భావించవచ్చు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవన, ఉద్యమ తీరుతెన్నులను వెంకన్న తన పద్యాలలో తాత్త్విక బంధురంగా చిత్రించాడు. **"అంధకారము బాపు అరుణుడేమి గొప్ప?"** అంటూ **"చీకటి బాపె అంబేద్కరే గొప్ప"** అంటూ వెంకన్న భీమైక దృష్టితో కలమెత్తి చాటిచెప్పాడు. **"మతము మారినావుగాని మాలతనము పోయిందా? మతము మారినా గాని మాదిగవే నీవిలలో"** అంటూ క్రైస్తవ, హిందూమతాల పరిమితుల్లో చిక్కిన మాల మాదిగలను ప్రశ్నించాడు. చర్చి, దేవాలయాల్లో, ప్రార్థనలు, అర్చనల్లో మునిగి తేలే అణగారిన వర్గాలకు వెంకన్న అంబేద్కర్ హక్కుల ఆవశ్యకతను తెలియజెప్పాడు.. **"కలమను హలమున భారత పొలము దున్ని/ జాతి మెరక పల్లము లెల్ల/ సౌఖ్య జలములు సర్వము సాగు నటుల/ సల్పితివి భీమ! నీకిలసాటి ఎవరు?"** అంటూ అంబేద్కర్ బహుముఖీన ఔన్నత్యాన్ని అపురూపంగా వర్ణించాడు. **"సత్యభామ మగనిచక్రంబు కంటెను/ భూపుత్రి పతియొక్క తూపుల కన్నను/ శివుని కరమునందు శూలంబు కంటెను/ అపరబుద్ధుని కల మరయ ఘనము"** (ఘనుడు అంబేద్కరుండు). విష్ణు చక్రం, రామ బాణం, శివుని శూలం ఇత్యాది పురాణ వీరుల ఆయుధాల కంటే అంబేద్కర్ కలము ఘనమైనదని కొల్లి వెంకన్న జ్ఞానోత్తేజంతో నిర్ధారించాడు. ఏభయ్యేళ్ల క్రితం వెంకన్న రాసిన ఈ పద్యంలో ఈనాటి దళిత కవుల తాత్విక ఎరుక కనిపిస్తుంది. **"మీ దగ్గర బ్రహ్మాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి/ మీ దగ్గర పాశు పతాస్త్రం ఉంది/ ఉంటే ఉండనివ్వండి"** అని సూర్యవంశి రాసిన 'యెన్నుంటేనేం' కవితకు వెంకన్న పద్యానికి భావ సామీప్యత కనిపిస్తుంది.

వెంకన్న ఉపాధ్యాయుడు కావటం వల్ల విద్యార్థుల మనోవికాసాన్ని పెంపొందింపజేసే సంకల్పంతో 'కోతి దూలము', 'కాకి పూజ' లాంటి సుప్రసిద్ధ కథలను, వాటిలోని నైతిక విలువలను, జీవిత సత్యాలను పద్యాలుగా మార్చి, పఠన యోగ్యమైన శైలిలో ప్రబోధించాడు. కథా కావ్య రచనాశైలిలో సాగిన ఈ ఖండికలు పాఠ్యపుస్తకాలలో చేర్చదగిన స్థాయిలోఉన్నాయని డాక్టర్ పల్లేరు వీరాస్వామి అన్నమాట సత్య సమ్మతమైనది. చాలామంది పండితుల్లాగా వెంకన్న ఏ గురువు వద్దా పంచకావ్యాలను, వ్యాకరణ, ఛందోగ్రంథాలను పఠించలేదు. పద్యరూపంలో సందేశమందిస్తే అది పదికాలాలపాటు నిలుస్తుందని ఆయన భావించాడు. చాలామంది దళిత సంప్రదాయ కవుల్లాగా పద్య రచనను సాధన చేసి పూర్తిగా వ్యవహారశైలిలో పద్యాలు రాశాడు. అక్కడక్కడ అన్వయ దోషాలు, వ్యాకరణపరమైన చిన్న చిన్నపొరపాట్లు దొర్లినప్పటికీ వెంకన్న పద్యాల్లో ఉదాత్తమైన భావసంపద పొంగిపొర్లుతుంది. మానవీయ జీవన మార్గం ఆలోచనా లోచనాలకు దర్శనమిస్తుంది. అన్నిటికీ మించి అంబేద్కర్, బౌద్ధ తాత్త్వికతకు వెంకన్న కవిత్వం నిలువుటద్దంలా ఉంటుంది.

(జూన్11 కొల్లి వెంకన్న వర్ధంతి సందర్భంగా)



డాక్టర్ కోయి కోటేశ్వర రావు,
9440480274

కమ్మనైన అమ్మ ముచ్చట



- గాజోజి శ్రీనివాస్,
9948483560

అమ్మ ప్రేమ గురించి ఎంత చెప్పినా తక్కువే. తన త్యాగం, కరుణ, అలుపెరుగని ఓర్పుతో బిడ్డని కనీ, పెద్దవారిని చేస్తుంది. అమ్మ పస్తులుండైనా బిడ్డ కడుపు నింపుతుంది. ఈ ప్రపంచానికి మొట్టమొదటి సారిగా నిన్ను పరిచయం చేసేది అమ్మే. ఎంత సేవ చేసినా అమ్మ రుణం తీర్చలేనిది. అమ్మ మీద అంతులేని ప్రేమను చూపడం బిడ్డ కర్తవ్యం. అలాంటి ప్రేమనే పెంచుకున్నారు మన కవి లేదాళ్ల రాజేశ్వరరావు. అమ్మ మీద ప్రేమను వ్యక్తం చేస్తూ రాసిన తన తృతీయ కవితా సంకలనమే 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి'.

రాజేశ్వరరావు అత్యంత విలక్షణమైన కవి. నిత్యం ఏదో ఒక పత్రికలో అతని కవితలు ప్రచురితం అవుతుంటాయి. ఆ కవిత్వంలో మానవీయ కోణాలు కవితా వస్తువులుగా కనిపిస్తాయి. వాటిని చదువుతుంటే మన చుట్టూ జరిగే సంఘటనలు గుర్తుకువస్తాయి. కొన్ని మన గుండెల్ని పిండేస్తాయి. అలాంటి కవి రాసిన ఎంతో ఆర్ద్రత గల కవితల్ని ఈ కవితా సంకలనంలో చదవొచ్చు. ప్రపంచీకరణలో మట్టి కొట్టుకుపోయిన మానవీయ విలువల్ని ఈయన కవిత్వంలో స్పృశిస్తున్నారు.

'అమ్మ కాళ్ళకు/ కొనలేని మెత్తని చెప్పులు గుర్తొచ్చి/ కన్నీటి ప్రవాహమవుతాను' పాడై పోతాయని అమ్మ చెప్పుల్ని తడవకుండా/ చేతిలో పట్టుకుని నడిచేది కొన్నిసార్లు/ ఇప్పుడా చెప్పులు గూట్లో స్తబ్దంగా కనిపిస్తాయి/ ముట్టుకున్నప్పుడల్లా మెత్తగా/ అమ్మ పాదాలు కంది పోతాయేమోనన్నంత మృదువుగా..

ఈ కవితను చదివినప్పుడు కంట్లో నీళ్లు తిరుగుతాయి. మనం బతికినన్నాళ్ళు అమ్మ బతకపోవచ్చు కానీ అమ్మ బతికిన్నాళ్లు మనం బతికే ఉంటాం. అమ్మ ప్రేమను పొందుతూనే ఉంటాం. ఈ కవిత చదువుతున్నప్పుడు ప్రతి ఒక్కరికి తన తల్లి గుర్తుకొచ్చి గుండె బరువెక్కుతుంది. ఈ కవిత 'అక్షరాల తెర టోరి రేడియో'లో కూడా ప్రసారితం అయినది.

'అనివార్యమై ఆమె ఒక్క రోజు జ్వరంతో నిద్రపోతే/ బ్రహ్మాండాలు బద్దలైనట్లు/ సునామీలు చుట్టూ ముసురుకున్నట్లు/ ఆమె చాకిరిని ప్రశంసించని/ కష్టాన్ని కనికరించని/ ఆమె పైనే ఆధారపడ్డ ప్రత్యక్ష పరాన్న జీవిని నేను'.

ఇంట్లో అమ్మ, భార్య చేసే చాకిరిని ఎప్పుడూ మనం గుర్తెరగం. ఆమెకు జ్వరం వచ్చి మంచం ఎక్కిన రోజున కిచెన్‌కి వెళ్లి వంట చేయాలన్నా, ఇంటిని శుభ్రం చేయాలన్నా బ్రహ్మాండం బద్దలవుతుంది. అలవాటు లేని పనిని చేసినప్పుడు ఏదో పాతాళంలోకి దిగబడిపోయినట్లుగా భావిస్తాను. అప్పుడే గుర్తుకొస్తుంది, తాను రోజూ ఎంత కష్టపడుతుందో అని. అయినా తన కష్టాన్ని గుర్తించమని ఎప్పుడూ అడగదు. నిస్వార్థంగా, ప్రేమగా తన పని తాను చేసుకుంటూ, ఇంట్లో అందరికీ అన్నీ సమకూర్చుతుంది. మనమే ఆమెపై ఆధారపడ్డ పరాన్న జీవులమై ఉన్నాం.

ఇలా ప్రతి కవితలో ఏదో ఒక అంశాన్ని గూర్చి చక్కగా ఆవిష్కరించారు. కవికి వస్తువు కొదవలేదు, వస్తువు లోతుపాతులు బాగా తెలుసు, మనసు చెప్పినట్టు రాసుకోగలిగారు. చదివే ప్రతి పదానికి మనసులో ఆలోచనలు తెరలుతెరలుగా పొంగిపొర్లుతాయి. మానవీయ కోణాల్ని ఆవిష్కరించడంలో ఈ కవి సఫలీకృతమయ్యారని చెప్పవచ్చు. ఇలా సరళంగా అర్థమయ్యేలాగా మనసులోకి చొచ్చుకుపోయే విధంగా ఉన్నాయి కవితలు.

నాతో ఎవరైనా ఉంటే బాగుణ్ణు/ఒక్కణ్ణి మాత్రం ఎంతని పయనించను?/ ఒక్కణ్ణే గుండెల్ని చీల్చుకుని ఏం రాసుకోను?/ గుండెల్లోనైనా ఒకరు ఉండాలి కదా!... నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా జీవనం సాగిస్తున్నారు. ఇంకొకరి గురించి ఆలోచించేంత సమయం ఎక్కడిది. ఉన్న సమయమంతా నేను, నా కుటుంబం అనుకునే కాడికే సరిపోతుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా రూపొందాక మానవ బంధాల మాధుర్యం లేకుండా పోతుంది. ఓ ఆపద వచ్చినప్పుడు, కష్టాలు చుట్టుముట్టినప్పుడు, ఒంటరిగా మిగిలినప్పుడు నాతో ఎవరైనా ఉంటే బాగుండు అనే ఆలోచనలో మునిగిపోతాం. ఏదైనా సమస్య తనదాక వస్తే గాని తెలియట్లేదు బంధాల విలువలు.

'ఏం తీసుకొని పోతాను నాతో నేను/ ప్రోది చేసుకొని/ ఒంటరిగా వెళ్లేప్పుడు/ చిటికెడు కన్నీళ్ల కార్చడానికైనా ఒకరు ఉండాలి...' అని కవితను ముగిస్తాడు. ఎంత లోతైన భావుకత, చదువుతుంటే మనతో సూటిగా మాట్లాడినట్టే ఉంటుంది. ఈ లోకాన్ని దాటి వెళ్లేటప్పుడు తోడెవరు రాకున్నా కనీసం మనకోసం ఒక చిటికెడు కన్నీళ్లు రాల్చగలిగే మనుషులను సంపాదించుకోగలగాలి. మనకంటూ ఓ నలుగురు అయినవారు ఉండాలి అంటారు కవి. నాన్న గురించి మరో కవితలో..

'నాన్నొక దు:ఖ సంద్రం/ గంభీరంగా ఉండే సముద్రానికెంత దు:ఖం!?/ ఎన్ని బాధ్యతల/ నదుల



ఘోషాల్ని/ తనలో ఇముడ్చుకోలేదు/ ఎన్ని కన్నీటి ప్రవాహాల్ని తన కన్నుల్లో దాచుకోలేదు నాన్న... అయినా/ నాన్న ఎప్పటికీ/ ఇంకిపోని అనురాగ జలనిధి.

నాన్న బాధ్యతల గురించి త్యాగాల గురించి ఎంత చెప్పినా తక్కువే. నాన్న కళ్ళల్లో కనిపించని ఎన్నో దు:ఖ సముద్రాలు దాగుంటాయి. అవేవీ తన బిడ్డలకు కనిపించనీయడు. తన పిల్లల కోసం నిత్యం పరితపిస్తూ, తనలాగా తన పిల్లలు ఇబ్బందులకు గురి కావొద్దని ఆకాంక్షించే నిస్వార్థపరుడు. పరిస్థితులు నాన్నని ఎంత క్షోభకి గురిచేసినప్పటికీ, తన పిల్లలకు మంచి భవిష్యత్ ఇయ్యాలనే కలలు కంటూ, మదన పడుతూ ఉంటాడు.

కొన్నింటిని అందరికీ చెప్పలేం/ దాచి దాచి లోలోపల/ కుమిలి పోతాం/ కొన్నింటిని కొంచెం కొంచెం అచేతనంలోకి నెట్టేయాలి/ విడవని బంక లాంటి ఊసుల్ని/ తీగలు తీగలుగా తొలగించాలి మరి/ అవును!/ జ్ఞాపకాలు తొరగా ఆరాలంటే/ వ్యాపకాల వింజామరతో విసరాలి.

మనసులో గూడుకట్టుకున్న అనేకానేక విషయాల్ని అందరితో పంచుకోలేం. అశ్రువులు నిండిన నయనాలు చూసి హేళన చేస్తారనో, లోకువైపోతామనో లోలోనే కుమిలిపోతాం. వాటిని ఏదొక వ్యాపకంతో కొద్దీ కొద్దిగా వదిలించుకోవాలి. అప్పుడే మనసు తేలికవుతుంది. కవిత్వం చాలామంది రాస్తారు, కానీ అనుభవాన్ని రంగరించి అలవోకగా అర్థమయ్యే విధంగా కొందరే రాస్తారు. అలాంటి కోవకే చెందిన కవి రాజేశ్వరరావు. ఊహించని విధంగా సూక్ష్మ దృష్టితో అలోచించి, తనదైన శైలిలో కవిత్వాన్ని అక్షరీకరిస్తాడు. ఈ కవి నుండి మరెన్నో అద్భుతమైన రచనలు రావాలని సాహిత్య అభినందనలు తెలియజేస్తూ...

కె.శివారెడ్డి కవిత్వస్ఫూర్తి పురస్కారం-2024

కె. శివారెడ్డిగారి పేరిట స్ఫూర్తి పురస్కారాల కోసం 35 సంవత్సరాల లోపు కవుల నుండి 2023 సంవత్సరంలో ముద్రితమైన కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. మూడు ప్రతులను జులై 10వ తేదీలోపు ఇబ్రహీం నిర్గుణ్, 15.5.112/1/బి, స్కైలైన్ టవర్స్ ఎదురుగా, చైతన్యనగర్, ఖమ్మం-507002, తెలంగాణ చిరునామాకు పంపాలి. వివరాలకు: 9063696968.

పాలపిట్ట దాశరథి శతజయంతి సంచిక కోసం...

జులై 22న దాశరథి కష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభ సందర్భంగా సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా మొదలైన అన్ని రంగాలలో దాశరథికి సంబంధించిన ప్రతి అంశాన్ని రికార్డు చేయాలని పాలపిట్ట భావిస్తున్నది. దాశరథి కష్ణమాచార్యులతో సాహిత్య సంబంధం గలవారు, వారితో తాము పాల్గొన్న, కలిసి దిగిన ఫొటోలను, వారు రాసిన ఉత్తరాలను, దాశరథి తొలినాళ్ళ పుస్తకాల కవర్ పేజీలను పంపించవలసిందిగా కోరుతున్నారు. రచనలు, సూచనలు, ఫొటోలు పంపించవలసిన చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500044. వివరాలకు : 9490099327.

గీతమ్ పురస్కారం కొరకు...

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కథా సంపుటాల పోటీ నిర్వహించి గీతమ్ పురస్కారం నిర్వహిస్తున్నారు. పోటీ కొరకు 2016 - 2024 మధ్య కాలంలోని సంపుటాలను జులై 5 లోపు మూడు కాపీలను ఓలేటి వెంకటేశ్వర రావు, అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450 చిరునామాకు పంపాలి.

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు - 2023

శివేగారి దేవమ్మ కథా పురస్కారాల కొరకు 2022, 2023 లో ప్రచురించిన కథా సంపుటాలు, బాలల కథా సంపుటాల పురస్కారాల ఫలితాలు వెలువరించారు. మునిసురేష్ పిళ్లై (గారడీ వాడు), కుసుమంచి నాగేంద్ర (చందమామలో మేనమామ), ఆర్.సి. కష్ణస్వామి రాజు (కార్వేటినగరం) రచించిన కథా సంపుటాలు ఎంపిక అయ్యాయి. **- కె.వి. మేఘనాథ్ రెడ్డి, 6300318230**

ఏడు రంగుల జండా పుస్తకావిష్కరణ

ఈ నెల 13 వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో అమరవాది నీరజ రచించిన 'ఏడు రంగుల జండా' పుస్తకావిష్కరణ జరుగుతుంది. భాషా సాంస్కృతిక శాఖ, అమరవాది ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆచార్య సి.మృణాళినికి శ్రీమతి అమరవాది హైమవతీ- డా.ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్ సాహిత్య పురస్కారం, గరిపెల్ల అశోక్‌కి డా॥ఎ.సి.ఎం.ఎల్.ప్రసాద్-శ్రీమతి హైమవతి బాలసాహిత్య పురస్కారం అందజేస్తారు. ఈ సభలో మణికొండ వేదకుమార్, డా॥పత్తిపాక మోహన్, డా॥జుర్రు చెన్నయ్య, చొక్కాపు వెంకటరమణ పాల్గొంటారు.

సీన్ రివర్స్...!



- దళితుల మద్దతు కోల్పోయిన బీజేపీ
- 16 సిట్టింగ్ రిజర్వ్‌డ్ స్థానాల్లో ఓటమి
- 'ఇండియా'కే జై కొట్టిన ఎస్సీలు
- ఆ పార్టీలకు 46 శాతం ఓట్లు
- కాషాయ పార్టీ కొంపముంచిన బీఎస్పీ

న్యూఢిల్లీ : దశాబ్ద కాలం తర్వాత లోక్‌సభలో బీజేపీ మెజారిటీ కోల్పోయింది. 240 స్థానాలు గెలుచుకొని సభలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. భారీ మెజారిటీతో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారాన్ని ఓటర్లు విశ్వసించారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు బీజేపీని పక్కన పెట్టి ఇండియా బ్లాక్‌కు ఓటేశారు. దేశంలో 156 లోక్‌సభ స్థానాల్లో ఎస్సీల ప్రభావం గణనీయంగా ఉంది. వీటిలో ఇండియా బ్లాక్‌కు 93, ఎన్డీఏకు 57, ఇతరులకు 6 స్థానాలు లభించాయి. ఎస్సీల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలకు సంబంధించి 2019 ఎన్నికలతో పోలిస్తే ఇండియా బ్లాక్ 53 సీట్లను అదనంగా గెలుచుకోగా ఎన్డీఏ 34 స్థానాలను కోల్పోయింది. ఇతర పార్టీలు కూడా 19 స్థానాలను చేజార్చుకున్నాయి.

రాజ్యాంగం ప్రమాదంలో పడిందంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారం ఎస్సీ ఓటర్లపై బాగా ప్రభావం చూపింది. రాజ్యాంగాన్ని మారిస్తే తమ మనుగడే ప్రమాదంలో పడుతుందని వారు భావించారు. ముఖ్యంగా తమ ఉపాధి వనరులు దెబ్బ తింటాయని ఎస్సీలు ఆందోళన చెందారు. తాము గతంలో బీజేపీకే ఓటు వేశామని, అయితే ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి తమకు నష్టం కలిగిస్తుందని, అందుకే ఈసారి సమాజ్‌వాదీ పార్టీకి ఓటేశామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు బాహాటంగానే చెప్పారు.

ఎవరికి ఎన్ని ?

ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ గతంతో పోలిస్తే సగం స్థానాలను కోల్పోయింది. 2019 ఎన్నికల్లో కంటే ఆ పార్టీకి ఏకంగా 9 శాతం ఓట్లు తగ్గాయి. దళితులు, వెనుకబడిన తరగతుల వారు బీజేపీని వ్యతిరేకించారు. ముఖ్యంగా దళితులంతా ప్రతిపక్ష కూటమికే జై కొట్టారు. దేశ జనాభాలో ఎస్సీలు 17 శాతంగా ఉన్నారు. వీరిలో అత్యధికుల మద్దతును ఎన్డీఏ కోల్పోయిందని ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా సర్వే స్పష్టం చేసింది. ఆ మద్దతు ఈసారి ప్రతిపక్షాలకు లభించింది. ఎస్సీల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 6 శాతం ఓట్లను కోల్పోగా కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రెండంకెల ఓటు షేర్‌ను పొందింది. 2019 ఎన్నికల్లో ఎన్డీఏకు 41 శాతం ఓట్లు రాగా ఇప్పుడు 35 శాతం మాత్రమే వచ్చాయి. అదే సమయంలో ప్రతిపక్ష కూటమి ఓట్లు 46 శాతానికి పెరిగాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది 18 శాతం ఎక్కువ. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా బ్లాక్ సాధించిన ఓట్ల మధ్య 11 శాతం వ్యత్యాసం ఉంది. ఇతర పార్టీలకు లభించిన ఓట్లు 31 శాతం నుంచి 19 శాతానికి తగ్గిపోయాయి.

ఏ గట్టునా లేని వారికీ నిరాశే

ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే అటు ఎన్డీఏలోనూ, ఇటు ఇండియా బ్లాక్‌లోనూ లేని పార్టీలు ఎస్సీల మద్దతు కోల్పోయాయి. ఎస్సీలలో ఎన్డీఏ యేతర, ఇండియా బ్లాక్ యేతర పార్టీల ఓటింగ్ 12 శాతం పడిపోయింది. 2019 ఎన్నికల్లో ఎన్డీఏ, ఇతరులతో పోలిస్తే ప్రస్తుత ఇండియా బ్లాక్‌లోని పార్టీలకు ఎస్సీల్లో పెద్దగా ఆదరణ లభించలేదు. కానీ ఈ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. ఎస్సీల్లో దాదాపు సగం (46 శాతం) ఓట్లు ఇండియా బ్లాక్‌కు పడ్డాయి.

రిజర్వ్‌డ్ స్థానాల్లో...

లోక్‌సభలో 84 ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. 2014లో వీటిలో కాంగ్రెస్‌కు 7, బీజేపీకి 40, ఇతరులకు 37 స్థానాలు వచ్చాయి. 2019లో కాంగ్రెస్‌కు 6, బీజేపీకి 46, ఇతరులకు 32 సీట్లు లభించాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 20, బీజేపీకి 30, ఇతరులకు 34 స్థానాలు దక్కాయి. ఓట్ల శాతం విషయానికి వస్తే 2014లో కాంగ్రెస్‌కు 17.6 శాతం, బీజేపీకి 27.6 శాతం, ఇతరులకు 54.8 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో కాంగ్రెస్‌కు 16.7 శాతం, బీజేపీకి 35.3 శాతం, ఇతరులకు 47.9 శాతం ఓట్లు పడ్డాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 21.1 శాతం, బీజేపీకి 35.2 శాతం, ఇతరులకు 43.7 శాతం ఓట్లు లభించాయి. 2019లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల కంటే బీజేపీకి రెట్టింపు ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికలకు వచ్చేసరికి కాంగ్రెస్ ఓట్లు 21 శాతానికి పెరిగాయి. ఓట్లు సుమారు ఐదు శాతం పెరగ్గా సీట్లు మాత్రం మూడు రెట్లకు పైగా పెరిగాయి. అదే సమయంలో బీజేపీ భారీగా... 16 స్థానాలు నష్టపోయింది. ఈ ఎన్నికల్లో బీజేపీ కోల్పోయిన మొత్తం స్థానాల్లో ఇది నాలుగో వంతు.

బీఎస్పీ దెబ్బతినడంతో...

ఒకప్పుడు ఎస్సీల ఓట్లను అధిక సంఖ్యలో సాధించి ఓ వెలుగు వెలిగిన బీఎస్పీ ఇప్పుడు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి చేరింది. గతంలో కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉన్న ఎస్సీలు ఇప్పుడు మళ్లీ ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామం బీజేపీకి నష్టం కలిగిస్తోంది. ఇండియా టుడే పత్రికకు చెందిన ఎలక్షన్ ఇంటెలిజెన్స్ డాష్‌బోర్డు ప్రకారం 156 లోక్‌సభ స్థానాల్లో ఎస్సీల సంఖ్య గణనీయంగా ఉంది. వీటిలో ఇండియా బ్లాక్ 93, ఎన్డీఏ 57 స్థానాలు గెలుచుకున్నాయి. 2019తో పోలిస్తే ఇండియా బ్లాక్ 53 స్థానాలను అదనంగా గెలుచుకోగా ఎన్డీఏ 34 సీట్లు కోల్పోయింది.

కాషాయ నేతల అంతర్మథనం

సున్నితమైన కుల సమీకరణల విషయంలో వైఫల్యం, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వం-పార్టీ మధ్య సమన్వయం కొరవడడం, అభ్యర్థుల పట్ల ఆగ్రహం వంటి అంశాలు ఓటమికి కారణమయ్యాయని కాషాయ పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో పార్టీ ఓటమికి కారణాలను కొందరు నాయకులు విశ్లేషించారు. ప్రజల ఆగ్రహాన్ని చవిచూస్తున్న ఎంపీలకే మళ్లీ టిక్కెట్లు ఇవ్వడం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు తమను పట్టించుకోకపోవడం వంటి పరిణామాలపై ఓటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో యాదవేతర ఓబీసీ ఓటర్లతో పాటు దళితులు కూడా ఇండియా బ్లాక్‌కు ఓటేశారని బీజేపీ నేతలు చెప్పారు. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ ప్రభావం ఏ మాత్రం లేకపోవడంతో దళితుల ఓట్లు ఇండియా బ్లాక్‌కే పడ్డాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఆర్ఎస్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రచారంలో భాగస్వాములు కాలేదని చెప్పారు. 2019తో పోలిస్తే ఈ ఎన్నికల్లో హర్యానా, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో గణనీయంగా దెబ్బతిన్నామని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిషా, కర్నాటక ఆదుకోకపోతే బీజేపీకి 200 స్థానాలు కూడా దక్కేవి కావని తెలిపారు.

అధ్యక్ష పాలన గుర్తుకొచ్చింది !

- సర్వాధికారాలు పీఎంఓవే
- ప్రభుత్వ వ్యవహారాలు చక్కబెట్టిన అధికారులు
- బ్రాండ్ మోడీ ఇమేజ్ పెంచేందుకు ప్రయత్నాలు



న్యూఢిల్లీ : కేంద్రంలో నరేంద్ర మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని కార్యాలయం సర్వాధికారాలు చెలాయించింది. అక్కడ అధికారులు ఆడింది ఆట...పాడింది పాట. కార్యాలయంలో పనిచేసిన పలువురు సీనియర్ అధికారులు తమ అధికార పరిధిని అతిక్రమించి వివిధ రాష్ట్రాల్లో ప్రధాని ఇమేజ్‌ను పెంచేందుకు అహర్నిశలూ కృషి చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే పీఎంఓ వ్యవహార శైలి అధ్యక్ష తరహా పాలనను గుర్తుకు తెచ్చింది.

జీ-20 అధ్యక్ష స్థానాన్ని చేపట్టడానికి ముందు ప్రధాని కార్యాలయంలో (పీఎంఓ) భారతీయ విదేశీ సర్వీసుల (ఐఎఫ్ఎస్) అధికారుల సంఖ్య ఏడుకు పెరిగింది. 2022 నవంబరులో విపిన్ కుమార్, నిధి తెవారీలతో పాటు సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి దీపక్ మిట్టల్‌ను పీఎంఓలోకి తీసుకొచ్చారు. మిట్టల్‌ను ఓఎస్డీగా, కుమార్‌ను డిప్యూటీ సెక్రటరీగా, తెవారీని అండర్ సెక్రటరీగా నియమించారు. జీ-20 సదస్సు తర్వాత పీఎంఓ వెబ్‌సైటులోని అధికారుల జాబితాను పరిశీలించగా ఐదుగురు ఐఎఫ్ఎస్ అధికారులకు వేర్వేరు పోస్టులు ఇచ్చారు.

జీ-20 దేశాల అధ్యక్ష పదవి రొటేషన్ పద్ధతిలో సభ్య దేశాలకు దక్కుతూ ఉంటుంది. ఇప్పుడది మన దేశానికి లభించింది. అందులో విశేషమేమీ లేదు. కానీ మోడీని భారత ప్రజల దృష్టిలో ఓ బలమైన ప్రపంచ నేతగా చూపేందుకు ఆయన కార్యాలయం సంవత్సరం పాటు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించింది.

మోడీ హయాంలో పీఎంఓ దాదాపు అధ్యక్ష తరహా పాలనను తలపిస్తూ వ్యవహారాలు నడిపింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశంలో అధ్యక్ష తరహా పాలనను గుర్తుకు తేవడం, మోడీకి బ్రాండ్ ఇమేజ్ కల్పించడానికి ప్రయత్నించడం, బీజేపీ పోటీ చేసిన ప్రతి ఎన్నికలోనూ మోడీని ముందుకు తేవడం...వీటన్నింటినీ గమనిస్తే దేశాన్ని ఏ వైపుకు నడిపేందుకు ప్రయత్నం జరిగిందో అర్థమవుతుంది.

రామ మందిరం కోసం...

పీఎంఓలోని మరో అధికారి ఏకే శర్మను ఉత్తరప్రదేశ్‌కు పంపారు. 2022 శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన శర్మ, గెలుపొందిన తర్వాత యోగి క్యాబినెట్‌లో మంత్రిగా చేరారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతున్న సమయంలోనే శర్మ యూపీ ప్రభుత్వంలో చేరారు. అయోధ్యలో జరిగిన రామమందిర నిర్మాణంలో పీఎంఓలోని మరో అధికారి నృపేంద్ర మిశ్రా ప్రమేయం కూడా ఉంది. 2019 ఆగస్టులో పీఎంఓలో ప్రిన్సిపల్ సెక్రటరీ పదవికి రాజీనామా చేసిన మిశ్రా, కొద్ది వారాల తర్వాత నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. నెల రోజుల తర్వాత ఆయనకు మందిర నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జనవరిలో బాలరాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిగింది ఆయన ఆధ్వర్యంలోనే.

అధికార పరిధిని అతిక్రమించి...

గత ఐదు సంవత్సరాల ఏలుబడిలో మోడీ ప్రభుత్వం అధ్యక్ష తరహా పాలనను గుర్తుకు తెచ్చిందనడంలో సందేహం లేదు. అందుకు పీఎంఓ ఇతోధికంగా తోడ్పాటు అందించింది. పీఎంఓలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన కొందరు అధికారులు క్యాబినెట్ నియామకాల కమిటీ (ఏసీసీ) సూచనల మేరకు ప్రభుత్వ వ్యవహారాలలో తల దూర్చారు. అనేక సందర్భాలలో వారు తమ అధికార పరిధిని అతిక్రమించారు. తద్వారా బలమైన నాయకుడిగా ప్రధానికి ఉన్న పేరు ప్రతిష్టలను దిగజార్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే పీఎంఓ అధికారుల ద్వారానే ప్రభుత్వ వ్యవహారాలన్నీ నడిచాయి.

ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణలో బజాజ్

అధ్యక్ష తరహా పాలనను నడపడానికి మోడీకి సహకరించిన మరో అధికారి తరుణ్ బజాజ్. 2015-17 మధ్య కాలంలో పీఎంఓలో పనిచేసిన బజాజ్‌ను ఆర్థిక శాఖ కార్యదర్శిగా పంపారు. వాస్తవానికి ఆయన రెవెన్యూ కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర బడ్జెట్లను పర్యవేక్షించేది రెవెన్యూ కార్యదర్శే. బడ్జెట్‌లో కీలక పద్దు అయిన పన్నుల వ్యవహారాలను ఆయనే చూసుకునే వారు. కార్పొరేట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా నెరవేర్చారు. మోడీ ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలన్నీ బజాజ్ ఆధ్వర్యంలోనే జరిగాయి. 2022 వరకూ ఆయన ఆ పదవిలోనే కొనసాగారు.

వ్యవహారాలు చక్కదిద్దిన క్వాత్రా

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు నిమిత్తం 2016 అక్టోబరులో మోడీ ప్రభుత్వం ఫ్రాన్స్‌తో ఎంఓయు కుదుర్చుకుంది. పీఎంఓలో ఓఎస్డీగా ఉన్న వినయ్ మోహన్ క్వాత్రాను 2017 జులైలో రాయబారిగా పారిస్ పంపారు. రఫేల్ ఒప్పందం వివాదాస్పదమైన సమయంలోనే పీఎంఓలోని ఉన్నతాధికారిని ఫ్రాన్స్‌లో భారత రాయబారిగా పంపడంపై విమర్శలు వచ్చాయి. క్వాత్రా 2020 ఫిబ్రవరి వరకూ ఫ్రాన్స్‌లోనే ఉన్నారు. ఆ సంవత్సరం మార్చిలో క్వాత్రాను భారత రాయబారిగా నేపాల్‌కు పంపారు.

మన దేశంలోని కొన్ని ప్రాంతాలను తనవిగా చూపుతూ నేపాల్ వివాదాస్పద మ్యాప్‌ను రూపొందించింది. దీనిపై ఆ దేశంతో చర్చలు జరుగుతున్న సమయంలోనే క్వాత్రా అక్కడికి వెళ్లారు. 2020 మేలో మ్యాప్‌ను నేపాల్ క్యాబినెట్ ఆమోదించింది. మ్యాప్‌పై భారత రాయబారిగా క్వాత్రా నేపాల్‌లో అనేక కీలక సమావేశాలు నిర్వహించారు.

2022 ఏప్రిల్‌లో మోడీ ప్రభుత్వం క్వాత్రాను తదుపరి విదేశాంగ కార్యదర్శిగా ప్రకటించింది. 2023 ఫిబ్రవరిలో క్వాత్రా నేపాల్ వెళ్లి ప్రధాని ప్రచండను భారత్‌కు ఆహ్వానించారు. సరిహద్దు వివాదంపై ఎన్ని చర్చలు జరిగినప్పటికీ నేటి వరకూ సమస్య పరిష్కారం కాలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా ఈ వివాదం తెర పైకి వచ్చింది. క్వాత్రాపై మోడీకి ఉన్న నమ్మకం కారణంగా ఆయన ఈ సంవత్సరం అక్టోబర్ వరకూ పీఎంఓలో విదేశాంగ కార్యదర్శిగా కొనసాగుతారు.

లంకలో బగ్లే

ఇప్పుడు మరో ఐఎఫ్ఎస్ అధికారి గోపాల్ బగ్లే విషయానికి వద్దాం. 2017 నుండి పీఎంఓలో జాయింట్ సెక్రటరీగా ఉన్న బగ్లే 2022 మేలో శ్రీలంకలో భారత హైకమిషనర్‌గా నియమితులయ్యారు. 2023 డిసెంబర్ వరకూ అక్కడే ఉన్న బగ్లేను ఆస్ట్రేలియాకు రాయబారిగా పంపారు. శ్రీలంక విద్యుత్ కారిడార్ల విషయంలో మోడీ ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచేందుకు బగ్లే చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశారు. అంతేకాదు... బగ్లే శ్రీలంకలో ఉన్న సమయంలోనే మోడీ ప్రభుత్వం ఆ దేశానికి నాలుగు బిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని అందించింది.

ఖతార్‌లో మిట్టల్

2020 ఏప్రిల్‌లో ఐఎఫ్ఎస్ అధికారి దీపక్ మిట్టల్‌ను ఖతార్‌లో భారత రాయబారిగా నియమించారు. ఇజ్రాయిల్ తరఫున గూఢచర్యం నెరపుతున్నారన్న ఆరోపణలపై ఆ సంవత్సరం ఆగస్టులో ఎనిమిది మంది నౌకాదళ అధికారులను ఖతార్ అరెస్ట్ చేసింది. వీరిని విడుదల చేయించే విషయంపై మిట్టల్ 2022 నవంబర్ వరకూ ఖతార్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతూనే ఉన్నారు. ఆ నెలలో మిట్టల్‌ను ప్రధాని సలహాదారుగా పీఎంఓలోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ మిట్టల్ తన ప్రయత్నాలు కొనసాగించారు. గత ఏడాది డిసెంబరులో దుబాయ్‌లో మోడీ, ఖతార్ ఎమిర్ మధ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నౌకాదళ అధికారులను ఖతార్ విడుదల చేసింది.

సుష్మను పక్కన పెట్టి...

సుష్మా స్వరాజ్ విదేశాంగ మంత్రిగా ఉన్నప్పుడే పీఎంఓ పెత్తనం నడిచింది. మోడీ జరిపిన కొన్ని విదేశీ పర్యటనల్లో సుష్మ భాగస్వామి కాలేదు. మీడియాతో సమావేశాలు నిర్వహించినప్పుడు కూడా ఆమెను పక్కన పెట్టారు. ఆమె తన పదవీకాలంలో ఒక్కసారి కూడా మీడియాకు ఇంటర్వ్యూ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో...నిన్నటి వరకూ విదేశాంగ మంత్రిగా వ్యవహరించిన జైశంకర్‌కు తత్వం బోధపడింది. విదేశీ వ్యవహారాలలో బ్రాండ్ మోడీ పాత్రను అర్థం చేసుకున్న ఆయన అంతా ప్రధానికే వదిలేశారు.

మేము సైతం అన్న అధికారులు

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అమర్‌జీత్ సిన్హాను 2020 ఫిబ్రవరిలో మోడీ సలహాదారుగా నియమించారు. 2021 ఆగస్టులో ఆయన పీఎంఓకు రాజీనామా చేసినప్పటికీ 2022 నవంబరులో తిరిగి మోడీ ప్రభుత్వంలో చేరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మాణ పరమైన సంస్కరణలను రూపొందించే కమిటీకి నేతృత్వం వహించారు. ఉత్తరాఖండ్‌లో మోడీ మందిర ప్రాజెక్టును ముందుకు తీసికెళ్లేందుకు పీఎంఓలోని మరో అధికారి భాస్కర్ ఖుల్బేను అక్కడికి పంపారు. కోవిడ్ సమయంలో పీఎంఓ అధికారి పున్య సలీలా శ్రీవాత్సవ మీడియాకు రోజువారీ బులెటిన్లు విడుదల చేస్తూ మోడీ ఇమేజ్‌ను పెంచే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ టీవీ ఛానల్‌లో ఆయన ప్రతి రోజూ సాయంత్రం వేళ కోవిడ్ బులెటిన్ చదివేవారు. మోడీ ప్రభుత్వం కోవిడ్ వైరస్‌తో అద్భుతంగా పోరాడుతోందన్న అభిప్రాయాన్ని ప్రజల్లో నాటేందుకు ప్రయత్నిం చారు. మోడీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పీఎంఓ అధికారులు ముర్ము, అమిత్ ఖారేలు కూడా మోడీ ఇమేజ్ పెరగ డానికి తమ వంతు కృషి చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో బీహార్‌లో జరిగిన దాణా కుంభకోణాన్ని వెలికితీసింది ఖారేయే.

మోడీకి జనామోదం ఉన్నదా..?

బీజేపీ పార్లమెంటరీ సమావేశం నిర్ణయించకుండానే.. ఎన్డీఏ నేత ఖరారు

63.44 శాతం మంది ఓటర్లు వ్యతిరేకం

న్యూఢిల్లీ : మోడీకి ప్రధాని అయ్యే అర్హత ఉందా..? హ్యాట్రిక్ పీఎం కావటానికి దేశ ప్రజలు అంగీకరించారా..? అంటే లేదనే చర్చ నడుస్తోంది. అబ్‌కీ బార్ మోడీ సర్కార్.. 400 పార్ అంటూ.. అంతా నేనే అన్నట్టుగా ప్రచారం చేసుకున్నారు మోడీ. వందకు పైనే ప్రచార సభలు నిర్వహించారు. మీ అభ్యర్థిని కాదు.. నన్ను చూసి ఓటేయండని ఓటర్లను కోరారు. అయినా 63.44 శాతం మంది ప్రజలు తిరస్కరించారు.వందకోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో 64 కోట్లకు పైగా ఓటర్లు ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీకి కేవలం 36.56 శాతం మందే ఓటేశారు. మోడీ గ్యారంటీలను తిరస్కరించారు. ప్రధానిగా అక్కర్లేదన్న వారి సంఖ్య 64.34 మంది ఉన్నారు.

మైండ్‌గేమ్..

రెండుసార్లు అధికారంలో ఉన్న మోడీది... మూడోసారి అధికారంలోకి వచ్చి నెహ్రూ పేరిట ఉన్న రికార్డును సమం చేయాలన్నదే లక్ష్యం. స్టాక్ మార్కెట్‌ను సైతం మోడీ బృందం రాజకీయాల్లోకి లాగింది. ఇదిలా వుంటే... ఏడు విడతలుగా జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీకి, మోడీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) చెప్పలేనంత మెహర్బానీ చాటుకుంది. దీనికి తోడు ఎగ్జిట్ పోల్స్‌తో దేశప్రజల్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేశారు. చివరికి మోడీ బండారం బట్టబయలైంది. బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ దక్కలేదు. దేశప్రజలు వద్దన్నారు. ఎట్టకేలకు ఎన్‌డీఏ పక్షాల మద్దతుతో గట్టెక్కారు. అయితే అధికారంలోకి రావడానికి మోడీ చేసిన ప్రయత్నాలపైనే పలు ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

బీజేపీ పార్లమెంట్ కమిటీ సమావేశం పెట్టకుండానే..

రాష్ట్ర స్థాయిలోనైనా.. జాతీయస్థాయిలోనైనా ఏదైనా పార్టీ గెలిచినపుడు.. ఆ పార్టీ అత్యున్నత కమిటీ శాసనసభాపక్షనేతను ఎంపిక చేయటం ఆనవాయితీ. కానీ మూడోసారి మోడీ గెలిచాక..బీజేపీ పార్లమెంటరీ కమిటీ సమావేశమే నిర్వహించలేదు. ఈ సమావేశంలో మోడీని ఏకగ్రీవంగా ఎన్నుకోకముందే.. ఎన్డీఏ కూటములతో బేరం పెట్టేసి.. హడావుడిగా ఎన్డీఏ పక్ష నేతగా ఎంపిక చేసేశారు. దీన్ని బట్టి మోడీలో ఉన్న ఆందోళన.. సీటు కోసం ఎంతగా తపనపడ్డారో స్పష్టమవుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

పాత సీసాలో..

మోడీ పదేండ్ల పాలనలో ఊకదంపుడు ఉపన్యాసాలతో విసిగి వేసారిన దేశప్రజలు ఈసారి కేంద్రంలో మార్పు కనిపిస్తుందని ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ అదే మోడీ బృందం (ఎన్డీఏ) మూడోసారి (సంకీర్ణ సర్కార్) అధికారంలోకి వచ్చింది.ఇప్పటికిప్పుడు అంతా బాగానే ఉన్నట్టనిపించినా... బీజేపీకి సొంత బలం లేకపోవటం మోడీకి ముమ్ముందు సవాలుగానే మారనున్నది.

మోడీ చరిష్మా డౌన్..


పార్టీలు	2014 (ఓట్ల శాతం)	2019 (ఓట్ల శాతం)	2024 (ఓట్ల శాతం)
బీజేపీ	31	37.49	36.56
కాంగ్రెస్	19.31	19.49	21.19

వారణాసిలోనూ..

అభ్యర్థులు	2014 (ఓట్ల శాతం)	2019 (ఓట్ల శాతం)	2024 (ఓట్ల శాతం)
మోడీ	56.37	63.62	54.24
ఆప్	20.38	18.40	....
కాంగ్రెస్	....	....	40.74

ఓటర్లలో మార్పు

- రాజకీయాలను అర్థం చేసుకోవటానికి పలు మాధ్యమాలపై ఆధారం
- ప్రధాన స్రవంతి మీడియాపై తగ్గిన విశ్వాసం
- డిజిటల్ కంటెంట్‌ను ఆదరించిన ప్రజలు
- ఎన్నికల ఫలితాలతో స్పష్టం : విశ్లేషకులు, నిపుణులు



న్యూఢిల్లీ : దేశంలోని మీడియా విశ్వసనీయత ప్రమాదంలో పడింది. ముఖ్యంగా, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది తీవ్రమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దేశ ప్రజలను కల్పిత వార్తలతో ప్రభావితం చేస్తూ, బీజేపీకి, మోడీకి లబ్ది చేకూర్చేలా మీడియా తీరు ఉన్నది. అయితే, ఇప్పుడు దేశ ఓటర్లలో మార్పు వచ్చిందనీ, రాజకీయాలను లోతుగా అర్థం చేసుకోవటానికి ఇతర మాధ్యమాలపై ఆధారపడుతున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మీడియా సంస్థ ఏ రాజకీయపార్టీకి అనుకూలం? దాని సిద్ధాంతం ఏమిటి? దేని ఆధారంగా పని చేస్తున్నది? వార్తల్లో వాస్తవమెంత? అనే పలు కోణాల్లో ఓటర్లు ఆలోచన చేస్తున్నారని చెప్తున్నారు.

ఈ మార్పు ఫలితంగానే లోక్‌సభ ఎన్నికల్లో మోడీ సర్కారుకు తీవ్ర ఎదురుదెబ్బ తగిలిందని మేధావులు అంటున్నారు. ఈ ఎన్నికలు భారతదేశ ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛతో పాటు విశ్వసనీయ సమాచారం గురించి మరింత అవగాహన కలిగి ఉన్నాయని సూచిస్తున్నాయని చెప్తున్నారు. నిరంకుశ ధోరణి ఉన్న ప్రభుత్వం జీర్ణించుకోవాల్సిన విషయమిదని అంటున్నారు. "ఎన్నికల అజెండాలను రూపొందించటంలో మీడియా వినియోగం కేంద్రీకృతమై ఉండటం మీడియా సిద్ధాంతకర్తల మధ్య తీవ్ర చర్చనీయాంశమైంది.

ముఖ్యంగా, ఎన్నికల సమయంలో వార్తాపత్రికలు, టెలివిజన్, రేడియోలలో వార్తా కవరేజీ నిష్పక్షపాతంగా జరగలేదు" అని వారు వాదిస్తున్నారు.ప్రధాన స్రవంతి మీడియా మీద ఆధారపడే రోజుల నుంచి సోషల్ మీడియాపై ఆధారపడే కాలానికి సమాజం చేరుకున్నదనీ, అయితే, సోషల్ మీడియా పైనా మోడీ సర్కారు ఆంక్షలు విధించిందని వారు గుర్తు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో సోషల్ మీడియా చాలా బాగా పని చేసిందనీ, మోడీ ప్రభుత్వ వైఫల్యాలను పలువురు యూట్యూబర్లు, ఇన్‌ఫ్ల్యూయెన్సర్లు ప్రజల్లోకి తీసుకెళ్లటంలో విజయం సాధించారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారం ద్వారా మోడీ తన మెజారిటీలను (వరుసగా 282, 303 సీట్లుగా) పెంచుకుంటూ వచ్చారు. ఇందులో ప్రధాన స్రవంతి మీడియా కూడా ప్రధాన భూమిక పోషించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఈ సారి ప్రజల్లో తీవ్రమైన మార్పు వచ్చిందనీ, పదేండ్ల మోడీ పాలనపై తీవ్ర అసంతృప్తి వచ్చి నిజాలు తెలుసుకోవటానికి ఇతర మాధ్యమాలను ఆశ్రయించారని నిపుణులు చెప్తున్నారు.

ఈ ఎన్నికల ప్రచారంలో మోడీ మీడియా అధికార నిర్మాణాలు పూర్తిగా చెక్కుచెదరకుండా ఉన్నాయంటున్నారు.

" ప్రచారంలో మోడీ-కేంద్రీకృత హెడ్‌లైన్‌లు, దేశవ్యాప్తంగా ఆయన నిర్వహించిన 206 ర్యాలీల గురించి అనేక ఛానెళ్లు అధిక కవరేజీని ఇచ్చాయి. ప్రధానమంత్రి వ్యక్తిగత వెబ్‌సైట్ కూడా ఈ ప్రచారంలో భాగమైంది. ప్రాంతీయ వార్త పత్రికలు, ఛానెళ్లు సైతం మోడీకి విపరీతమైన ప్రచారాన్ని కల్పించాయి. కానీ ఇవేమీ ఆయనకు అఖండమైన విజయాన్ని తెచ్చిపెట్టలేకపోయాయి" అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీకి ఈ విధమైన గెలుపు చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా మారిందని అంటున్నారు. తన ఖాతాలో ఉన్నదని భావించిన అనేక నియోజకవర్గాల్లో సైతం బీజేపీ విజయం సాధించలేకపోయిందని చెప్తున్నారు. 'అబ్ కీ బార్, చార్ సౌ పార్' నినాదాలు చేస్తూ మోడీ రాజకీయంగా పలచనయ్యారని అంటున్నారు. 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్న మోడీ.. ఎన్డీఏ కూటమికి 300 సీట్ల వరకు కూడా తీసుకురాలేకపోయారని చెప్తున్నారు. బీజేపీకి తీవ్రంగా నష్టం కలిగించిన యూపీ, పశ్చిమ బెంగాల్‌లోని ప్రజలు.. వార్త కథనాలు, వాస్తవాల కోసం ప్రధాన స్రవంతి మీడియానే నమ్ముకోకుండా ఇతర యూట్యూబ్ ఛానెళ్ల పైనా ఆధారపడ్డారనీ, దీంతో అయోధ్య వంటి ప్రాంతంలోనూ కాషాయపార్టీ ఓటమిపాలైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇటీవల వెలువడిన గ్లోబల్ ఫ్యాక్ట్ 10 రీసెర్చ్ రిపోర్టు ప్రకారం.. పాశ్చాత్య దేశాల్లోని ప్రజలు ఇప్పటికీ సంప్రదాయ ప్రధాన స్రవంతి మీడియాను ఎక్కువగా విశ్వసిస్తున్నారు. డిజిటల్‌గా పొందే కంటెంట్‌పై వారు అపనమ్మకంతో ఉన్నారు. భారత్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నది.

ప్రధాన స్రవంతి మీడియా కంటే.. సోషల్ మీడియా వంటి ఇతర డిజిటల్ కంటెంట్‌ను భారత ప్రజలు ఎక్కువగా విశ్వసిస్తున్నారు. ముఖ్యంగా, ధ్రువ్ రాఠీ, రవీష్ కుమార్ లు ఇచ్చే వార్త కంటెంట్‌లు ప్రజలను తీవ్రంగా ఆకర్షించాయనీ, మోడీ ప్రభుత్వ వైఫల్యాలను వారు చక్కగా బయటపెట్టగలిగారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. "కొత్త మోడీ ప్రభుత్వం దాని కొత్త సంకీర్ణ భాగస్వాములచే నిర్బంధించబడుతుంది. కానీ దాని స్వంత కథనం ప్రాముఖ్యతకు ప్రారంభమైన ముప్పును నియంత్రించటానికి అది ఖచ్చితంగా చేయగలిగినదంతా చేస్తుంది. ఈ ప్రయోజనం కోసం ఇప్పటికే ఒక ప్రత్యేక బహుళార్థసాధక వాహనం సిద్ధం చేసుకున్నది. ప్రభుత్వం చెప్తున్న చేస్తున్న డిజిటల్ ఇండియా బిల్లును ఇందుకు సాధనంగా వినియోగించే అవకాశం ఉన్నది" అని అంటున్నారు.దేశంలో కనీసం 170 టెలివిజన్ న్యూస్ ఛానెల్‌లు ఉన్నాయి.

జూన్ 4న వాటిలో గణనీయమైన సంఖ్యలో ఓట్ల లెక్కింపు, అంతిమ తీర్పుపై ప్రసారం చేశాయి. "వారి కథనాలు ఎంత స్వతంత్రంగా ఉన్నాయి? అధికారంతో నిజం మాట్లాడటం మరిచి, ఈ ఛానెల్స్ కూడా నిజం మాట్లాడే పనిలో ఉన్నాయా? మోడీ ప్రభుత్వం తన గత రెండు పర్యాయాలలో సాధించిన ప్రధాన "విజయాల"లో ఒకటి, మీడియా స్క్రిప్ట్‌లను తన ఇష్టానికి అనుగుణంగా రూపొందించడంలో విజయం సాధించటం. రెండోది, వినని వార్త ఛానెళ్లను దారిలోకి తెచ్చుకోవటానికి పలు మార్గాలను అన్వేషించటం" అని విశ్లేషకులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

సేవ చేయటానికా.. సంపద పెంచుకోవటానికా..?

గుజరాత్ ఎంపీలు వంద శాతానికి మించి పోగేసుకున్నారు : ఏడీఆర్ డేటా



గాంధీనగర్ : గుజరాత్ నుంచి ఎన్నికైన 26 మంది ఎంపీలలో 12 మంది తమ నియోజకవర్గాలకు రెండోసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అయితే, 12 మందిలో ఐదుగురి సంపద 2019తో పోలిస్తే 2024లో 100 శాతం కంటే ఎక్కువ పెరిగింది. గెలిచిన 26 మంది ఎంపీల్లో 23 మంది మిలియనీర్లు కాగా, మరో ఐదుగురు నేర చరిత్ర కలిగి ఉన్నారు. మిలియనీర్ ఎంపీల సంఖ్య 2014లో 21గా ఉండగా.. 2019లో అది 24కి చేరింది.ఐదుగురు గుజరాత్ ఎంపీల సంపద గత ఐదేండ్లలో గణనీయంగా 112 నుంచి 273 శాతం పెరిగిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. భరూచ్ నుంచి ఏడుసార్లు గెలిచిన బీజేపీ ఎంపీ మన్సుఖ్ వాసవా సంపద అత్యధికంగా 273 శాతం పెరిగింది. 2019లో, ఆయన ఆస్తుల విలువ రూ.68.35 లక్షలుగా ఉన్నది. ఇది ఈ ఏడాది రూ.2.54 కోట్లకు పెరిగింది. అంటే, రూ.1.86 కోట్ల పెరుగుదల నమోదైంది. వాసవ తన ఆదాయాన్ని తన లోక్‌సభ జీతం, బ్యాంకు వడ్డీ, ఇతర వనరులకు ఆపాదించాడు.జామ్‌నగర్ మహిళా ఎంపీ పూనమ్ మేడమ్ 2019 నుంచి రూ.104 కోట్ల ఆస్తులు పెరగటంతో అత్యధిక సంపద సంపాదించిన వారిలో రెండో స్థానంలో ఉన్నారు. ఆమె సంపద 2019లో రూ 42.73 కోట్ల నుండి 2024లో రూ.147.70 కోట్లకు పెరిగింది. చాలా మంది గుజరాత్ బీజేపీ ఎంపీల సంపద పెరుగుతుండగా.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, నవ్‌సారి ఎంపీ సీఆర్ పాటిల్ ఆస్తులు క్షీణించటం గమనార్హం. 2019 నుంచి 2024 వరకు ఆయన సంపద 11 శాతం తగ్గింది. 2019లో, పాటిల్ ఆస్తుల విలువ రూ.44.60 కోట్లు. కానీ 2024 నాటికి అవి రూ.39.49 కోట్లకు పడిపోయాయి. అంటే, రూ. 5.11 కోట్ల తగ్గుదల కనిపించింది. గాంధీనగర్ ఎంపీ అమిత్ షా, జునాగఢ్ ఎంపీ రాజేష్ చుడాసమా, రాజ్‌కోట్ ఎంపీ పురుషోత్తం రూపాలా, ఛోటా ఉదయ్‌పూర్ ఎంపీ జసు రథ్వా, బనస్కాంత కాంగ్రెస్ ఎంపీ జెనిబెన్ ఠాకోర్‌లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి.2024లో గుజరాత్ నుంచి గెలిచిన 26 మంది అభ్యర్థుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. ఈ సంఖ్య.. 2019లో నాలుగు, 2014లో తొమ్మిదిగా ఉన్నది. 2024లో గెలుపొందిన అభ్యర్థుల్లో (కాబోయే ఎంపీలు) 46 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారనీ, 31 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారని ఏడీఆర్ నివేదిక పేర్కొన్నది. నేర చరిత్ర కలిగిన ఎంపీల శాతం 2019లో 43 శాతం, 2014లో 34 శాతం, 2009లో 30 శాతంగా ఉన్నది.

'నీట్' ఫలితాలపై విచారణ చేపట్టాలి

- డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టీఏ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌టీఏపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్షా కేంద్రం, ఒకే సీరియల్ నంబర్లతో ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.

లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితంతో ముడిపడి ఉన్న ఈ సమస్య పట్ల ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

10 నుంచి 13 వరకు ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్

- టీజీపీఈసెట్ -2024 కన్వీనర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీ.పీ.ఇడీ, డీ.పీ.ఇడీ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఈ నెల 10 నుంచి 13 వరకు శాతవాహనా యూనివర్సిటీ వద్ద ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు టీజీపీఈసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ టెస్ట్ ఉంటుందని వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు : తపస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పండిత్, పీఈటీ పోస్టుల అప్ గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షులు, హన్మంతరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన బీ.ఇడీ ఉండి నష్టపోతున్న ఎస్జీటీలకు న్యాయం చేయాలని వారు కోరారు.

విద్యార్థులతో చెలగాటమాడటం ఆపాలి

- ఏఐడీఎస్ఓ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీట్ ప్రవేశ పరీక్షల్లో అవినీతి, అక్రమాల ఆరోపణలపై న్యాయ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఎయిడ్సో రాష్ట్ర అధ్యక్షులు జె.మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది గ్రేస్ మార్కులను ఇచ్చినందున ఆశ్చర్యం కలిగించే స్కోర్ చాలా మంది సాధించినట్టు ఎన్.టీ.ఏ చెబుతున్న సమాధానం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రవేశ పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలున్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటడాటం ఆపాలని డిమాండ్ చేశారు.

కొలువుదీరిన సంకీర్ణం



(మొదటిపేజీ తరువాయి)

కిషన్ రెడ్డి ప్రమాణం చేశారు. బండి సంజయ్‌కు తొలిసారిగా సహాయ మంత్రిగా మోడీ క్యాబినెట్‌లో చోటు దక్కింది.

హాజరైన అతిథులు

ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పొరుగు దేశాలకు చెందిన అధ్యక్షులతో పాటు, దాదాపు 8 వేల మంది హాజరయ్యారు. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్ సింఘే, మాల్దీవుల అధ్యక్షులు మొహమ్మద్ ముయిజ్జు, సీషెల్స్ వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ అఫీఫ్, బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా, మారిషస్ ప్రధాన మంత్రి ప్రవింద్ కుమార్ జుగ్నాథ్, నేపాల్ ప్రధాన మంత్రి పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే లు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మిత్రపక్షాల నుంచి చంద్రబాబు, పవన్ కల్యాణ్, నితీష్ కుమార్, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు. అలాగే సినీ ప్రముఖులు రజినీ కాంత్, అక్షయ్ కుమార్, షారుఖ్ ఖాన్, వ్యాపార దిగ్గజాలు గౌతం అదానీ, ముకేశ్ అంబానీతో పాటు పలువురు హాజరయ్యారు.

మంత్రివర్గం నుంచి వీరు అవుట్

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి ఎన్నికల్లో ఓడిపోయిన స్మృతి ఇరానీతో పాటు, మాజీ కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, పురుషోత్తమ్ రూపాలా, రాజీవ్ చంద్రశేఖర్, నారాయణ్ రాణే, భారతీ పవార్, రావుసాహెబ్ దాన్వేలకు మంత్రి పదవులు దక్కలేదు.

సహాయ మంత్రి పదవిని తిరస్కరించిన ఎన్సీపీ

సహాయ మంత్రి పదవిని ఎన్సీపీ (అజిత్ పవార్) తిరస్కరించింది. క్యాబినెట్ ర్యాంక్ కావాలని ఎన్సీపీ డిమాండ్ చేస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వంలో స్వతంత్ర బాధ్యత కలిగిన కేంద్ర సహాయ మంత్రిగా ప్రఫుల్ పటేల్‌కు స్థానం కల్పిస్తామన్న బీజేపీ ప్రతిపాదనను ఎన్సీపీ తిరస్కరించింది. బీజేపీ మిత్రపక్షమైన ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేసినందున, స్వతంత్ర బాధ్యత కలిగిన సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించడం తమకు ఇష్టం లేదని స్పష్టం చేసింది. "మేము మా వైఖరిని బీజేపీ నాయకత్వానికి తెలియజేసాం. వారి స్పందన కోసం కొన్ని రోజులు వేచి ఉంటాం" అని ప్రఫుల్ పటేల్ అన్నారు.

చింతచెట్టు తెచ్చిన గొడవ

- దంపతుల మధ్య వాగ్వాదం
- ఆపేందుకు ప్రయత్నించిన తల్లి
- అడ్డొచ్చిన తల్లిని కొట్టి చంపిన కొడుకు

నవతెలంగాణ-శాయంపేట

ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో ఇరువురి మధ్య గొడవ జరుగుతుండగా, గొడవ ఆపడానికి భార్య తన భర్తను ఇంట్లోకి తీసుకెళ్లడంతో ఆవేశంలో భార్యను కొట్టేందుకు భర్త ప్రయత్నించాడు. గమనించిన అతని తల్లి అడ్డు రావడంతో మంచం అడ్డపట్టెతో ఆమె తలపై కొట్టగా తీవ్ర రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకి తీసుకెళ్లారు. అప్పటికే వృద్ధురాలు మోతే అమృతమ్మ (85) మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శనివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సీహెచ్ ప్రమోద్ కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మోతే తిరుపతిరెడ్డి ఇంటి పక్కనే ఉన్న చింతచెట్టు విషయంలో బేతు జయపాల్ రెడ్డితో గొడవపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన తిరుపతిరెడ్డి భార్య నాగరాణి గొడవ సద్దుమణిగేందుకు భర్తను ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆవేశంలో ఉన్న తిరుపతిరెడ్డి తన భార్యతో గొడవపడి కొట్టేందుకు ప్రయత్నించగా, అతని తల్లి అమృతమ్మ ఆపేందుకు అడ్డు వచ్చింది. కోపంలో పక్కనే ఉన్న మంచం అడ్డపట్టెను తీసుకొని తల్లి తలపై కొట్టాడు.

తలకి బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆటోలో పరకాల పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తల్లిని సోదరుడు తిరుపతిరెడ్డి కొట్టి హత్య చేశాడని, కూతురు దూదిపాల రాణి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. పరకాల రూరల్ సీఐ పి.రంజిత్ రావు సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇక పాలనపై దృష్టి

- ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలన పరుగులు
- మూడేండ్లుగా ఒకే చోటున్న అధికారుల బదిలీలు
- సంక్షేమం -అభివృద్ధి జోడెడ్లుగా సాగాలని సర్కారు నిర్ణయం
- మధిరలో అధికారులతో సమీక్షలో : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరుగ్యారంటీల అమలుపై దృష్టి పెట్టిందని, ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచుతూ అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులతో ఆదివారం మధిరలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భట్టి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇక పాలనపై దృష్టి సారించాలని నిర్ణయించినట్టు తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన అన్ని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగానే మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగించుకునే వారికి జీరో బిల్లు మంజూరును అమల్లోకి తెచ్చామన్నారు. హామీ ఇవ్వకపోయినా డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల బకాయిలను మంజూరు చేశామని తెలిపారు. 30 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందజేశామన్నారు. ఈ క్రమంలోనే లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ఒకసారిగా పాలనకు బ్రేక్ పడటంతో కొంత స్తబ్దత ఏర్పడిందని చెప్పారు. కోడ్ ముగిసిన వెంటనే ఈ నెల 9 నుంచి 'సంక్షేమం- అభివృద్ధి' జోడెడ్ల తరహాలో రాష్ట్రంలో పాలన ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి, తాను ప్రణాళికలు రూపొందించి వరుస సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యటనలకు రంగం సిద్ధం చేశామని అన్నారు.

నెలాఖరులోగా ఉద్యోగుల బదిలీలు

ఈ నెలాఖరులోగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం అన్నారు. మూడేండ్లకు పైగా ఒకే చోట పాతుకుపోయిన అధికారులందరినీ కదిలించాలని నిర్ణయించినట్టు చెప్పుకొచ్చారు. దీనిలో భాగంగా ఆదివారం నుంచి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు కార్యాచరణ ప్రారంభమైందన్నారు. ఈనెల చివరకు ఈ ప్రక్రియ ముగియనున్నట్టు చెప్పారు.

వైరా రిజర్వాయర్‌కు ఎన్నెస్పీ నీరు..

నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీరు మళ్లించేందుకు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల కోడ్‌కు ముందే రూ. 75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పనుల పైన సమీక్ష నిర్వహించనున్నారు. ఖమ్మంలో సమీక్ష చేపట్టిన మరుసటిరోజే ఈనెల 13న సాగునీటి ప్రాజెక్టుల పనులు, వాటి ప్రగతిని తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టనున్నారు. నీళ్లు, నియామకాల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదని తెలిపారు. ఈనెల 12న.. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏన్కూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం, కల్లూరు మీదుగా మధిర, సత్తుపల్లి నియోజకవర్గం నాగార్జునసాగర్ ప్రాజెక్టు జోన్-3 ద్వారా కృష్ణా జలాలను అందించడం, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సాగునీటి సరఫరా అంశాలు వంటి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షించనున్నారు.

ఆయిల్ ఫామ్ రైతులపై చిన్నచూపు

మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ ఫామ్ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో రైతు తిప్పని నాగేందర్ ఆయిల్ ఫామ్ తోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆయిల్ ఫామ్‌ల నిర్వహణకు ఏడాదికి రూ.4200 ఇచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి చెల్లించడం లేదన్నారు. వెంటనే పెండింగ్ డబ్బులు విడుదల చేయాలని కోరారు. కొత్త రైతులకు డ్రిప్ రావడం లేదని, ఆ కంపెనీలకు డబ్బులు చెల్లించకపోవడం వల్ల వారు ముందుకు రావడం లేదన్నారు. బకాయి పడ్డ నిధులు వెంటనే విడుదల చేయాలని, మొక్కల సబ్సిడీ కూడా పెండింగ్‌లో ఉందని, త్వరగా ఇవ్వాలని కోరారు. వానాకాలం వచ్చింది, కానీ రైతులకు పంట పెట్టుబడి సహాయం గురించి కాంగ్రెస్ నోరు మెదపడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాన చినుకు పడితే రైతు బంధు పైసలు పడేవని, ఇప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ఎకరాకు రూ.7500 ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రసంగాల్లో, మ్యానిఫెస్టోల్లో పంట కాలానికి ముందే ప్రతి ఎకరాకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రైతులను మోసం చేయడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతు సమస్యల మీద దృష్టి సారించాలని సూచించారు. జనుము, జీలుగ విత్తనాల కొరత ఉందని, సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఎన్నికలకు ముందు అన్ని పంటలకు రూ.500 బోనస్ అని, ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ ఇస్తామంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లే పండిస్తారని సిద్దిపేట జిల్లాలో కూడా దొడ్డు రకం వరినే పండిస్తారని గుర్తు చేశారు. బోనస్ విషయంలో మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, రైతులను దగా చేయడం మంచిది కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేలేటి రాధా కృష్ణ శర్మ జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, ఆనగోని లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్..

- లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు
- ఇద్దరు మృతి.. మరో నలుగురికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-సదాశివపేట

యూటర్న్ తీసుకుంటున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ ట్యాంకర్ ఢీకొట్టగా.. అదే సమయంలో ఎదురుగా లారీ వచ్చింది.. దాంతో లారీ, ట్యాంకర్ మధ్య కారు ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్, కారులోని మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ భయానక ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నందికంది శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకలోని దేవరిప్పరిగి తాలూకాకు చెందిన హాజీ శభాజ్, తన భార్య సమ్రిన్, ఇద్దరు కుమారులతో కలిసి కేఏ35ఎన్6126 నెంబర్ గల షిఫ్ట్ డిజైర్ కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ఫేమస్ హోటల్ దాటాక నందికంది శివారులో ఉన్న నాగ్సన్పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకోబోయారు. కారు వెనక హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు వస్తున్న ఎంహెచ్04ఎఫ్‌యు8804 నెంబర్ గల ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టాడు. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు టీఎస్52బీ8496 నెంబర్ గల లారీ ఎదురుగా వచ్చింది. ఆ సమయంలో కారు.. లారీ, ట్యాంకర్ మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మహారాష్ట్ర నివాసి మృత్యుంజయ దుబే(45), కారులో ఉన్న సమ్రిన్(45) అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని ఇద్దరు పిల్లలతో పాటు హాజీ శభాజ్, లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో వారిని ఆస్పత్రికి తరలించారు. కారును ట్యాంకర్ ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చినా.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అలాగే ఉత్తీర్ణత సాధించిన వారిలో 14,083 మంది జనరల్ కేటగిరి అభ్యర్థులు. 9,281 మంది ఓబీసీ, 5,423 మంది ఆర్థికంగా బలహీన తరగతులు, 13,794 మంది ఎస్సీలు, 5,073 మంది ఎస్టీ అభ్యర్థులు. ఇక, కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్ఎల్)లో ఐఐటీ ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోతి టాప్ ప్లేస్ (ఆల్ ఇండియా ర్యాంక్ 1)ను సొంతం చేసుకున్నారు. 17 ఏండ్ల లహోతి తొలి ప్రయత్నంలోనే

ఈ ఘనత సాధించాడు. మొత్తం 360 మార్కులకు 355 మార్కులను సొంతం చేసుకున్నారు. అలాగే మహిళా అభ్యర్థుల కేటగిరిలో ఐఐటీ బాంబే జోన్‌కు చెందిన ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్ టాప్ ప్లేస్‌ను సాధించారు. 360 మార్కులకు గాను 332 మార్కులు సాధించారు. ఫలితాలను జేఈఈఏడీవీ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు వీక్షించవచ్చు.

కేంద్రమంత్రులకు శుభాకాంక్షలు : బోయినపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర మంత్రులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సికింద్రాబాద్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు బీఆర్‌నేత బోయినపల్లి వినోద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రులుగా తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడతారని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

మహారాష్ట్రలో భారీ వర్షాలు ..

- 24 గంటల్లో ముంబయిలో అత్యధికంగా 60మి.మీ వర్షపాతం

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయి సహా సమీప ప్రాంతాల్లో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 24 గంటలుగా భారీ వర్షాలు కురుస్తున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు, తేమతో కూడిన వాతావరణం నుండి ప్రజలకు ఈ వర్షాలు ఉపశమనం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. థానే, పల్ఘార్ జిల్లాల్లోని పలు రోడ్లపై వరద నీరు ముంచెత్తినట్టు అధికారులు తెలిపారు. థానేలో పలు చోట్ల చెట్లు నేలకూలాయి.అయితే భారీ వర్షాల కారణంగా మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలోని మల్జిపాడ ప్రాంతంలో రహదారి కుంగిపోయింది. ఈ ప్రాంతంలో మరమ్మత్తులు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

గాజాలో ఊచకోత ఆపండి

- వైట్ హౌస్ ఎదుట 'భారీ'నిరసన ర్యాలీ

వాషింగ్టన్: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండకు నిరసనగా, నెతన్యాహుకు పెద్ద మద్దతుదారుగా ఉన్న బైడెన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా శనివారం అమెరికా అధ్యక్ష భవనం (వైట్ హౌస్) ఎదుట వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. అమెరికా పీపుల్స్ రెడ్ లైన్ ఇచ్చిన పిలుపుమేరకు వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం అన్ని అంతర్జాతీయ చట్టాలను, న్యాయ నియమాలను ఉల్లంఘిస్తూ పాలస్తీనీయులను ఊచకోత కోస్తుంటే బైడెన్ నిర్దేశించిన రెడ్ లైన్‌ను నెతన్యాహు దాట లేదంటూ వైట్ హౌస్ సన్నాయి నొక్కులు నొక్కడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శనివారం సెంట్రల్ గాజాలో నుసిరాత్‌లో శిబిరంలో సజీవంగా ఉన్న నలుగురు బందీల విడుదల కోసం 250 మందికిపైగా అమాయక పాలస్తీనా పౌరులను ఇజ్రాయిల్ పొట్టన పెట్టుకుంది. ఈ దాడుల్లో మరో 400 మంది దాకా గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాష్టీకం పట్ల అమెరికా, బ్రిటన్, చిలీతో సహా పలు దేశాల్లో నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి.

వైట్ హౌస్ ఎదుట జరిగిన ర్యాలీలో నిరసనకారులు పాలస్తీనా జెండా పట్టుకుని గాజాపై దాడులు ఆపండి. పాలస్తీనాకు విముక్తి కల్పించండి , తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయండి అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. చిలీ రాజధాని శాంటియాగోలో ఆందోళనకారులు పాలస్తీనాకు నరహంతక ఇజ్రాయిల్ నుండి విముక్తి కల్పించాలని కోరుతూ శనివారం ప్రదర్శన నిర్వహించారు.

హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలీలోని బోరిక్ ప్రభుత్వం పాలస్తీనాకు పూర్తి మద్దతు ప్రకటించింది. శాంటియాగో విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేసింది.

ప్రశాంతంగా గ్రూప్-1పరీక్షలు

- దరఖాస్తు చేసుకున్న వారు 4.03 లక్షల మంది
- హాజరైన అభ్యర్థులు 3.02 లక్షలు
- త్వరలో కమిషన్ వెబ్‌సైట్లో ప్రిలిమ్స్ కీ
- షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్
- వివరాలు వెల్లడించిన టీజీపీఎస్సీ
- నిమిషం ఆలస్యం నిబంధన నిక్కచ్చిగా అమలు
- పలు చోట్ల నిరాశతో వెనుదిరిగిన అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 563 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 31 జిల్లాల్లో ఏర్పాటు చేసిన 897 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులకుగాను 3.02 లక్షల మంది అభ్యర్థులు (74 శాతం) హాజరయ్యారని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వెల్లడించింది. ఉదయం 10 గంటల వరకే అనుమతిస్తామని ప్రకటించిన నేపథ్యంలో అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఐతే కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద కొందరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని అనుమతించలేదు. ఒక్క నిమిషం నిబంధనతో చాలా మంది పరీక్ష రాయలేక పోయారు. ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ బందంతో పాటు 3 నుంచి 5 కేంద్రాలకు ఓ ఫ్లయింగ్ స్క్వాడ్ బందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసేయడంతో పాటు 100 మీటర్ల వరకు144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షకు సంబంధించిన ప్రిలిమినరీ కీని త్వరలో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 21న మెయిన్స్ నిర్వహించనున్నట్టు కమిషన్ పేర్కొంది.

అక్కడక్కడా అపశ్రుతులు

పరీక్ష నిర్వహణ విషయంలో రాష్ట్రంలో అక్కడక్కడా అపశ్రుతులు నెలకొన్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రం ముందు అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అరగంట టైమున్నా ఐదు నిమిషాలు మాత్రమే ఉందని ఇన్విజిలేటర్ చెప్పడంతో తొందరగా ఆన్సర్ చేశామని వారు ఆరోపించారు. అబిడ్స్ స్టాన్లీ కాలేజ్ పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు గంట ముందే తరలివచ్చారు. అధికారులు విధించిన నిబంధనలు పాటించాలని పరీక్షా కేంద్రాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఏర్పాటు చేసిన కేంద్రానికి పలువురు అభ్యర్థులు ఆలస్యంగా రాగా అనుమతించ లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆలస్యంగా వచ్చివారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటకి పంపంచారు.

రెండు సార్లు రద్దు

గ్రూప్1 పరీక్ష రెండు సార్లు రద్దయింది. 2022లో కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత అక్టోబర్‌లో ప్రిలిమ్స్ నిర్వహించి మెయిన్స్ కోసం 1:50 నిష్పత్తితో అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే పరీక్షా పత్రాలు లీకేజీ వ్యవహారంలో పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత గతేడాది జూన్ 11న రెండోసారి ప్రిలిమ్స్ నిర్వహించగా, ప్రక్రియలో లోపాలు జరిగాయని కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఈ పరీక్షను సైతం రద్దు చేశారు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేయడంతో పాటు కొత్తగా 60 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దీంతో కమిషన్ 563 గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది.

పీఎఫ్ ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలు విడనాడాలి

- ఎం సాయిబాబా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీములోని ఐఆర్ పెన్షన్ కుదింపు చర్యలను ప్రభుత్వం విడనాడాలనీ, ఆ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబా డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఐఆర్ పెన్షన్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సరైన పద్ధతిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కుదించే చర్యలు విడనాడాలని సూచించారు. కనీస పెన్షన్ రూ. తొమ్మిదివేలు ఇవ్వాలనీ, పెన్షన్ కరువు భత్యం లింక్ చేయాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారానికై నిర్వహించనున్న ఆందోళనలో కార్మికుల పెద్దఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలుడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు ఎస్వి రమ, పి.జయలక్ష్మి, భూపాల్, జె.వెంకటేష్, జె.మల్లికార్జున్, వి.ఎస్ రావు, కె ఈశ్వరరావు, కళ్యాణ వెంకటేశ్వరరావు, గోపాలస్వామి, ఏజే రమేష్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెస్టినేషన్ వెడ్డింగ్ హబ్‌గా తెలంగాణ

- మెడికల్, ఏకో టూరిజంపై ప్రత్యేక దృష్టి : పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాన్ని డెస్టినేషన్ వెడ్డింగ్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం బేగంపేటలోని హోటల్ హరిత ప్లాజాలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో 3వ సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వివాహ వేడుకలకు గమ్యస్థానంగా ఉన్నప్పటికీ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లు, రిసార్టుల్లో మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో సుందరమైన ప్రదేశాలు, పుష్కలమైన వనరులున్నాయని తెలిపారు. వెడ్డింగ్ టూరిజానికి అనువుగా ఉండే సాగర్, కొల్లాపూర్‌లోని సోమశిల తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మెడికల్ టూరిజం, ఎకో టూరిజం, అడ్వెంచర్ టూరిజం, సహా వివిధ టూరిజం రంగాలపై దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధితో ఆదాయం పెరగడంతో పాటు యువతకు గణనీయమైన ఉపాధి అవకాశాలను లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ రమేష్ నాయుడు, డైరెక్టర్ కె.నిఖిల, టీసీఈఐ అధ్యక్షులు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ

బెంగుళూరు : కర్నాటక లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ కేవలం ఒక స్థానంలోనే విజయం సాధించింది. ఇటీవల కౌన్సిల్‌లోని మొత్తం ఆరు ఖాళీలకు ఎన్నికలు నిర్వహించారు. మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం ఆరు స్థానాల్లో మూడు స్థానాలను అధికార కాంగ్రెస్ గెలుచుకుంది. జెడి(ఎస్)కు రెండు స్థానాలు, బీజేపీకి ఒక స్థానం దక్కింది. అయితే కౌన్సిల్‌లో ఎన్‌డిఎ మెజార్టీ కొనసాగుతోంది. కర్నాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొత్తం 75 మంది సభ్యులు ఉన్నారు. తాజా ఎన్నికల తరువాత ఎన్‌డిఎకు మొత్తంగా 38 సభ్యులు ఉన్నారు. ఇందులో బీజేపీ సభ్యులు 30 మంది, జెడి(ఎస్) సభ్యులు ఎనిమిది మంది. అధికార కాంగ్రెస్‌కు 34 మంది సభ్యులు. కౌన్సిల్ ఇంకొంక ఖాళీ ఉంది. లోక్‌సభ ఎన్నికల తరువాత జగదీష్ షెట్టర్ రాజీనామా చేయడంతో ఒక స్థానం ఖాళీ అయింది. దీనికి త్వరలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఎన్నికలు జరిగితే ఇది కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లనుంది. ఈ స్థానానికి అభ్యర్థిగా బసనగౌడ బాదర్లీని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

వ్యవసాయ నేలల ఆరోగ్యం ఆందోళనకరం

తాగేనీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- వర్షాభావ పరిస్థితులే పంటల ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి
- వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ నిర్మాణం జరగాలి
- అరిబండి ఆరవ స్మారకోపన్యాసంలో నార్మ్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక ఉండాలి : రాజిరెడ్డి
- అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలి: టి సాగర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వాతావరణ మార్పులు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని జాతీయ వ్యవసాయ పరిశోధనల యాజమాన్య అకాడమీ(నార్మ్) డైరెక్టర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. వ్యవసాయ నేలల ఆరోగ్యం దెబ్బతింటున్నదని తెలిపారు. తద్వారా త్రాగే నీరు, ఆహారభద్రత, ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నదని చెప్పారు. వర్షాభావ పరిస్థితులు పంటల ఉత్పత్తి కూడా ఒడిదుకులను ఎదుర్కొంటున్నదన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునే విధంగా వ్యవసాయ నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వాటర్ టెక్నాలజీ సెంటర్‌లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులను తట్టుకోగల వ్యవసాయ నిర్మాణం' అనే అంశంపై శ్రీనివాసరావు అరిబండి ఆరవ స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు సుస్థిర వ్యవసాయానికి పెద్ద సవాల్‌గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితులు, వరదలు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. నీరు, ఇందనం,ఆహారం జీవ వైవిద్యం తగ్గిపోతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వాతావరణ మార్పుల రిస్క్ పెరుగుతున్నదని హెచ్చరించారు. ఈ మార్పులను ఎదుర్కొగల వ్యవసాయానికి మద్దతు పెరగాల్సిన అవసరముందన్నారు. వాతావరణ మార్పులకు కారణమైన హరిత వాయువుల ఉద్గారాలను తగ్గించాలన్నారు. ఆకలి, పేదరిక సమస్యలను పరిష్కరించేందుకు జీవ వైవిధ్యాన్ని పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. లేకపోతే ఆర్థిక మాంద్యం, ఆహార భద్రత, పోషకాహార లోపాలు, యుద్ధాలు తలెత్తుతాయని చెప్పారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు పంటలు, పశువులు, అడవులు, మత్స్య సంపద, పౌల్ట్రీ ఇలా రకరాల సమగ్ర వ్యవసాయ విధానం అమల్లోకి రావాలన్నారు. సాంకేతికతో వాతావరణంలో మార్పులు తెలుసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పంటల బీమా పథకం, మార్కెటింగ్ రక్షణ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.

రైతులు అవసరానికి మించి యూరియా, డీఏపీ ఉపయోగించడం సరైందికాదన్నారు. మొక్కలకు ఎంత అవసరమో అంతే తీసుకుంటాయి తప్ప ఎక్కువగా తీసుకోవని గుర్తించాలన్నారు. పంట పొలాల్లో వ్యర్థ అవశేషాలను కాల్చివేయడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నదని తెలిపారు. ఇలా చేయడం ద్వారా నేల చనిపోయినట్టేనని ప్రముఖ వ్యవసాయ నిపుణులు స్వామినాథన్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులో చేరిన మట్టిని పంట పొలాల్లో పోయడం ద్వారా ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయం ఒక్కరూగా చేయలేరనీ, సంఘటితంగా చేయాల్సి ఉంటుందని గుర్తు చేశారు. రాజస్థాన్‌లో నీటి కరువు ఉన్నప్పటికీ రైతుల ఆత్మహత్యలు ఉండవన్నారు. ఎక్కువగా పశుసంపదపై ఆధారపడి జీవిస్తారని తెలిపారు. వ్యవసాయంపై పిల్లల్లో ఆసక్తి కల్పించాల్సి బాధ్యత తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ విస్తరణ మాజీ డైరెక్టర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ ప్రణాళిక తరహాలో నీటి ప్రణాళిక కూడా రూపొందించాలని సూచించారు. వరి, పత్తిని 90 శాతానికి విస్తరించి, ప్రమాదకర జోన్‌లో ఉన్నామని చెప్పారు. పత్తిలో సోయా, కంది వంటి అంతర పంటల సాగు చేసి రైతులు రిస్క్ తగ్గించుకోవాలని తెలిపారు. ఈసారి 4.7లక్షల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. పరిశోధనలు, సాంకేతిక విశ్వవిద్యాలయాలకు పరిమితం కాకుండా పొలాల్లోకి తీసుకెళ్లాలన్నారు. వరి సాగు ఎంత అవసరమో అంతే సాగుచేయాలన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం అన్ని ప్రాంతాల్లో చేయకుండా ఉద్దేశపూర్వకంగా వ్యవసాయ ప్రాంతాల్లో చేయాలని సూచించారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ మాట్లాడుతూ సన్న రకానికే కాకుండా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు ఏడు పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా ఇవ్వాలన్నారు. పంటల బీమాలోని లోపాలను సవరించి, ఆ బీమాప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. రైతు బీమా వయస్సును 70 ఏండ్లకు పెంచాలని కోరారు. పోడు వ్యవసాయానికి హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా విజయ డైరీ రైతులు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలరైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ కె కిరణ్‌బాబు డిజిటల్ వ్యవసాయ ప్రాధాన్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, జంగారెడ్డి మాట్లాడారు. సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అతిథులను వేదిక పైకి ఆహ్వానించారు. అరిబండి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ మనోహర్, కోశాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ లావణ్య, ఐఏఎస్ అధికారి వేణుప్రసాద్, పివి అమరనాథ్ ప్రసాద్, డాక్టర్ ఏ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో 'మీ వాణి' వినిపిస్తా : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : పార్లమెంటులో మీ గొంతుకగా నిలుస్తానని, మీ భవిష్యత్తుకు సంబంధించిన సమస్యలను లేవనెత్తుతానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం నీట్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. మెడికల్ ప్రవేశ పరీక్ష 'నీట్' వివాదంపై ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మోడీపై విరుచుకుపడ్డారు. నీట్ పరీక్షల్లో 'అక్రమాల'తో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు సర్వనాశనమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

" ప్రధాని మోడీ ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు. నీట్ పరీక్షలో అక్రమాలు 24 లక్షల మంది విద్యార్థులను మరియు వారి కుటుంబాలను నాశనం చేశాయి " అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారని, చాలా మంది విద్యార్థులకు సాంకేతికంగా సాధ్యంకాని మార్కులు వచ్చాయని అన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం పేపర్ లీక్ కాలేదని చెప్తోందని అన్నారు. విద్యా మాఫియా, ప్రభుత్వ యంత్రాంగంతో కుమ్మక్కై చేస్తున్న పేపర్ లీక్ పరిశ్రమను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పటిష్టమైన ప్రణాళికను రూపొందించిందని అన్నారు. చట్టం రూపొందించడం ద్వారా విద్యార్థులకు పేపర్ లీక్‌ల నుంచి విముక్తి కల్పిస్తామని తమ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చామని గుర్తు చేశారు.

వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం

- లావాదేవీల విషయంలో గొడవ
- నిందితుల అరెస్టు, రిమాండ్
- వివరాలు వెల్లడించిన నార్సింగి ఏసీపీ రమణగౌడ్



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యాపారవేత్త కిడ్నాప్ కలకలం సృష్టించింది. లావాదేవీల విషయంలో గొడవలు కావడంతో ఇద్దరు వ్యక్తులు వ్యాపారవేత్త శివవర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో.. వెంటనే స్పందించిన పోలీసులు బాధితుడిని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తరలిస్తుండగా సినీఫక్కీలో కిడ్నాపర్స్ వాహనాన్ని చేధించి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను నార్సింగి ఏసీపీ రమణగౌడ్ ఆదివారం మీడియాకు వివరించారు. శివవర్ధన్‌రెడ్డి కర్నూల్ నుంచి వచ్చి గండిపేట మండలం హైదర్షాకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటూ ఇక్కడే వ్యాపారం చేస్తున్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు ఇతరుల దగ్గర డబ్బులు తీసుకున్నాడు. నిందితులు క్రాంతికుమార్, కె.సందీప్.. లావాదేవీలపై శివవర్ధన్‌రెడ్డితో చర్చించారు. వారు తిరిగి డబ్బులు చెల్లించాలని అడగడంతో శివవర్ధన్‌రెడ్డి అప్పుడు.. ఇప్పుడు.. అంటూ దాటవేశాడు. దాంతో నిందితులు శివవర్ధన్‌రెడ్డిని కిడ్నాప్ చేసి కర్నూల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుడి కుటుంబ సభ్యులు 100 కు ఫిర్యాదు చేశారు. నార్సింగి సీఐ హరికిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శివవర్ధన్‌రెడ్డిని ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలించడంతో మహబూబ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సినీఫక్కీలో నిందితులను పట్టుకుని, బాధితుడిని కాపాడారు. అయితే శివవర్ధన్‌రెడ్డిపై నిందితులు దాడి చేసినట్టు కారులోని రక్తం మరకల ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. డబ్బులు వసూలు చేసేందుకే కిడ్నాప్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో సీఐ హరికిషన్‌రెడ్డి, ఎస్ఐ సతీష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-బోథ్

అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పూల్‌సింగ్ నాయక్ తండాలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్(45) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో గతేడాది పత్తి సాగు చేశాడు. అతివృష్టి, అనావృష్టితో పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కలత చెంది, ఆదివారం తన ఇంటి సమీపంలో పురుగులమందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. అతనికి బ్యాంకులో రూ.1.5లక్షలు, ప్రయివేటుగా రూ.1.5లక్షలు మొత్తం రూ.3లక్షలు అప్పు ఉన్నట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు శుభపరిణామం

ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సాధారణ ప్రజల్లో రాజకీయ చర్చలు జరగడం శుభపరిణామం అని పౌరహక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ జీ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు సమాజ పరిణామక్రమాన్ని నిర్దేశిస్తాయనీ, ప్రతిపక్షాలు తప్పనిసరిగా వారితో కలిసి నడవాల్సిన పరిస్థితుల్ని కల్పిస్తాయన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) అధ్వర్యంలో ఆదివారం 'పౌరహక్కులు-ప్రతిపక్షాల కర్తవ్యం' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన మాట్లాడారు. సామాజిక సంబంధాల్లో సమానత్వం, ధరల పెరుగుదల సహా ఆర్థిక నమూనాలోని అంశాలపై సమగ్ర అవగాహన ఉండాలని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారనీ, ఇది పాశ్చాత్య రాజ్యాంగమని సావర్కర్ హయాం నుంచీ బీజేపీ నేతలు నమ్ముతున్నారని వివరించారు. రాజ్యాంగాన్ని మారిస్తే అసమానతలు పెరిగి, సమానత్వ భావన కోల్పోతామనే భావన ప్రస్తుత ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజల్లో వెల్లడి అయ్యిందన్నారు. ఈ ప్రభావం ప్రాంతీయ అస్థిత్వాలపైనా పడిందనీ, భవిష్యత్‌లో బీజేపీ ఆర్థిక అభివృద్ధి నమూనా ఇలాగే కొనసాగితే, ప్రతిపక్షపార్టీలు పార్లమెంటులో అర్థవంతమైన చర్చను లేవనెత్తే అవకాశం ఉందని తెలిపారు. అసమానతలపై అసంతృప్తి పెరిగినందున, దాని అణచివేత కోసం 'ఉపా' చట్టం తెచ్చారని చెప్పారు. నెహ్రూ మోడల్‌ను కాంగ్రెస్ వదిలేసిందనీ, బీజేపీ నెహ్రూనే తోసేయడంతో ఆర్థిక నమూనాలు భిన్నంగా మారాయని విశ్లేషించారు. ఉత్పత్తి రంగంలో ఉన్న టాటా, బిర్లాలు దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమ పెట్టుబడుల్లో 40 శాతాన్ని విద్యారంగంపై పెట్టుబడి పెట్టారనీ, కానీ బీజేపీ విధానాలతో అదానీ, అంబానీలు ఒక్క వస్తువును కూడా ఉత్పత్తిచేయకుండా, సంపదను పోగేసుకుంటున్నారని అన్నారు. ప్రస్తుతం దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందనీ, అయితే పార్లమెంటులో పటిష్టమైన ప్రతిపక్షం ఇప్పుడు ఉన్నందున బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు చెల్లవని చెప్పారు. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో రాజ్యాంగ పరిరక్షణను అజెండాగా పెట్టుకోవడంతో, బీజేపీ కూడ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని చెప్పక తప్పలేదన్నారు. ప్రస్తుతం మీడియా కార్పొరేట్ చేతుల్లో ఉందనీ, ఫలితంగా పాలకవర్గాలు ఆ శక్తుల్ని కాదని నియో లిబరల్ మోడల్‌ను వదులుకొనే పరిస్థితి లేదన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్‌ల భావజాలాలు భిన్నమైనవనీ, కాంగ్రెస్‌పార్టీతో చేరిన పలు పార్టీల్లోనూ భిన్న భావజాలాలు ఉన్నాయని వివరించారు. ప్రతిపక్షపార్టీలు అధికారపక్షాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేయాలన్నారు. అన్ని రాజకీయపార్టీలు సిద్ధాంత, విధానపరమైన అమలు సమస్యను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధికారంలో ఉండే పార్టీలకు ప్రజలే ప్రతిపక్షంగా ఉంటారంటూ, ఢిల్లీ రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాల ప్రాధాన్యతను వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్షాలపై బాధ్యత మరింత పెరిగిందనీ, పౌరసమాజం, ప్రజాసంఘాల మద్దతుతో ముందుకు నడిస్తే, అధికారపక్షం ఆచితూచి నిర్ణయాలు తీసుకుటుందని విశ్లేషించారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలతో ఫాసిజానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ఓటమికి కూడా పెత్తందారీ పోకడలే కారణమనీ, మోడీ కూడా ప్రజల్ని కలవకుండా, దాదాపు అదే దారిలో నడిచినందువల్లే సీట్లు తగ్గాయని చెప్పారు. రాజ్యహింసను తగ్గించి, మానవీయ, సామాజిక దృక్పథంతో దేశ పురోగమనం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ అధ్యక్షత వహించారు.

రాజస్థాన్‌లో అర్థరాత్రి భూకంపం..

జైపూర్: రాజస్థాన్‌లో అర్ధరాత్రి భూమి కంపించింది. శనివారం అర్ధరాత్రి 11.47 గంటలకు సికార్, చురు, నాగౌర్ జిల్లాల్లో కొన్ని సెకన్లపాటు భూకంపం వచ్చింది. దీని తీవ్రత రిక్టర్‌స్కేలుపై 4.2గా నమోదయింది. సికార్ జిల్లాలోని హర్ష పర్వత వద్ద భూకంప కేంద్రం ఉన్నదని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది. భూ అంతర్భాగంలో 5 కిలోమీటర్ల లోతులు కదలికలు సంభవించాయని వెల్లడించింది. అర్ధరాత్రి వేళ భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగుతు తీశారు. కాగా, భూకంపం



వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదు.

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్ పర్సన్‌గా

జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా ప్రదీప్ కుమార్ రెడ్డి పల్లె (అడ్వకేట్, జ్యుడీషియల్ మెంబర్), రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిత్రా రామచంద్రన్ (టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ మెంబర్) కూడా ఆయనతో పాటు బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం ఈ నెల 7న వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బాధ్యతల స్వీకరణ సందర్భంగా రెరా అథారిటీ చైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మినారాయణ చైర్మెన్, సభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ట్రిబ్యునల్ చైర్‌పర్సన్, సభ్యులతో పాటు రెరా అథారిటీ చైర్మెన్, సభ్యులు సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో రెరా అడ్జుడికేటింగ్ ఆఫీసర్ లతీఫ్ ఉర్ రెహమాన్, రెరా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పరిపాలనాధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్యకు టాప్ ర్యాంక్‌లు



నవ తెలంగాణ - హైదరాబాద్

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తమ విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో అగ్ర ర్యాంక్‌లు దక్కాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు 10లోపు 5 ర్యాంకులు సాధించారన్నారు. ఒక్కటవ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులతో శ్రీచైతన్య ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఆలిండియా స్థాయిలో రాఘవ శర్మ 1వ ర్యాంక్, రిథమ్ కేడియా 4వ ర్యాంక్, పుట్టి కుశాల్ కుమార్ 5వ ర్యాంక్, రాజదీప్ మిశ్రా 6వ ర్యాంక్, ధ్రువిన్ హేమంత్ దోషి 9వ ర్యాంక్, సిద్విక్ సుహాస్ 10వ ర్యాంక్‌ల్లో నిలిచారని వెల్లడించారు. 100లోపు 30 ర్యాంక్‌లు, 1000 లోపు 202 ర్యాంక్‌లు, వివిధ కేటగిరీల్లో 100 లోఎపు ఏకంగా 146, 1000 లోపు 721 ర్యాంక్‌లు సాధించామన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 3,728 మంది శ్రీచైతన్య విదార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ దఫా ఐఐటిల్లో తొలి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్యదేనని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సుష్మ అభినందనలు తెలిపారు.

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు పదేండ్ల తర్వాత అధికారం ఇచ్చారని, ఆరు గ్యారంటీలపై ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేర్చడమే తమ లక్ష్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి నియోజకవర్గంలో ప్రధానంగా విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే తన టార్గెట్ అని తెలిపారు. త్వరలోనే పార్లమెంటు పరిధిలో ఉన్న ప్రజలందరినీ కలుసుకుంటానని అన్నారు. పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన తర్వాత 'నవతెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వివరించారు.

- పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తా
- ప్రభుత్వ స్కూళ్లకు పక్కాభవనాలు నిర్మిస్తా
- మండలానికో జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికో డిగ్రీ కాలేజీ..
- భువనగిరిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఆలేరు

భువనగిరి ఎంపీగా గెలిచినందుకు అభినందనలు. మీ విజయానికి దోహదం చేసిన ప్రధాన అంశాలేంటి..?

కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలైన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గ్యారంటీలను అమల్లోకి తీసుకొచ్చింది. వాటిని పూర్తిగా అమలు చేస్తామన్న నమ్మకం వల్లే భువనగిరి ఎంపీగా ఇక్కడి ప్రజలు నన్ను గెలిపించారు. నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు. నా విజయానికి కృషి చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాను.

ఎంపీగా మీ లక్ష్యం ఏమిటి?

ఇక్కడి ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నా లక్ష్యం. ప్రధానంగా మూడు పనులు చేయడమే నా టార్గెట్. నా నియోజకవర్గం హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నప్పటికీ.. ఇక్కడ మెజారిటీ ప్రజలు రైతులే. వాళ్ళను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 5 పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే నా తొలి లక్ష్యంగా పెట్టుకున్నాను. పదేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టిన కేసీఆర్ సర్కారు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా వదిలేసింది. మా నియోజకవర్గంలో గంధమల్ల రిజర్వాయర్‌ను, మూసీ నదిపై పెండింగ్‌లో ఉన్న బునాదిగానికాలువ, ఇతర ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు విస్తీర్ణాన్ని పెంచుతాను.

విద్యా రంగంపై మీ ప్రణాళిక ఏమిటి..?

నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీ భవనాలన్నింటినీ పూర్తి చేస్తాను. ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ, ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో ఒక డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాను. చదువు కోసం హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న కష్టాలు తీరుస్తాను.

ఉపాధి అవకాశాలపై మీ ప్రణాళిక ఏమిటి..?

డిగ్రీ, ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఇక్కడి యువతకు వస్తున్న వేతనం.. వాళ్ల వసతి, భోజనానికి కూడా సరిపోవడం లేదు. ఇంట్లో వాళ్ళే నెలకు రూ.10 వేలు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ఉద్యోగం వదిలేసి ఇంటికి వచ్చేయాలని పిల్లలను తల్లిదండ్రులు ఒత్తిడికి గురుచేస్తున్నారు. వాళ్ల కష్టాలు తీర్చేందుకు నా నియోజక వర్గంలో పరిశ్రమలు నెలకొల్పుతాను.

ఎంపీగా మీరు తొలిసారి గెలిచారు. మీ అనుభూతి ఎలా ఉంది..?

నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో జాతీయ స్థాయిలో పనిచేశాను. భువనగిరి ప్రజలు నన్ను తొలిసారి పార్లమెంట్‌కు పంపించారు. నాకు గెలిచిన సంతోషం ఒక్కరోజే ఉంది. వెంటనే నా బాధ్యత గుర్తుకొచ్చింది. ప్రజల ఆలోచనలు, అవసరాలు నాకు తెలుసు. నేను నిద్రలేవక ముందే ప్రజలు నా ఇంటి వద్దకు వచ్చి ఉంటారు. గెలిచిన తర్వాత నేను ఫోన్ లిఫ్ట్ చేయకుంటే ప్రజలు నన్ను నమ్మరు. అందుకే ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను.

రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఇద్దరికి చాన్స్

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు బెర్తులు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఈటల?



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని మోడీ మంత్రివర్గంలో తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఇద్దరికీ చాన్స్ వచ్చింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు బెర్తులు దక్కాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి తర్వాత ఎవరనే దానిపై చర్చ జోరుగా సాగుతున్నది. రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఆయన పేరును సోమవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికే అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిశ్వాస శర్మ...ఈటలతో సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. ఈటలకు కేంద్ర మంత్రి పదవి దక్కకపోవడంతో ఆయన్ను బుజ్జగించేందుకు రాష్ట్ర సారథ్యం అప్పగించనున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్‌ని అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు వారిద్దరు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములు కావడంతో ఈటలకు పార్టీ పగ్గాలను అప్పగించాలని అధిష్టానం భావిస్తున్నట్టు తెలిసింది.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

యువత స్వయం ఉపాధితో ఎదగాలి



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నేటి యువత ఉద్యోగులపైనే ఆధారపడకుండా స్వయం ఉపాధితో ఎదగాలని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో సుబ్రహ్మణ్యం నూతనంగా నిర్మించిన 'సంగమేశ్వర హెూటల్' ప్రారంభోత్సవ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు సురేష్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. హెూటల్ యాజమాన్యానికి సురేష్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వశక్తితో ఆర్థికంగా వ్యాపార రంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, మల్లారెడ్డి, రమణ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రి అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

ఇంటి నుంచి వెళ్లిన ఓ తాపీమేస్త్రీ తిరిగి ఇంటికి చేరని ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పి. నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్ గూడకు చెందిన నారాయణస్వామి తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 3న పనికోసం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆచూకీ తెలియక పోవడంతో అతని భార్య భాగ్యమ్మ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేవకుడిగా పనిచేయడమే ధ్యేయం



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట

ప్రజాసేవే పరమావధిగా.. నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆయన నివాస కార్యాలయం వద్ద ఆదివారం నియోజకవర్గానికి చెందిన శ్రీవేణి ఎన్క్లేవ్, మిథిలా నగర్, ప్రగతి నగర్‌లోని ప్రశాంతి హిల్స్, భగత్ సింగ్ నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, తెలుగుతల్లి నగర్, 60 గజాలు, శ్రీరామ్ నగర్-ఏ, మొదలగు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేను కలిసి కాలనీలలో నూతనంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై పలు వినతిపత్రాలు, శుభకార్యాలకు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ, సంబంధిత అధికారులను తక్షణమే వ్యయ ప్రణాళికలను రూపొందించి వాటి పరిష్కారానికి కృషిచేయాలని తెలిపారు. అలాగే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధికి కొనసాగింపుగా రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

రిటర్నింగ్ వాల్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రిటర్నింగ్ వాల్ కూలిన ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌పరిశీలించారు. ఇటీవల జీడిమెట్ల డివిజన్ శ్రీనిలయా ఎన్క్లేవ్ సెల్లార్ రిటర్నింగ్ వాల్ మరమ్మతులను చేపడుతుండగా గోడకూలింది. భగవత్ అనే కూలీ ఇరుక్కుపోగా 9 గంటల రెస్క్యూ టీం శ్రమ అనంతరం భగవత్‌ను కాపాడి స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం 132 - జీడిమెట్ల డివిజన్ శ్రీ నిలయ ఎన్క్లేవ్‌ను సందర్శించి, ప్రమాద ఘటనపై ఆరా తీసి, భగవత్ క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనలో గాయపడిన కూలీ భగవత్‌కు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కుంటా సిద్దిరాములు, గోలి రమేష్ గుప్తా, కాలే నాగేష్, గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత తదితరులు వారిలో ఉన్నారు.

ఆర్థిక సహాయం అందించిన కేఎస్ఆర్



నవతెలంగాణ-దుండిగల్

విద్యార్థిని చదువుకోసం సహృదయంతో కేఎస్ఆర్ ఆర్థిక సహాయం అందించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్12 వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 కు పేద కుటుంబంకు చెందిన కృష్ణ, సంగీతల కుమార్తె భూమిక ఇంజినీరింగ్ థర్డ్ ఇయర్ చదువుతుంది. తమ పాప ఉన్నత చదువు నిమిత్తం తమ ఆర్థిక స్థితిని నరసింహ యాదవ్‌తో కలిసి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డికి తెలిపారు. కే.ఎస్.ఆర్ సానుకూలంగా స్పందించి, భూమిక ఫీజు నిమిత్తం తనవంతుగా రూ.50.000 ఆర్థిక సహాయం చేశారు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరాలని , మీకోసం కష్ట పడే తల్లి తండ్రులను ప్రేమగా చూసుకోవాలి అని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నరసింహ యాదవ్‌తో పాటు శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భూమిక వాళ్ళ తల్లి తండ్రులు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీ ఫేస్2 లో సమస్యలను పరిశీలించిన కె.ఎస్.ఆర్..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2లో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఆదివారం సీనియర్ నాయకుడు కొలను శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ప్రజలతో మాట్లాడిన వారి సమస్యలకి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.ఎస్.ఆర్ 12వ డివిజన్ బాలాజీ నగర్ అధ్యక్షులు చిరంజీవి, మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, జనరల్ సెక్రటరీ సంగీత, మౌళేశ్వరరావు, నరసింహ యాదవ్, యాదయ్య, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలుగు ప్రజల స్ఫూర్తి రామోజీరావు



- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు ప్రజల స్ఫూర్తి రామోజీరావు సమాజానికి చేసిన సేవలు మరువలేనివని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్య విచారం వ్యక్తం చేశారు. (చెరుకూరి రామయ్య) రామోజీరావు అకాల మృతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, మగ్దూం నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రామోజీరావు చిత్రపటానికి మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మతోపాటు పలువురుతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు, మార్గదర్శి, పలు వ్యాపార సంస్థ గ్రూపుల అధినేత, తెలుగు ప్రజల సమాజ సేవకుడు రామోజీరావు సేవలు చిరస్మరణీయ మన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించి అన్నదాత అయినాడని, కార్మిక వర్గానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి పోతాయన్నారు. ప్రపంచానికి జర్నలిజం విలువలు చాటి చెప్పిన గొప్ప మేధావి అని కొనియాడారు. పేద ప్రజలకు సహాయం చేసిన సామాజికవేత్త, సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి ప్రతి రంగంలో దిగ్గజంగా ఎదిగిన రామోజీరావు జీవితం ఎంతోమందికి ఆదర్శప్రాయం అన్నారు. ఆయన మన మధ్యలో లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి యువసేన నాయకులు గూడ సాయి ప్రవీణ్ గౌడ్,స్థానిక నాయకులు యాదగిరి,సులోచన తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వరద నివారణకు ప్రత్యేక చర్యలు

- 542 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు
- వాటర్ స్తాగినేషన్ పాయింట్లను యుద్ధప్రాతిపదికన శాశ్వత తొలగింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలం నగరంలో వరద వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా... వరద వలన ప్రజలకు ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వరద నివారణకు ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకొనుటకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటు జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. అలాగే వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద ఎప్పటి కప్పుడు వరద నీటిని తొలగించి నివారణ చర్యలు చేపడుతుంది. వర్ష కాలంలో జీహెచ్ఎంసీ ముందస్తుగా వర్షాకాల ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తోంది. వర్షాకాలంలో ఈ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు తీసుకుంటారు. ఈ విషయంలో జీహెచ్ఎంసీ ప్రధాన భూమిక పోషిస్తుంది. దానికి తోడు ఈ వర్ష కాలంలో ఇతర శాఖలు ముందుకు రావడం జరిగింది. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ లను ముందుగానే గుర్తించి అక్కడ వరద నివారణకు ఇతర శాఖలకు ముందుకు రావడం సంతోషకరమైన విషయం. రాష్ట్ర ముఖ్యమంత్రి నగరంలో వర్షాకాలంలో తీసుకునే జాగ్రత్తలో భాగంగా అన్ని శాఖలతో సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అనుబంధంగా ఉన్న శాఖలతో పాటు వర్ష కాలంలో ముందస్తు చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులు సమస్యలను అధిగమించేందుకు ఆయా శాఖలతో సమీక్షించండం మూలంగా అన్ని శాఖలు సమన్వయంతో నగర ప్రజలు వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాయి. అందులో ఆయా శాఖ లైనా అగ్నిమాపక శాఖ, వాటర్ వర్క్స్, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖలు ముందుకు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో నగరంలో వరదల నివారణ, విద్యుత్, రవాణా వ్యవస్థల వలన ప్రజలకు సమస్య లేకుండా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

నగర వ్యాప్తంగా 534 మాన్సూన్ అత్యవసర బృందాలను ఏర్పాటు..

జీహెచ్ఎంసీ, ఇతర శాఖల ద్వారా మొత్తం మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను 534 ఏర్పాటు చేసారు. అందులో మొబైల్ 157, స్టాటిక్ 242 బృందాలు, సీఆర్ఎంపీ రోడ్లపై 29, డీఆర్ఎఫ్ 30 బృందాలు, పోలీస్ శాఖ 13 బృందాలు, విద్యుత్ శాఖ 41, వాటర్ వర్క్స్ 22 బృందాలు ఏర్పాటు చేసి శాఖాపరంగా ఏర్పడిన సమస్యలను అధిగమించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నివారణ చర్యలు తీసుకుంటారు.

ప్రస్తుతం32 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు..

నగర వ్యాప్యంగా 125 వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లు ఉండగా వాటిలో రాను రాను దశలవారీగా తగ్గిస్తూ శాశ్వత పరిష్కారం చేశారు. ప్రస్తుతం 32 వాటర్ లాగింగ్ పాయింట్‌లను కూడా వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిగా తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. నాలాలో ప్రజలు చెత్త, వ్యర్థాలు వేయకుండా సహకరించాలని జీహెచ్ఎంసీ కోరింది. అంతే కాకుండా వర్షాల సందర్భంగా వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ల వద్ద డ్రయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వాటర్ నిలిచే పాయింట్ల వద్ద వాటర్ తొందరగా వెళ్లేందుకు ఎక్కువ నీరు నిల్వ చేసి సంపులను పెద్దగా చేపట్టేందుక చర్యలు తీసుకున్నారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్ పై జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి సారించింది అందుకు తగ్గట్టుగా ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపించిన వెంటనే అట్టి నిధులను మంజూరు చేస్తున్నారు.

వర్షం పడినప్పుడు ఐటీ కంపెనీ సిబ్బంది ని ఒకే సమయంలో పంపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదే విధంగా ఇతర కంపెనీలు, కార్యాలయాలు కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని ప్రజలు కూడా అత్యవరమనుకుంటేనే బయటకు రావాలని జీహెచ్ఎంసీ కోరారు. అంతేకాకుండా డ్రయినేజీ మూతలు ఓపెన్ చేయకూడదని, ఓపెన్ చేసి అట్టి మూతను బయట పెట్టకుండా వెంటనే మూసెయ్యాలి. వర్ష కాలంలో ప్రజలకు వరద సమస్యలు ఎదురైనప్పుడు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు.

గ్రూప్-1 పరీక్షా కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో

కూకట్‌పల్లిలోని ఎంఎస్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, ప్రతిభ డిగ్రీ కాలేజీ, బాలానగర్‌లోని మార్టిన్ హై స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలనీ, పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

అదనపు కలెక్టర్ సందర్శన..

ఒమేగా డిగ్రీ కాలేజీ, మేఘ ఉమెన్స్ డిగ్రీ అండ్ జూనియర్ కాలేజీ, స్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కాలేజీ, ఉప్పల్‌లోని శ్రీ మేథా డిగ్రీ కాలేజీ, మేడిపల్లిలోని అరోరస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రూప్ -1 పరీక్షా కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు.

మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ 'ఎంఎల్ఆర్' మొదటి స్థానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎంఎల్ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో గుజరాత్‌లిలో జరిగిన మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబర్చారు. 100మీ ఫ్రీస్టైల్‌లో 1వ స్థానం, 100మీ బ్రెస్ట్ స్ట్రోక్‌లో 1వ స్థానం, 50మీ బ్రెస్ట్‌లో 1వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ ఫౌండర్ సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస రావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు మర్రి లక్ష్మణ్‌రెడ్డి నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని వారు కొనియాడారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై సెమినార్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ జరుపుకునే బ్రెయిన్ ట్యూమర్, వాటి లక్షణాలు, రోగనిర్ధారణ పరీక్షలు, పద్ధతులు, చికిత్సా విధానాలపై ప్రజల కు అవగాహన కల్పించేం దుకు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ నవీన్‌రెడ్డి సెమినార్ నిర్వహించారు. ఈ వినాశకరమైన వ్యాధుల గురించి అవగాహన పెంచడం, ముందస్తుగా గుర్తించడం, చికిత్సను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ మెదడు కణితిలను ప్రాథమికంగా నిరపాయమైన (క్యాన్సర్ లేనివి), ప్రాణాంతక (క్యాన్సర్) అనే రెండు రకాలుగా వర్గీకరిస్తారని తెలిపారు. నిరపాయమైన మెదడు కణితులు సాధారణంగా నెమ్మదిగా అభివృద్ధి చెందుతా యనీ, తక్కువ ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తాయనీ, వెంటనే చికిత్స చేయకపోతే గణనీయమైన వైకల్యం లేదా మరణానికి కారణం అవుతాయని తెలిపారు. మెదడు క్యాన్సర్ అని పిలువబడే ప్రాణాంతక మెదడు కణితులు వేగంగా అభివృద్ధి చెందుతాయనీ, తక్షణ జోక్యం అవసరమని తెలిపారు.

పెరిక కుల వివాహ వేదికకు విశేష స్పందన



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ పెరిక కుల వధువరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. సుమారు 55 జంటలకు అక్కడికక్కడే వివాహం కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పెరిక కుల వధువరుల పరిచయ వేధిక కన్వీనర్ సుంకరి ఆనంద్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా పెరిక కుల వేధికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వేధికలను కుతస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దా లింగయ్య, భవన నిర్మాణ ఆత్మగౌరవ కమిటి చైర్మన్ గటిక విజయ్కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి భూస్వామి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బత్తిని పరమేష్, చండిక కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-ముషీరాబాద్

చిరుధాన్యాలను క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డెవలప్ మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్ఈ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో చిరుధాన్యాలు, గానుగ విధానంలో తీసిన వంట నూనెల వినయోగంపై ఆ సంస్థ జాతీయ కో కన్వీనర్ భారతితో కలిసి ఆహార ధాన్యాల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ.. నిత్యం నడక, వ్యాయామంతో పాటు కొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, అందు కొర్రలు వంటి చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. చిరు ధాన్యాలతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాన్ని క్రమం తప్పకుండా పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు.

రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు

నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలుగుతోపాటు దేశంలోని మరెన్నో భాషల్లో మీడియా రంగం ద్వారా ప్రజలకు సేవలు అందించిన ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతి దేశంలోని మీడియా రంగానికి తీరని లోటని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పగుడాకుల బాలస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, భాగ్యనగర్ నగర అధ్యక్షులు అఖిలేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రింట్ తో పాటు ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో కూడా జాతీయస్థాయిలో రామోజీరావు (ఈనాడు) అందించిన సేవలు చిరస్మరణీయమని గుర్తు చేశారు. ఈనాడు జర్నలిజం స్కూల్‌తో పాటు ఇతర రంగాల ద్వారా వేలాది మందిని జర్నలిస్టులుగా తీర్చిదిద్దిన ఘనత రామోజీరావు దే అని ప్రశంసించారు. ఎంతటి విపత్తునైనా ఎదుర్కొని నిక్కచ్చి గల వార్తలతో నిలబడ్డ అసాధ్యుడు రామోజీరావు అన్నారు. ఎప్పటికప్పుడు మీడియా రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ..తరతరాలకు చిరస్మరణీయ జర్నలిజం సంబంధించిన ఆ మహానుభావుడికి శ్రద్ధాంజలి ఘటిస్తూ.. నివాలర్పిస్తున్నామని పేర్కొన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది.

మృతి చెందిన ఏఎన్ఎం కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘం సంతాపం





నవతెలంగాణ-ధూల్‌పేట్

అనారోగ్యంతో మృతి చెందిన ఏఎన్ఎం నర్స్ నాగమణి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.నర్సిమ్మ, శివలు అన్నారు. మృతి చెందిన సమాచారం తెలుకున్న వారు తోటి నాయకులు, బృందం మంగ, సోనాల్, రాజేశ్వరి, రామేశ్వరి సుజాత, భార్గవి, సునంద, రేచల్ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు పద్ధతిలో నారపల్లి యుపీహెచ్‌సీలో ఆమె ఏఎన్ఎం నర్సుగా విధులు నిర్వహిస్తుందన్నారు. గత 18 ఏండ్లుగా ఎంపీహెచ్ఏ(ఎఫ్)గా పనిచేస్తున్న నాగమణి క్యాన్సర్ వ్యాధితో మరణించారన్నారు. వారి అకాల మరణానికి మేడ్చల్ జిల్లా ఎన్‌హెచ్ఎం ఉద్యోగ సంఘం సంతాపం ప్రకటిస్తు ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తమ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌సిఆర్‌డి రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఓ గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. అతని వయసు (50- 55) ఉంటుందన్నారు. అతని ఎడమ చాతి పై పుట్టుమచ్చ ఉన్నట్లు చెప్పారు. ముస్లిం గా గుర్తించామన్నారు. ఆ శవాన్ని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలిం చినట్లు తెలిపారు. ఎవరైనా ఆ మృతుడి సంబంధికులు ఉంటే వెంటనే 040-23202238,9866357238 నెంబర్లను సంప్రదించాలన్నారు.

యువకుడు అదృశ్యం



నవతెలంగాణ-ధూల్ పేట్

ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ శివలాల్ నగర్, దర్గా హజారి ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన సుభాష్ పంగి టెంటు హౌస్ లేబర్గా పనిచేస్తున్నాడు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వారు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా రక్త సంబందికులు, బంధు మిత్రులతో వాకాబు చేశారు. ఎంతకీ ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మొదటి సర్వసభ్య సమావేశాన్ని శనివారం మిరలం మండిలోని శ్రీ మహంకాళేశ్వర దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీలో ఉన్నటువంటి వివిధ దేవాలయాలకు చెందిన అధ్యక్షులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం బోనాల పండుగ అందరి సహాయ సహకారతో ఘనంగా నిర్వహించుకుందామని అందుకుగాను దేవాలయాల పరిసర ప్రాంతాలలో చేపట్టే మరమ్మతులు అభివృద్ధి పనుల కోసం ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించడానికి సంబంధిత అధికారుల దగ్గరికి తీసుకెళ్తామని తెలియజేశారు. జూలై 7న గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మవారికి బంగారు బోనం సమర్పించి. ఆషాడ మాసం బోనాల పండుగని ప్రారంభిస్తామని అనంతరం నగరంలోని వివిధ అమ్మవారిలకు బంగారు బోనం సమర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు దేవాలయాల కమిటీ ప్రతినిధులు పొటెల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ గౌడ్, మధు యాదవ్, శ్రీధర్, రాకేష్ తివారి తదితరులు పాల్గొని అధ్యక్షుని ఘనంగా సన్మానించారు.



లాల్ దర్వాజా మహంకాళీ ఆలయంలో భారీ గోల్‌మాల్..

- ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు..
- భక్తులను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్న వైనం..
- ప్రభుత్వానికి ఆలయ ఆదాయ వ్యయాల నివేదికను బహిర్గతం చేసినందుకు కక్ష సాధింపు చర్యలు..
- దేవాలయ ఫోర్‌మెన్ కమిటీ చైర్ పర్సన్స్ పి.సురేందర్ ముదిరాజ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్ర నగరంలోనే ప్రఖ్యాతి గాంచిన పాతబస్తీ లాల్ దర్వాజా మహంకాళీ ఆలయంలో భారీ గోల్‌మాల్ జరుగుతుందని లాల్ దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ ఫోర్‌మెన్ కమిటీ చైర్‌పర్సన్స్ పి.సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్ పర్సన్స్ బద్రీనాథ్ గౌడ్, సి.శివ కుమార్ యాదవ్, శిరా రాజ్ కుమార్ లతో కలిసి ఆయన లాల్ దర్వాజలో మీడియాతో మాట్లాడుతూ... గతంలో గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఆలయ నిధులలో భారీ అవకతవకలు చేసి తప్పుడు నివేదికలను ప్రభుత్వానికి సమర్పించారన్నారు. ఇప్పుడు ఆ నెపాన్ని ఇతరులపై నెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భక్తులను, దేవాదాయ శాఖ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2021-22 సంవత్సర కాలానికి విధులు నిర్వహించిన చైర్మెన్ కే.వెంకటేష్, 2023-24 విధులు నిర్వహించిన ఆలయ చైర్మెన్ రాజేందర్ యాదవ్‌ను ఆలయ ఆర్థిక వ్యవహారాలను సమర్పించాలని దేవాదాయ శాఖ వారు నోటీసులు అందజేశారన్నారు. నోటీస్ నెంబర్. ఆర్ సీ. నెంబర్. ఎఫ్/30/2022-3, నోటీస్ నెంబర్ ఆర్‌సీ. నెంబర్. ఎఫ్/30/2022-1లకు ఆదాయ వివరాలు సమర్పించకుండా భక్తులను ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడానికి ఫోర్ మెన్ కమిటీ సభ్యులను అప్రతిష్ట పాలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు మేము 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆలయ ఆర్థిక లావాదేవీలను సమస్త సమాచారంను ఆలయ కమిటీతోపాటు దేవాదాయ శాఖకు, హైదరాబాద్ కలెక్టర్, పోలీస్ కమిషనర్, డీసీపీలకు స్థానిక ఎస్‌హెచ్ఓకు సమర్పించడం జరిగిందన్నారు. దీంతో గతంలో 2021-22 కాలంలో విధులు నిర్వహించిన ఆలయ చైర్మెన్ వెంకటేష్ సమర్పించిన అఫిడవిట్‌లో ఆలయ ఆదాయం రెండు లక్షల లోపే ఉన్నదని చూపించడం జరిగిందన్నారు. మేము ఫోర్ మెన్ కమిటీ సభ్యులము ఆదాయ వివరాలు బహిర్గతం చేయడం వలన వారు సమర్పించిన ఆలయ ఆదాయం 2,00,000 లోపే ఉన్నదని సమర్పించిన అఫిడవిట్ ఆంతర్యం ఎన్నో సందేహాలకు తావిస్తోందనీ ఆరోపించారు. 2022-23 సంవత్సరానికి ఆలయ ఆదాయం సుమారు రూ.14.82 లక్షలకు ఉందని ఫోర్ మెన్ కమిటీ బహిర్గతం చేసిందన్నారు. దీంతో వారికి ప్రమాదం పొంచి ఉందని గ్రహించి అప్పటి జనరల్ సెక్రెటరీ బి.మారుతి యాదవ్ ఒక పథకం ప్రకారం మాపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నాడన్నారు. ప్రభుత్వం నోటీసులు జారీ చేసిన కూడా ఆలయ ఆదాయ వివరాలు బహిర్గతం చేయకపోకుండా ఆలయ ప్రతిష్టను భ్రష్టు పట్టిస్తున్నాం న్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం కొత్త చైర్మెన్‌ను ఎన్నుకునే ఆనవాయితీ గత 15 సంవత్సరాలుగా వస్తుందన్నారు. అలాంటిది సంప్రదాయా న్ని తుంగలో తొక్కి ఈ సంవత్సర కాలాన్ని కూడా వారే చైర్మెన్ వారే జనరల్ సెక్రెటరీ అని దౌర్జన్యంగా కమిటీని ప్రకటించుకున్నారన్నారు. ఇలా చేయడం, ఆలయ ఆదాయ వివరాలు దాచిపెట్టడం వెనక ఏదో మర్మం దాగి ఉందని అర్థమవుతుందన్నారు. ఈ విషయం దేవాదాయ శాఖకు ఇక్కడ జరుగుతున్న ఆచార వ్యవహారాల విధ్వంసాన్ని ఆలయ ప్రతిష్టను భ్రష్టు పట్టిస్తున్న విషయాన్ని నివేదిక రూపంలో తెలియజేశామన్నారు. అయోమయ పరిస్థితిలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ ప్రతిష్టను కాపాడడానికి దేవాదాయ శాఖ ప్రత్యేక దృష్టి సాధించి ఒక ప్రత్యేక అధికారిని నియమించి వచ్చే ఆషాడ మాసంలో జరిగే బోనాల జాతరకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. దేవాదాయ శాఖ వారు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. మాజీ ట్రెజరర్ పోసాని సదానంద మాట్లాడుతూ.. ఐపీ తీసుకున్నాడని నా వ్యక్తి గత విషయాలను భంగం కల్గించినందుకు పరువు నష్టం దావా వేస్తానని అన్నారు.

చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలి



- నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.రాజా రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకం ప్రతి ఒక్కరు చదవాలని నిమ్స్ మాజీ డైరెక్టర్ డా రాజా రెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబెర్ డా.ప్రతిబా లక్ష్మి రచించిన "చేత(తు)ల్లో ఆరోగ్యం పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి, తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డా. రమణి, పుస్తక రచయిత డా ప్రతిబా లక్ష్మి హాజరై పుస్తకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవిత కాలం పెరుగుతున్న క్రమంలో ఎదురవు తున్న అనేక దీర్ఘ కాలిక జబ్బుల గురించిన అవగాహన ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, సామాన్యులకు అర్థం అయ్యే సరళమైన తెలుగు భాషలో ఇలాంటి పుస్తకాలు లేవు. ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో ఉంచువాలని కోరారు. తెలాంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డా. రమణి మాట్లాడుతూ ఈ పుస్తకం ఇంట్లో ఈ పుస్తకం ఉంటే డాక్టర్ ఉన్నట్టేనని ఈ పుస్తకం చదవాలని పేర్కొన్నారు. తెలంగాణ ఆయుష్ మాజీ అదనపు సంచాలకులు డా. విజయ లక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం గురించి ఉండే అనేక సందేహాలకు, వైద్యులు అందించాల్సిన సలహాలు ఇందులో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత డా.ప్రతిబా లక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడం, మన ఆరోగ్యం యొక్క బాధ్యత మనమే తీసుకోవడం వలన మన చేతల్లోనే (మన చేతుల్లోనే) మన ఆరోగ్యం ఉంటుందని తెలియచేసే ప్రయత్నమే ఈ పుస్తకమన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ గాంధీ, ఉస్మానియా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్లు, దాదాపు వంద మంది ఆరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 254 అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుట్ పాత్ పైన జీవనం సాగిస్తూ ఆకలితో అలమటిస్తున్న పేదలకు 254 అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. పేదవారు వర్షాలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతూ ఆకలి కలమటిస్తున్నారన్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు కీర్తి మానస, చిన్నారి రోహిణి, అఖిల్, హరీష్ కుమార్, శుభం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



- 42 ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉంది
- సోమాజిగూడ గవర్నమెంట్ హైస్కూల్ 1982 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సోమాజిగూడ గవర్నమెంట్ హైస్కూల్‌లో 1982 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నగరంలోని ఓ హెూటల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 42 ఏండ్ల తర్వాత ఒక దగ్గర సమావేశం కావడంతో ఒకరి జ్ఞాపకాలు మరొకరు పంచుకునేందుకు ఒక మంచి అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా దూర ప్రాంతాలలో ఉన్న మిత్రులంతా ఒక్క చోట చేరి జ్ఞాపకాలను పంచుకున్నారు. 42 ఏండ్ల సుదీర్ఘ కాలం తర్వాత తాము కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గత స్మృతులను గుర్తు చేసుకుని ఉల్లాసంగా, ఉత్సాహకంగా కలియ తిరిగారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ, తాము చదువుకున్న రోజుల్లో తమ అనుబంధాలను గుర్తు చేసుకుంటూ తన్మయత్వంలో మునిగిపోయారు. పాఠశాలతో తమకున్న అనుభవాలను గుర్తు చేసుకుని, తమ కుటుంబ సభ్యుల నేపథ్యాలను, కష్ట సుఖాలను పంచుకున్నారు.వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాలలో, వ్యాపారాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నేమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అజ్మీరా రామ్‌దాస్, బాషా, కిషన్, రాధాకృష్ణ, గోపాల్, దయానంద్, సత్యనారాయణ గౌడ్, స్వామినాథం, వినోద్, శకుంతల, రేవతి, స్వప్న, భాగ్య, ముత్యం, పద్మశ్రీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలి



- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన 6 గ్యారంటీ హామీల్లో ఒకటైన నిజమైన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఎఫ్ఐఆర్‌తో సంబంధం లేకుండా వెంటనే కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. పథకాల అమలకు ఎలక్షన్ కోడ్ ఉందంటూ దాటవేశారని ఇప్పటికైనా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్, ఉచిత బస్ పాస్, హెల్త్ కార్డు, వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలలో ప్రత్యేక కోటా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి పటోళ్ల సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కొంతం వీరస్వామి, బి.ఇంద్రకుమార్, కన్వీనర్లు గుండేటి ఐలయ్య యాదవ్, గుర్రని వెంకటేష్ గౌడ్, ఉండాటి లాలయ్య, దుగ్గని శ్యామల, వి.సదయ్య, ప్రభాకర్, కోశాధికారి జంగా సుదర్శన్, కో-ఆర్డినేటర్ కె.నరేందర్ గౌడ్, నాయకులు పొంతం యాదిరెడ్డి, కె.సురేందర్ రెడ్డి, దయానంద్, సురేష్, కందాల జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న కోదండరామ్‌కు పురస్కారం

నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ, సీల్ వెల్ కార్పొరేషన్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 12న మలి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగ సంఘాలను ఏకతాటి పైకి తెచ్చిన పోరాట యోధుడు ప్రొఫెసర్ కోదండ రామ్‌ను తెలంగాణ సాధికారత విప్లవ యోధ పురస్కారంతో సత్కరిస్తామని నిర్వహకులు బండారు సుబ్బారావు ఆమని తెలిపారు. ముఖ్య అతిథిగా పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొంటారన్నారు. నగర మహా సభ జాతీయ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటి దామోదర్, పోలీస్ ఉన్నత అధికారి జితేందర్ రెడ్డి, సౌజన్య దాతలు కుసుమ భోగరాజు రామకృష్ణ దైవజ్ఞ శర్మ ప్రముఖ గాయని ఆమని,గాయకులు మిత్ర ,సురేష్,రాజన్, సుభాష్, శిరీష అరుణ, అనుష తదితరులు చే సినీ సుస్వరాలు 57వ కార్యక్రమంలో సినీ సంగీత విభావరి ఉంటుందని వారు తెలిపారు.

మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం

- జాతీయ ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతదేశ ప్రధానిగా నరేంద్రమోడీ ప్రజల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల జాతీయ ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మంత్రి వర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ సరికొత్త నిర్ణయాలను తీసుకుని యువత మరింత అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా అగ్రకుల పేదల రిజర్వేషన్లపై మోడీ తీసుకున్న నిర్ణయాల వల్ల పేద విద్యార్థులు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా ప్రతి ఏడాది లక్షలాది మంది యువతకు బాటలు వేశారని ఆయన గుర్తు చేశారు. ఇక ముందు కూడా తమ సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేసిన వారికి సంపూర్ణ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు టి. ప్రతిమ, విజయశ్రీ, వీరమల్ల కళ్యాణ్, ఎస్.రమేష్, డి.కె. పాండే, రాజురంజన్ ప్రసాద్, టి.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ సమగ్ర తెలుగు దినపత్రిక 12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com

శిల్పారామం అలరించిన నృత్య ప్రదర్శన



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆది వారం శ్రీలక్ష్మి శాంకరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. వినాయక కౌతం, బ్రహ్మాంజలి, జతిస్వరం, జయ జయ దుర్గే, నీలమేఘ శరీర, దశావతారం, కొలువైఉన్నడే, ఇందేందువచ్చితి విరా, నారాయణతే నమో నమో, హిందోళ తిల్లాన, మని నూపుర ధరి, చక్కని తల్లికి మొదలైన అంశాలను ప్రద ర్శించారు. లహరి, మనస్విని, సంజన, శరణ్య, కాజోల్, లిఖిత, శ్రీజ, కావ్య, తపస్య, సంప్రీతి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

యువత క్రీడల్లో రాణించాలి

● మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి

నవతెలంగాణ- రంగారెడ్డి డెస్క్

యువత క్రీడలలో రాణించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కిషన్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండలంలోని కొలుకులపల్లి గ్రామంలో యువ కులు రెండు రోజులుగా కొలుకులపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సన్‌రైజర్స్ కొలుకులపల్లి, కొలుకులపల్లి నైట్ రైడర్స్, కోల్కుల్‌పల్లి సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ కొలుకులపల్లి నాలుగు జట్లుగా ఏర్పడి తలపడ్డాయి. అందులో సన్రైజర్స్ కొలుకులపల్లి, కొలుకులపల్లి సూపర్ కింగ్స్ ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో సన్‌రైజర్స్ కొలు కుపల్లి గెలుపొంది మొదటి బహుమతి అందుకుంది. ఈ సందర్భం గా వారి కి బహుమతి దాత బట్టు కిషన్ రెడ్డి రూ.11వేల నూట11 అందజేశారు. అదేవిధంగా రెండో స్థానంలో నిలిచిన కొలుకులపల్లి సూపర్‌కింగ్స్‌కు బహు మతి దాత బట్టు ధర్మారెడ్డి రూ.6.666 అందజేశారు.

నేటి నుండి పిఈ సెట్ 2024 పరీక్షలు ఏర్పాట్లు పూర్తి

● కన్వీనర్ ప్రో.రాజేష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ - 2024 (టీజీ పీఈసెట్-2024) నిర్వహించనున్నట్టు కన్వీనర్ ప్రో.రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6.30కు పురుష అభ్యర్థులకు శారీరక సామర్థ్య క్రీడా నైపుణ్య పరీక్షలు ప్రారంభమవు తాయని కన్వీనర్ ప్రో. రాజేష్ కుమార్ తెలిపారు. మొదటి రోజు ప్రారంభమయ్యే పరీక్షల నిర్వహణ కార్యక్రమంలో రాష్ట్రం లోని వివిధ ఫిజి కల్ ఎడ్యుకేషన్ కళాశాలల ఆచార్యులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన కోచ్‌లు, పరీక్షల నిర్వహ ణాధికారులు పాల్గొంటారని కన్వీనర్ తెలిపారు. పురుష అభ్యర్థులకు 100 మీటర్లు, 800 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్ ఒక విభాగంలో నైపుణ్య పరీక్షను అలాగే మహిళా అభ్యర్థులకు 100 మీటర్లు, 400 మీటర్లు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హై జంప్ ఒక విభాగం లో నైపుణ్య పరీక్షలు ఈ నెల 13 వరకు ఈ పరీక్షలు నిర్వహిచబడతాయని, ప్రతీరోజు సుమారు 600 మంది విద్యార్థి , విద్యార్థులు హాజరవుతారని ఆచార్య రాజేష్ కుమార్ తెలిపారు. హాజరుకానున్న అభ్యర్థులు నిబంధనలు పాటించాలని సూచించారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి

● వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. బౌద్ధనగర్‌లో ఎస్.ఆర్.వీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత విద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా ఆస్తమా, పల్మనాల జీ విభాగాలకు సంబంధించిన జబ్బులు గుర్తించి, ఉచితంగా వైద్యం అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ వైద్య రంగం పేదలకు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తగిన వైద్య సదుపాయాలను కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య రంగాలకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని, వాటిని పేదలకు చేరువలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. ఎస్.ఆర్.వీ. మల్టీ స్పెషాలిటి క్లినిక్, ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రామచందర్, ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎండీ సమీర్ అహ్మద్, మేనేజర్ మహమ్మద్ రాబ్బాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్మనాలజీ విభాగానికి సంబంధించి పలు ఖరీదైన వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించారు.

సీఎం రేవంత్ రెడ్డికు గ్రూప్ -1అభ్యర్థుల కృతజ్ఞతలు

● ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ



నవతెలంగాణ-ఓయూ

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలు, పరీక్షల వాయిదాలతో విసిగివేసారి తీవ్ర మానసిక వేదనను అనుభవించి ప్రభుత్వ నియామకాలపై ఆశలు వదులుకున్న లక్షలాది మంది విద్యార్థి నిరుద్యోగులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించిన తీరుతో ఉద్యోగ నియామకాలు సక్రమంగా భర్తీ చేయబడతాయని ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పకడ్బందీగా ఓఎంఆర్ సీట్ పై అభ్యర్థుల ఫోటోతో కూడిన వివరాలు బయోమెట్రిక్ విధానంతో విజయవంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ సభ్యులు సిబ్బందికి ప్రత్యేకంగా విద్యార్థి నిరుద్యోగులలో నియామకాల పట్ల నమ్మకాన్ని కల్పించిన విద్యార్థి నిరుద్యోగుల పక్షపాతి ప్రజా పాలన అధినేత సీఎం రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు అని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్ ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ వలిగొండ నరసింహ కృతజ్ఞతలు చెప్పారు.

బీసీ కులాల ప్రయోజనాలకు కృషి

● గంగపుత్ర సంఘం భవనాన్ని ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

బీసీ కులాల ప్రయోజనాలకు కృషి చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. బౌద్ధనగర్‌లో గంగపుత్ర స్థానిక సంఘం నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని బీసి కులాలు సంఘటితంగా వ్యవహరిస్తూ తమ హక్కులను కాపాడుకోవాల్సిందన్నారు. తాము తొలి నుంచే బీసీ కులాల సంక్షేమానికి అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. అన్ని వెనుకబడిన కులాల వారికీ అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని తమ వంతు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా తాము బీసీల హక్కులను పొందేందుకు సహకరిస్తామని పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ గంగాపుత్ర సంఘం నూతన కార్యాలయం ఏర్పాటు చేసుకోవడంలో తన వ్యక్తిగత విరాళాన్ని కూడా పద్మారావు గౌడ్ అందించారని ప్రశంసించారు. గంగ పుత్ర సంఘం నేతలు దేశబోయిన రఘు, కైరం కొండ సత్యనారాయణ, ప్రభాకర్, పాక మూర్తి, బాలయ్య, హరి, సీనియర్ నేతలు కంది నారాయణ, పుల్లయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక గంగాపుత్ర సంఘం నేతలు పద్మారావు గౌడ్ ను ఘనంగా సత్కరించారు.

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసాన్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్‌నేత!

● బీఆర్ఎస్ చైర్ పర్సన్‌పై కాంగ్రెస్ నేతకు ఎందుకంత ప్రేమ!



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత పరోక్షంగా అడ్డుకుంటున్నట్టు మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ శ్రేణుల్లో గుసగుసలు వినపడుతున్నాయి. అయితే గత నెలలో చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహరెడ్డిపై అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించుకున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. కాగా జూన్ 7న అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్లుగా పలు వార్తలొచ్చాయి. అయితే మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ భర్త మర్రి నర్సింహ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డితో చర్చలు జరిపి తన సతీమణిపై అవిశ్వాసం పెట్టకుండా చూడాలని కోరినట్లు తెలిసింది. అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ సభ్యులకు పూర్తి కోరం ఉన్నప్పటికీ మేడ్చల్ మున్సిపాలిటీలో అవిశ్వాసం పెట్టకుండా ఆ సీనియర్ నేత పరోక్షంగా అడ్డుకోవడంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నా వెనుక వారిద్దరూ ఒక్కటేనని ఓ వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు అనుకుంటు న్నారు.

అవిశ్వాసం జరిగితే కాంగ్రెస్ నాయకుడి సతీమణి బీసీ కౌన్సిలర్ ఎక్కడ చైర్ పర్సన్ అవుతుందనే ఉద్దేశంతోనే అవిశ్వాస తతంగాన్ని అడ్డుకుంటున్నట్టు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ కోసం రెండు దశాబ్దాలుకు పైగా కష్టపడుతూ పార్టీలు మారకుండా ఉన్న ఆ నేతకు అన్యాయం జరుగుతుందనే పలువురు కోరుతున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలో అవిశ్వాసం జరుగుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

14న జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం



● పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

నవతెలంగాణ-బంజారాహిల్స్

జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్ నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జూన్ 14,15వ తేదీలలో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు అమీర్పేటలోని గ్రీన్ ల్యాండ్‌లోని ది ప్లాజా, పర్యాటక్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందనీ ఈ కార్యక్రమం ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం,జ్ఞానం,వేదికను అందించడం లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. డెలిగేట్లు జ్ఞాన మార్పిడి చేసుకోవడానికి ఇదొక వేడుకన్నారు. ఈ కన్వెన్షన్ కోసం దేశ, విదేశాలలో ఉన్న ఇరవై పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్టు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమ్మాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రయాన్ టాచీ-మెన్సన్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు.

టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డులు

ఈ వేడుకలలో భాగంగా టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డుల ఏడో ఎడిషన్ 15 జూన్ 2024న సాయంత్రం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా రెండు కేటగిరీలలో అవార్డులు ఉన్నాయన్నారు. 'జాడే ఆఫ్ ఇండియా' ఈవెంట్ ఇండస్ట్రీలో పదిహేను ఏండ్లకు పైగా పనిచేసిన ఇండస్ట్రీ లీడర్లకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నామన్నారు. 'లైఫ్టైమ్ అచీవ్మెంట్' ఈవెంట్ ఇండస్ట్రీలో ముప్పై ఏండ్లకు పైగా పనిచేసిన ఇండస్ట్రీ లీడర్లు ప్రత్యేక గుర్తింపు ఇవ్వనున్నామన్నారు. 'కోహ్-ఇ-నూర్ ఆఫ్ ఇండియా' హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు, ప్రశంసలు తెచ్చిన ఈవెంట్‌కు ఈవెంట్ మేనేజర్ లేదా కంపెనీకి అత్యున్నత గౌరవం ఇవ్వనున్నామన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ కే రమేష్ నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్ఐడబ్ల్యూపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ కే ముప్పన, కో-కన్వీనర్లు హిరీష్ రెడ్డి, కుమార్ రాజా, సుధాకర్, యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్

ఈ నెల 10 నుంచి ప్రారంభించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు. ఆయన పర్యవేక్షణలో చాంద్రాయణ గుట్ట నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంల్లో అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారన్నారు. జోనల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయాలన్నారు. తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులచే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన పురోగతికి సిద్ధం

రియల్ ఎస్టేట్ ప్రీమియర్ అసోసియేట్స్ నెట్‌వర్క్(ఆర్ఈపీఏ)



నవతెలంగాణ-బంజారాహిల్స్

రియల్ ఎస్టేట్ రంగం గణనీయమైన పురోగతికి సిద్ధంగా రియల్ ఎస్టేట్ ప్రీమియర్ అసోసియేట్స్ నెట్‌వర్క్ ఉందనీ ల్యాండ్‌మార్క్ ఈవెంట్ రియల్ ఎస్టేట్ పరిశ్రమ నుండి విభిన్నమైన వాటాదారుల సమూహాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చిందని సునీల్ చంద్ర రెడ్డి, బాలానంద్ తెలిపారు. ఆదివారం తాజ్ డెక్కన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రేపా, (ఆర్ఈపీఏ)లోగో, వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. నెట్‌వర్కింగ్ సెషన్‌లు రియల్ ఎస్టేట్ రంగం ఒక సంచలనాత్మక సంఘటనను చూసిందనీ పరస్పర సహకారంతో వృద్ధిని సాధించేందుకు ఈ సంస్థ ప్రతినిధులు వారి పాత్ర కీలకం కానుందనీ వారు మాట్లాడుతూ వివరించారు. అనంతర విశిష్ట అతిథులు, జాయింట్ ఎండి వెర్టెక్స్ గ్రూప్ మురళీ మోహన్, జూపిటర్ క్యాపిటల్ మాజీ ఎండి గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ సిఇఒ సుధాకర్ గాంధే సత్కరించి రేపా, అనేది ఎంటీన్ రి ప్రైమ్ ప్రయివేట్ లిమిటెడ్ ,ద్వారా జీవం పోసుకున్న టీఎస్‌వీ ప్రసాద్ (చైర్మెన్), సి ఎ రాజేష్ డొంకేశ్వర్ (వైస్‌చైర్మెన్)ల ఆలోచన నెట్‌వర్క్ రియల్ ఎస్టేట్ రంగంలో నిమగ్నమైన నిపుణులు సంస్థలను కనెక్ట్ చేయడానికి, సహకరించడానికి అనేక అవకాశాలను ఉపయోగించుకోవడానికి బలమైన ప్లాట్‌ఫారమ్‌ను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుందనీ తెలిపారు. సిఎ రాజేష్ డొంకేశ్వర్ హెూలిస్టిక్ కార్పొరేట్ అడ్వైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క మేనేజింగ్ డైరెక్టర్, ఇది ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వర్చువల్ సీఎఫ్ఓ సర్వీస్ ప్రొవైడర్ సంస్థగా ఉంటుందని భావిస్తున్నారు.

రత్నాకర శర్మ సహృదయ జర్నలిస్ట్



నవతెలంగాణ-కల్చరల్

రత్నాకర శర్మ సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలంలో విశాలాంధ్ర పత్రిక లో సాంస్కృతిక వార్తల విలేకరిగా అటు పిమ్మట ఇతర పత్రికలలో సుదీర్ఘ కాలం పనిచేసి తదుపరి ఆధ్యాత్మిక జీవనంతో జీవితం ముగించిన సహృదయ జర్నలిస్ట్ అని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఎంకె.రాము నివాళులర్పించారు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ వద్దనున్న సిటీ కల్చరల్ సెంటర్‌లో సచ్చిదానంద కళా పీఠం నిర్వహణలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రత్నాకర శర్మ సంతాప సభ నిర్వహించారు. డాక్టర్ రాము మాట్లాడుతూ సచ్చిదానంద కళా పీఠం స్థాపించి ఎందరో బాల బాలికలను సంగీత నృత్య కళాకారులుగా సమాజానికి అందించారని వివరించారు. ఆయన శిష్య బృందం పలువురు తమ గురువు రత్నాకర శర్మ వ్యక్తిత్వాన్ని వివరించారు. జర్నలిస్టులు కనకాచారి నూనె సతీష్, కృష్ణ, అఖిలేష్, రామి రెడ్డి శ్రీనివాస్ బాల కృష్ణ ఫోటో జర్నలిస్ట్ మేడిపల్లి యాదగిరి తదితరులు శర్మ స్నేహ స్వభావంను గుర్తు చేసుకున్నారు.

ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం కమిటీ నూతన అధ్యక్షుడిగా సోమ దయానంద్



నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం కమిటీ నూతన అధ్యక్షులుగా సోమ దయానంద్‌ను ఎన్నుకున్నారు. పారడైజ్ వద్ద ఉన్న ఆర్యవైశ్య అభ్యుదయ సంఘంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో దయానంద్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తమ సంస్థ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆర్యవైశ్యులు ఇతర పేద విద్యార్థుల చదువుల కోసం ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో రూ.20 లక్షలను కేటాయించినట్లు తెలిపారు. తమ సంస్థను గతంలో కంటే మరింత గొప్పగా వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు.

అనాథ పిల్లలకు అన్నదానం



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ ప్రకాష్ పుట్టినరోజు సందర్భంగా చైతన్యపురిలోని ఆదర్శ ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాయి శైలేష్ యాదవ్, గణేష్ దూదిగామ, రవి యాదవ్ గంగబోయిన,సాయినాథ్ రాజ్, శివ ప్రకాష్ అన్న మిత్ర మండలి, బీఆర్ఎస్ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా శివ ప్రకాష్

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కోశాధికారిగా శివ ప్రకాష్‌ను ఆదివారం జగన్ మోహన్ రావు (ఇండియన్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ) గా ప్రకటించారు.

జేఈఈ 2024 ఫలితాల్లో సత్తా చాటిన ఫిట్జీ విద్యార్థులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

జేఈఈ అడ్వాన్స్‌డ్- 2024 ఫలితాల్లో ఫిట్జీ హైదరాబాద్ విద్యార్థులు సత్తా చాటారు. జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను లక్డీకాపూల్‌లోని అడోబ్ హెూటల్ లో సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆనంద్ రామన్ ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సత్కరించి ఆయన మాట్లాడారు.జాతీయస్థాయిలో వందలోపు నాలుగు ర్యాంకులు సాధించామని అన్నారు. గంగా శ్రేయస్ 13వ ర్యాంకు, ప్రణీత్ సింగ్ భాటియా 32వ ర్యాంకు, హర్షిని పోసిన 72వ ర్యాంకు, శ్రీయశస్ మోహన్ కల్లూరి 92వ ర్యాంకు సాధించినట్లు తెలిపారరు. అదే విధంగా జాతీయ స్థాయిలో 200 లోపు ఏడుగురు విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ఆయన వెల్లడించచారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

రామోజీరావుకు అఖిలపక్ష పార్టీల పుష్పాంజలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఈనాడు ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి జియగూడలోని అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా పుష్పాంజలి ఘటించారు. బీమ్ నగర్ చౌరస్తా దగ్గర నివాళులర్పించిన జియగూడ కార్పొరేటర్ దర్శన్, సీపీఎం జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, పూర్వ సీపీఎం కంటెస్టెడ్ కార్పొరేటర్ ఏ.రాజేష్, ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ ఎం .శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్త, నరహరిచారి, బీజేపీ నాయకులు కామ్లె వంగ్మేకర్, వికలాంగుల సంఘం నాయకులు నరేష్, ఆధిజంబవ సంఘం నాయకులు ఎం.బాలకృష్ణ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు మాట్లాడుతూ.. పత్రికా రంగాన్ని ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా నడిపించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రామోజీరావు అని కొనియాడారు. తెలుగు ప్రజల చెంతకు జర్నలిజంను తీసుకురావడమే కాక అనేకవిపత్తులు సంభవించినపుడు ఆపదలో ఆదుకున్న గొప్ప వ్యక్తి రామోజీరావు అని శ్లాఘించారు. ఆధునిక సాంకేతికతను జర్నలిజానికి వర్తింప చేయడంలో వివిధ ప్రాంతీయ బాషల్లో చానళ్లు తీసుకురావడంలో ఆయనకు సాటి లేరని గుర్తుచేశారు. అనంతరం వారు కొద్ది నిమిషాలు మౌనం పాటించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం | జూన్ 10, 2024 | www.navatelangana.com



నవతెలంగాణ - బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి ఆధ్వర్యంలో ఆదివారం చిన్ననాటి మిత్రులు పగడాల ఉమేష్ అమ్మ దశ దిన కర్మను నిర్వహించారు. అనంతరం బాలాపూర్ గ్రామ పెద్దలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో లబ్ది

నవతెలంగాణ - ఎల్బీనగర్

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వీవీ నగర్ నందు నివాసం ఉంటున్న చంద్రవతి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆర్థిక పరిస్థితులు బాగాలేనందున ఆమె కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఆదివారం 1,50,000(ఒక లక్ష యాభై వేల రూపాయల) ఎల్ఓసీ చెక్కు మంజూరైంది. వెంటనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లబ్దిదారులకు ఆ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరి రక్షణకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని అన్నారు. పేద ప్రజలు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీఎం సహాయ నిధి అండగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, ఛాతిరి మధు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వి స్పోర్ట్స్ ఇంట్రా స్విమ్మింగ్
ఛాంపియన్‌షిప్ 2024 సీజన్ 2 పోటీలు



- విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేత

నవతెలంగాణ - నాగోల్

నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలోని వి స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం వి స్పోర్ట్స్ ఇంట్రా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ 2024 సీజన్ 2 పోటీలు ఎంతో ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా అడిషనల్ డిప్యూటీ కమిషనర్ (స్పెషల్ బ్రాంచ్) హైదరాబాద్ సిటీ పోలీస్ ఏ. రామ్ రెడ్డి, సంఘ సేవకులు ఏ. జనార్దన్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో గెలుపొందిన విజేతలకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీలలో విజేతలుగా నిలిచి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం వి స్పోర్ట్స్ నిర్వాహకులు మాట్లాడుతూ 45 రోజులు పాటు సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఆదివారం ఈ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా అండర్ 5, అండర్ 7, అండర్ 9, అండర్ 15 విభాగాలలో పోటీలు నిర్వహించినట్టు వివరించారు. పోటీలలో గెలిచిన వారికి గోల్డ్, సిల్వర్, బ్రౌన్సు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. గెలుపొందిన విజేతలను రానున్న రోజులలో వివిధ స్థాయిలలో జరిగే పోటీలకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. తదనంతరం గెలుపొందిన క్రీడాకారులు మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్ లో పాల్గొని విజేతలుగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ వి స్పోర్ట్స్‌లో చాలా చక్కగా ఓపికతో క్రీడలు నేర్పిస్తారని చెప్పారు. ఇక్కడ నేర్పించినట్లు మరేక్కడ నేర్పించరని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వి స్పోర్ట్స్ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా భవిష్యత్‌లో వివిధ స్థాయిలలో జరిగే పోటీలలో విజేతలుగా రాణిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వి స్పోర్ట్స్ డైరెక్టర్లు నరేష్, వినోద్, రాజు, కోచులు, సిబ్బంది, క్రీడాకారుల తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. విట్టా శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లెలగూడలోని ఓ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘాలు తమ సామాజిక వర్గంలో వెనుకబడ్డ, ఉన్నత విద్య అభ్యసించడానికి, మంచి ర్యాంకులు సాధించిన వారికి ప్రోత్సాహకరంగా స్కాలర్ షిప్‌లు ఇవ్వడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వ పరంగా ఏ సహాయం కావాలన్నా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

నూతన అధ్యక్షులుగా మంచన ప్రేమ్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల రవీందర్ గుప్తా, కోశాధికారి శ్యాం ప్రసాద్ గుప్తా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మంచన శుభకుమార్ గుప్తా, అదనపు ప్రధాన కార్యదర్శి వి. నాగశంకర్ గుప్తా, అదనపు కోశాధికారిగా పబ్బా రాజు గుప్తా, పీఆర్వో కొక్కొండ లక్ష్మణ్ గుప్తా, మీడియా కన్వీనర్‌గా అన్నారం సురేష్ గుప్తాలతో పాటు గౌరవ సలహాదారులు, సలహాదారులు, ఉపాధ్యక్షులు సంఘం అభ్యున్నతికి పాటు పడుతామని వాసవీ మాత సాక్షిగా ప్రమాణం చేశారు. నూతన అధ్యక్షుడు మంచన ప్రేమ్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వాలు పెంచుతామని, మహాసభ నియమ నిబంధనల మేరకు సంఘాన్ని ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ గుప్తా, రాజకీయ కమిటీ చైర్మెన్ చింతల రవికుమార్, కార్యదర్శి అర్థం లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా, జిల్లా మహాసభ కోశాధికారి బిల్లకంటి కిరణ్ గుప్తా, బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాళ్ల శ్రీనివాస్ గుప్తా, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు కామేష్ రెడ్డి, వాసవీ కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ చైర్మెన్ తెరిటపల్లీ శ్రీనివాస్ గుప్తా, అధ్యక్షులు పచ్చిపులుసు శ్రీరామచంద్ర మూర్తి, ప్రధాన కార్యదర్శి ఇరువెంటి సురేష్ గుప్తా, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారులకు ఇచ్చిన
హామీలు నెరవేర్చాలి

టీయూఎఫ్ నేతలు

నవతెలంగాణ - తుర్కయంజాల్

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీయూఎఫ్ నేతలు కోరారు. తుర్కయంజాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మున్సిపాలిటీ అధ్యక్షుడు నక్క జంగయ్య గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యమ కారుడికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నామ్మన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు గడ్డం ప్రకాష్, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో సీటు సాధించడం హర్షనీయం



- గుడ్ల శ్రీనివాస్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి పోటీ ప్రపంచంలో ఇటీవల విడుదల చేసిన నీట్ ఫలితాల్లో సీతా ప్రనూష సీటు సాధించడం హర్షనీయమని టీఎస్‌పీఏ అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ మహారాజ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ పరిధిలోని శ్రీనిలయ కాలనీలో నివాసం ఉండే సంతోష, క్రిష్ణమాదిగ దంపతుల కుమార్తె సీతా ప్రనూష ఆల్ ఇండియా నీట్ ఫలితాలలో 640 మార్కులు సాధించింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుడ్ల శ్రీనివాస్ మహారాజ్ ఆమెను పూలమాలల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గంలో జన్మించిన సీత ప్రనూష నీట్‌లో సీటు సాధించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టు బాలకృష్ణ, శ్రీనిలయ కాలనీ అధ్యక్షులు రామ్మోహన్, కాలనీ వాసులు గార్లపాటి యాదయ్య, రాజేశ్వర్ రావు, సూర్య తేజ నాయుడు, రవీందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హోల్స్‌లోని మట్టి తొలగింపు





నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 21, 22 వార్డులలో ఉన్న మ్యాన్ హోల్స్ ఇటీవల కురిసిన వర్షాలకు మట్టితో నిండి పోయాయి. ఈ మేరకు గల్ఫర్ మిషన్ సహాయంతో ఆదివారం మట్టిని తొలగించినట్టు 21వ వార్డు కౌన్సిలర్ షేక్ పమీద అఫ్జల్ , 22 వార్డు ఇంచార్జి సయ్యద్ హుసేన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాలనీల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పించడం ప్రజా ప్రతినిధుల, అధికారుల బాధ్యత అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని వ్యక్తి మృతి





నవతెలంగాణ - మలక్ పేట్

ద్విచక్ర వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట్ న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. అటుగా వస్తున్న ద్వి చక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన ద్విచక్ర వాహనదారుడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారాన్ని స్థానికులు పోలీసులకు అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడి, ద్విచక్ర వాహనదారుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పొదుపు సంఘంతోనే ఆర్థిక ప్రగతి



సంఘం అధ్యక్షుడు నవాబ్‌పేట ఆంజనేయులు

నవతెలంగాణ - బడంగ్‌పేట్

పొదుపు సంఘంతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని, సంఘం సభ్యుల సంక్షేమానికి నవ కార్మిక సంఘం ఎంతో కృషి చేస్తుందని పొదుపు సంఘం అధ్యక్షులు నవాబ్ పేట ఆంజనేయులు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నవ కార్మిక ప్రగతి సొసైటీ పొదుపు సంఘం 12వ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఏండ్లుగా విజయవంతంగా ముందుకు సాగుతున్న సంఘం విశేషాలపై చర్చించుకున్నట్లు తెలిపారు. మున్ముందు కూడా పూర్తి పారదర్శకతతో కలిసి కట్టుగా ముందుకు సాగుతూ ఆర్థిక ప్రగతిని పెంపొందించుకోవాలన్నారు.

సంఘంలోని సభ్యులెవరైనా మరణిస్తే రుణమాఫీ, దహన సంస్కారాలకు ఎనిమిది వేల సదుపాయం కల్పించడంతో పాటు 60 ఏండ్లు నిండిన సభ్యులకు నెలకు రూ.300లు పింఛన్, సభ్యుల ఇంటిలో కూతురు పెళ్లి ఉంటే రూ. 2వేల నగదు ఇవ్వాలని తీర్మానించి ఆమోదం చేసినట్టు తెలిపారు. 2012 లో 11 మంది, పదకొండు వందల రూపాయలతో ప్రారంభమై ప్రస్తుతం సంఘం... 392 మంది సభ్యులతో కోటీ నలభై లక్షల రూపాయలు కలిగి ఉందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా నవాబ్ పేట్ ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలుగా ఇక్కే సత్యమ్మ, కార్యదర్శిగా సి.నర్సింహా యాదవ్, కోశాధికారిగా బాస శంకర్, సహాయ కార్యదర్శిగా కావలి మహేష్, ముఖ్య సలహాదారులుగా రావుల్ల గల్ల యాదగిరి, పాలక వర్గ సభ్యులుగా వడ్డే సునీల్, రంగం మహేష్, జోగు స్వరూపలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఎమ్మెల్యే అహ్మద్ బలాల



నవతెలంగాణ - మలక్‌పేట

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట్ బాగ్ ఏ జనహరచౌని డివిజన్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మైత్రి వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైద్యులు రెండు వందల మందికి పైగా రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో చౌనీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్, ఎఐఎంఐఎం సీనియర్ నాయకుడు సయ్యద్ తకిఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





బీజేపీ ఎంపీలకు ఘన సన్మానం







నవతెలంగాణ - సంతోష్ నగర్

బీజేపీ పార్టీ నూతన ఎంపీలను స్థానిక నాయకులతో కలిసి చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యులు జి.కిషన్ రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్‌లను వారి వారి నివాసాలలో కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు కొప్పుల నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, కొంతం దీపిక, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం రవీందర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.



హనుమకొండ జిల్లాలో ఈనెల 6-7 తేదీల్లో జరిగిన తెలంగాణ ఏ ఛాంపియన్‌షిప్-2024లో జావెలిన్ త్రోలో మేకలమండి జీఎంయూపీఎస్‌లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి మరపాక మనుదీప్ అదిత్య తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థి మనుదీప్ అదిత్య, తండ్రి భాస్కర్, కోచ్ రాజేష్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులను మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. భవిష్యత్తులో మరెన్నో పథకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.మేరీ, కె. లక్ష్మి, శ్రీదేవీ, ఈ. పరుశురామ్ తదిరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ-సిటీబ్యూరో

నేడు ప్రజావాణి



- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో


ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేటి నుంచి సోమవారం యథావిధిగా నిర్వహించనున్నామని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటు ఎన్నికలు.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు.. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం నేడు తిరిగి యథావిధిగా కొనసాగుతుందని అదనపు కలెక్టర్ వివరించారు.

నాణ్యమైన విద్య అందించడమే 'ఆర్చిడ్'లక్ష్యం

- ఆర్చిడ్ స్కూల్ కరస్పాండెంట్ కర్ణాటి మధు, ప్రిన్సిపాల్ కర్ణాటి కవిత
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ
- జవహర్ నగర్‌లో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు
- పోటీ పరీక్షల్లో విజయం కోసం ప్రత్యేక ప్రణాళికలు
- అత్యుత్తమ అధ్యాపక బృందంతో బోధన
- కంప్యూటరైజ్డ్ ఆంగ్ల మాధ్యమం
- క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం



సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆర్చిడ్ పాఠశాల భవనం

నవతెలంగాణ-జవహర్‌నగర్

నేటి బాలలే రేపటి పౌరులని పెద్దలు అంటుంటారు. వారిని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర ఉండాలనే ధృఢ సంకల్పంతో విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో కర్నాటి మధు కవిత దంపతులు 2007 సంవత్సరంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో 80 మంది విద్యార్థులతో ఆర్చిడ్ స్కూల్‌ను స్థాపించారు.

జవహర్ నగర్‌లో ఎక్కువగా పేద ప్రజలే నివసిస్తుంటారు. అలాంటి వారికి విద్య అందని ద్రాక్షల కాకుండా సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను ఆర్చిడ్ స్కూల్‌లో అందిస్తున్నారు. ప్రతి వ్యక్తి ఉన్నత స్థాయికి చేరేందుకు మూలం ప్రాథమిక విద్య, చిన్ననాటి నుంచి వారికి నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవం, కష్టపడేతత్వం ఆత్మగౌరవం, క్రమశిక్షణ లాంటివి నేర్పించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ విద్యార్థులు, వారి తలిదండ్రులు, యువత మనసులను



విద్యార్థులతో మాట్లాడుతున్న కరస్పాండెంట్ మధు

గెలుచుకున్నారు. విద్యారంగంలో విజయవంతంగా 16 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 950 మంది విద్యార్థులతో ఉరకలెత్తుతున్నారు. [printed: ఉగ్రాతలూగిస్తున్నారు]

పాఠశాల ప్రత్యేకతలు..

అభ్యాస పునాదిని ఏర్పరచడానికి కేజీ నుంచి 5వ తరగతి వరకు మొదటగా 2007 సంవత్సరంలో 80 మంది విద్యార్థులతో ఆర్చిడ్ స్కూల్ ప్రయాణాన్ని ప్రారంభించింది. తర్వాత క్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అప్డేట్ చేశారు. పదో తరగతి మొదటి బ్యాచ్ 2013-14 విద్యా సంవత్సరంలో దిగ్విజయంగా పూర్తి చేసుకొని 100శాతం ఉత్తీర్ణత సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ విజయ పరంపర కొనసాగుతూనే ఉంది. పాఠ్యపుస్తకాలలో అందించబడిన పాఠ్యాంశాలే కాకుండా సందర్భాన్ని బట్టి సామాజిక ఉదాహరణలను వివరిస్తూ వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. దేశవ్యాప్త పోటీ విద్యా విధానానికి అనుగుణంగా నూతన ఒరవడితో కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని సరికొత్త విధానంలో విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు ఆధునిక, ప్రపంచీకరణ పోటీ తత్వాన్ని తట్టుకొని నిలబడడానికి అనుగుణంగా 2020-21 విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, నీట్, జేఈఈ, లాంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణను అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఇస్తున్నారు. హ్యాండ్ రైటింగ్ స్కిల్స్, అబాకస్ 5 సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2022-23 విద్యా సంవత్సరం ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి గదులలో పూర్తిగా కంప్యూటరైజ్డ్ ఎల్ఈడీ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఆటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పిల్లలకు ఉన్నతస్థాయి జ్ఞానం, క్రమశిక్షణతో కూడిన విద్య లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్తున్నారు.




కే. అంజలి కుమారి, (10జీపీఏ) ఎన్. సువర్ణ(10జీపీఏ)

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు..

బాలికలదే పైచేయి

పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 35 మంది బాలురు, 27 మంది బాలికలు మొత్తం 62 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి జవహర్ నగర్‌లో ముందంజలో ఉన్నారు. 10 జీపీఏ అంజలి కుమారి, సువర్ణ సాధించగా, 9 జీపీఏ 20 మంది విద్యార్థులు సాధించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ కర్ణాటి మధు

విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీత

చదువుతోపాటు విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడానికి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన (సైన్స్ ఫెయిర్), నో బ్యాగ్ డే లాంటి వాటిని నిర్వహిస్తున్నారు. విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై అవగాహన కల్పించి వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. క్రీడలపై మక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి కరాటే, ఫుట్‌బాల్ క్రీడల్లో శిక్షణను ఇస్తున్నారు. సత్తార్ అనే పూర్వ విద్యార్థి కరాటేలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శనను కనబర్చాడు.



ఆర్చిడ్ స్కూల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ఫొటో..

విద్యను వ్యాపారంగా కాకుండా సేవా దృక్పథంతో చూస్తా ..



విద్యను వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పథంతో చూస్తా. పేద మధ్య తరగతికి చెందిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాలను స్థాపించాం. నేను మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడిని. నా చిన్నతనంలో నా చదువు కోసం మా తల్లిదండ్రులు పడ్డ కష్టాలు తెలుసు. అందుకే పేదలకు ఉత్తమ విద్యను అందించాలనే లక్ష్యంతో అతి తక్కువ ఫీజుతో పిల్లలకు విద్యను అందిస్తున్నాం. మా పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని రితిక ఎంబీబీఎస్‌లో సీట్ సాధించింది. అనేక మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చేస్తున్నారు. భవిష్యత్తులో సీబీఎస్ సిలబస్‌ను పాఠ్యాంశాలలో చేర్చుతాం. -ఆర్చిడ్ స్కూల్ కరస్పాండెంట్, కర్ణాటి మధు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాం : ప్రిన్సిపాల్ కర్ణాటి కవిత



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రాజీపడే ప్రసక్తే లేదని, వారి జీవితాల్లో వెలుగులు నింపి, బంగారు భవితకు పూల బాటలు వేసే విధంగా మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేసుకుంటూ ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రపంచ స్థాయిలో ఆంగ్ల మధ్యమానికి ఉన్న డిమాండ్‌ను బట్టి పూర్తిగా కంప్యూటరైజ్డ్, ఇంగ్లీష్ మీడియం విద్యను అందిస్తున్నాం. అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్యను అందిస్తున్నాం. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఇందుకు గత సంవత్సరం పదో తరగతి ఫలితాలు నిదర్శనం.భవిష్యత్‌లో ఇంతకంటే మంచి ఫలితాలు సాధిస్తాం.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో ఈసీఐ ఎల్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఉచిత బస్ పాస్, మెడికల్ కార్డు, ప్రతీ నెల పెన్షన్, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ రాష్ట్రకార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు వీరాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ ఎలిఫేంట్ సర్కిల్, కాప్రా సర్కిల్‌లో అరుంధతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ అవిష్కరణకు ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజల భవిష్యత్తు కోసం, సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమర యోధుడని పేర్కొన్నారు. సంఘ సంస్కర్తగా, రాజకీయవేత్తగా ఆనాటి సమాజంలో పేదల కోసం ఎన్నో కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న దళితుల కోసం నిరంతరం పోరాడిన సంస్కరణల యోధుడని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, సాయి జెన్ శేఖర్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, తదితరులున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.54 లక్షలు మంజూరు



నవతెలంగాణ-కాప్రా

నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్ వెళ్లేదారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్నికల ముందు రూ.54 లక్షలు మంజూరైనట్టు కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో ఆలస్యమైన రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం మొదలు పెట్టారు. ఇప్పటికే రాఘవేంద్ర నగర్ చుట్టుపక్కల సిమెంట్ రోడ్లు దాదాపుగా 90శాతం పూర్తి చేశారు. మిగిలిన వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్పొరేటర్ సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాయి జన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, శీను నాయక్, రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీప్రైడ్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాప్రా

కాప్రా పరిధిలోని శ్రీ లక్ష్మీప్రైడ్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాచమల్ల సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మామిడి జంగారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులిపలుపుల యుగేందర్ గౌడ్, సహాయ కార్యదర్శిగా ఇమ్మడి వీరేశం, కోశాధికారిగా పారుపల్లి నర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బిట్ల విజయ్ కుమార్, రాయకంటి ముత్యాలు, కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, పాశం వెంకట్ రెడ్డి, భీమిడి చెన్నారెడ్డిలు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా మంచే పరమేశ్వర్, లింగా రాంచందర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా చేగురి రాము, రంగా మదన్‌గౌడ్ వ్యవరించారు.

106వ వారానికి చేరిన జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో ప్రతీ ఆదివారం జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టే మహనీయుల జ్ఞానమాల కార్యక్రమం 106వ వారానికి చేరింది. ఈ సందర్భంగా జ్ఞానమాల టీం సభ్యులు మహాత్మ జ్యోతిరావు ఫూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, నాయక్, దయానంద్, నాగేష్, మెకానిక్ కొండల్, సమద్, సతీష్ చారి, ప్రకాష్, చారి, వెంకట్ చారి పాల్గొన్నారు.



బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన తాజా హోటల్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యమైన, రుచికరమైన వంటకాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అప్పుడే వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతుందని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. -నవతెలంగాణ, బోడుప్పల్

మౌలిక వసతులు కల్పించాలని కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్‌ను కలిసిన కాలనీవాసులు

నవతెలంగాణ-బోడుప్పల్

పదిహేను ఏండ్ల క్రితం ఏర్పాటైన కాలనీలో కనీస మౌలిక వసతులు కూడా లేవని ద్వారకా నగర్ ఫేజ్ 2 కాలనీ వాసులు వాపోయారు. ఈ మేరకు ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ పదిహేను ఏండ్ల క్రితం ఏర్పాటైన కాలనీలో కనీస మౌలిక వసతులు లేవని కాలనీలో డ్రయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయని వాపోయారు. గతంలో తమ కాలనీ వాసుల సొంత నిధులతో డ్రయినేజీ ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పటికీ లింకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని నగర కమిషనర్‌కు అనేక సార్లు వినతిపత్రాలు అందించినా సమస్యకు పరిష్కారం దొరకలేదన్నారు. ఇప్పటికైనా కార్పొరేటర్ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంతోష్ పటేల్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, కార్యదర్శి కృష్ణారెడ్డిలతో పాటు కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాణే ఇంజన్ వాల్స్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్టీయూ గెలుపు ఖాయం: జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్



నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పారిశ్రామిక వాడలో ఈనెల 20వ తేదీన జరిగే రాణే ఇంజన్ వాల్స్ కంపనీ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్టీయూ అభ్యర్థి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో రాణే ఇంజన్ వాల్స్ లిమిటెడ్ కంపెనీ యూనియన్ సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంబు ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న బీఆర్టీటియూ ఎప్పటికీ కార్మికుల వెంటనే ఉంటుందన్నారు. రాణి ఇంజన్ వాల్స్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్టీయూ అభ్యర్థిగా మర్రి రాజశేఖర్ రెడ్డిని చక్రం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలకే కాకుండా కార్మికులకు సైతం ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేసిన ఘనత రాజశేఖర్ రెడ్డిదని కొనియాడారు. ఇలాంటి నాయకుడే కార్మికుల పక్షాన ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాణి ఇంజన్ వాల్స్ కంపెనీ ప్రధాన కార్యదర్శి నరసింహచారి, సీనియర్ కార్మిక నాయకులు విఠల్, రమేష్ ,శ్రీనివాస్, వీఎస్ చారి,బి. యాదగిరి, కే గోపాల్, ఎన్.శ్రీనివాస్, ఆర్.సుధాకర్, చంద్రశేఖర్, వెంకట్ రావు, మోహన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, ఆనంద్ కుమార్, లింగేశ్వరరావు, జీవన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై సమగ్ర విచారణ జరపాలి

- ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్



నవతెలంగాణ-బోడుప్పల్

దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షా ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అన్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షలో దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారని తెలిపారు. వారి అనుమానాలకు కారణం ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకుగాను 720 మార్కులు రావడమే సాక్ష్యమని పేర్కొన్నారు. కావున తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలనీ, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పినా వారి మాటను పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

హెల్త్ క్యాంపులు ప్రజల ఆరోగ్య రక్షణకు దోహదపడతాయి

- మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు అన్నోజు కృష్ణాచారి



నవతెలంగాణ-బోడుప్పల్

ఉచితంగా హెల్త్ క్యాంపులు ప్రజల ఆరోగ్య సంరక్షణకు దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు అన్నోజు కృష్ణాచారి తెలిపారు. ఆదివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా కార్యాలయంలో సంఘంలోని లేబర్ కార్డు ఉన్న సభ్యుల కోసం సీఎస్‌సీ హెల్త్ కేర్ సహకారంతో అన్నోజు కృష్ణాచారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా టెస్టులు చేసి ఉచితంగా మందులు పంపిణీ, ట్రీట్‌మెంట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ క్యాంప్ రెండు రోజుల పాటు నిర్వహిస్తారని పేర్కొన్నారు. లేబర్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్కరూ హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ యాజమాన్యానికి కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సభ్యులు సుజాత, కిరణ్, సంఘం ఉపాధ్యక్షులు వడ్ల యాదయ్య, ముమ్మడి యాదగిరి చారి, అన్నోజు మదనా చారి, బాణాల శ్రీనివాస్ చారి, తౌడోజు సోమాచారి, దొంతోజు సత్యనారాయణ, ప్రసన్న పాల్గొన్నారు.

అలుపెరుగని అక్షర యోధుడు రామోజీరావు



- మేయర్ దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్

నవతెలంగాణ-జవహర్ నగర్

అలుపెరుగని అక్షర యోధుడు ఈనాడు మీడియా గ్రూప్ సంస్థల చైర్మెన్ రామోజీ రావు మృతి పట్ల జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రామోజీ రావు పాత్రికేయ రంగంలో చెరగని ముద్ర వేశారని, పత్రికా స్వేచ్ఛను, జర్నలిజం విలువలను కాపాడేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. పత్రికా రంగంలో రామోజీరావు ఒక నూతన ఒరవడి సృష్టించారని, ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఎందరో జర్నలిస్టులను తయారుచేసి తెలుగు సాహిత్య సమాచారాభివృద్ధికి నిత్యం కృషి చేశారని అన్నారు. తెలుగు భాషకు, తెలుగు మీడియ రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమస్ఫూర్తితో పని చేశారని, నైతిక విలువలు పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు, దొంతగాని కోటేష్ గౌడ్, బల్లి శ్రీనివాస్, రావల్ కోల్ నరసింహ గౌడ్, శిల్పి, శ్రీనాథ్, బాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో..

హైద్రాబాద్‌లో ఫిల్మ్ సిటీ స్థాపించి గిన్నీస్ రికార్డు కెక్కిన మహా పురుషుడు, మార్గదర్శి స్థాపించి మధ్యతరగతి కుటుంబంలో ఆనందాలు నింపిన చెరుకూరి రామోజీ రావుకు ఉప్పల్ నియోజకవర్గంలో డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ ఈసీఐఎల్ చౌరస్తాలో తెలంగాణ తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీజీకే. మూర్తి అధ్యక్షతన రామోజీ రావు చిత్ర పటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ తెలుగు దేశం రాష్ట్ర కార్యదర్శి నీరు కొండ సతీష్ బాబు, బీఆర్ఎస్ యువజన నాయకుడు రేగళ్ళసతీష్ రెడ్డి, సామాజిక కార్యకర్త తాడూరి గగన్ కుమార్, వాసిరెడ్డి శివ ప్రసాద్, బుజ్జీ,ఎస్ వి రావు, మొవ్వ శ్రీనివాస్, వడ్లమూడి శ్రీనివాస్, బొప్పాన రామ్మోహన్,భోళ్ళ వెంకటేష్, గోబరు రమేష్, తది తరులు పాల్గొన్నారు.



వానాకాలంలో...

వాతావరణం మారుతోంది. వర్షాలు ప్రారంభమయ్యాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జ్వరం, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, తదితర సమస్యలు పిల్లలను ఈ కాలంలో వేధిస్తాయి. ఈ వర్షాకాలంలో పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

- కాచి చల్లార్చిన నీరు తాగేలా చూడాలి.
- మలేరియా, డెంగ్యూ ఇతర వ్యాధుల వ్యాప్తిని నివారించేలా పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.
- ఫంగల్ ఇన్ఫెక్షన్లు రాకుండా తడి బట్టలు, బూట్లు తప్పనిసరిగా ఆరుబయట ఆరబెట్టాలి.
- భోజనానికి ముందు చేతులు బాగా కడుక్కునేలా చూడాలి.
- స్కిప్పింగ్, హెూపింగ్, టేబుల్ టెన్నిస్ మొదలైన ఇండోర్ ఫిజికల్ యాక్టివిటీస్ వంటి శారీరక శ్రమ కలిగించే క్రీడలను ప్రోత్సహించాలి.
- వర్షాలు పడుతున్న సమయంలో తప్పనిసరిగా బయటికి వెళ్తున్నప్పుడు రెయిన్‌కోట్‌లు, గొడుగులు, గమ్ బూట్లు ఉపయోగించాలి.
- ఆహారంలో తులసి, దాల్చిన చెక్క, నిమ్మ, అల్లం, ఇతర మసాలా దినుసులు చేర్చాలి.
- దోమలు కుట్టకుండా దోమతెర ఉపయోగించాలి.
- బయటి నుండి వచ్చిన పిల్లల కాళ్లను గోరువెచ్చని నీళ్లతో కడగాలి.
- అలెర్జీలు రాకుండా ఇంటి వాతావరణంలో తేమ లేకుండా చూడాలి. ముఖ్యంగా గోడలు, తివాచీలు, కర్టెన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి. ■

నా సంఘీభావం ప్రకటించానంతే..

కని కస్రుతి... తన రాజకీయ ఆలోచనలకు, మతసామరస్యానికి భిన్నంగా వుందని కేరళ స్టోరీలో నటించేందుకు తిరస్కరించారు. ఇటీవలే 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ ప్రిక్స్ అవార్డును గెలుచుకున్న 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' ప్రధాన పాత్ర పోషించారు. ఆ ఫిల్మ్ ఫెస్టివల్లో పుచ్చకాయ బ్యాగ్ ధరించి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేసినందుకు అనేక విమర్శలకు గురయ్యారు. అయినా నిక్కార్సైన నటిగా సమాజంలో జరిగే ప్రతి అన్యాయంపై తనదైన శైలిలో గొంతెత్తుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...



ఇటీవల ముగిసిన కేన్స్ వారి 77వ ఎడిషన్‌లో చిత్రనిర్మాత పాయల్ కపాడియా 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్' గ్రాండ్ ప్రిక్స్‌ను గెలుచుకున్న విషయం అందరికీ తెలిసిందే. ఎందుకంటే 30 ఏండ్ల తర్వాత కేన్స్ పోటీలో గెలుపొందిన మొదటి భారతీయ చిత్రం ఇది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడిన ఈ చిత్రం ప్రేక్షకుల నుండి ఎనిమిది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్‌ను అందుకుంది. 'ఇదంతా నమ్మలేకపోతున్నాను. ఇంత లాంగ్ స్టాండింగ్ ఒవేషన్ వస్తుందని ఊహించలేదు. ప్రీమియర్ చూసిన తర్వాత ఇతర దేశాల నుండి ఎంతో అనుభవం ఉన్న నటులు నా వద్దకు వచ్చి నా నటనలోని సూక్ష్మ నైపుణ్యాల గురించి నాతో పంచుకున్నారు. వారితో జరిగిన ఈ చర్చలు చాలా విలువైనవిగా భావించాను' అంటూ కని పంచుకున్నారు.


థియేటర్ విద్య పూర్తి చేసి

కని కేరళలోని తిరువనంతపురంలోని చెరువక్కల్ గ్రామంలో పుట్టారు. తల్లి జయశ్రీ ఎకె, తండ్రి మైత్రేయ మైత్రేయన్. వీరిద్దరూ అభ్యుదయ భావాలు కలిగిన సామాజిక కార్యకర్తలు. అందుకే తమ బిడ్డకు ఇంటి పేరు కానీ, వెనక తల్లిదండ్రుల పేర్లు తోకలుగా వచ్చే సాంప్రదాయాన్ని బద్దలు కొట్టి కేవలం కని అని పేరు పెట్టుకున్నారు. ఆమె 15 ఏండ్ల వయసులో పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో తప్పని పరిస్థితుల్లో ఆమె పేరు వెనుక కుస్రుతి (మలయాళంలో కొంటె అని అర్థం) అని చేర్చాల్సి వచ్చింది. తిరువనంతపురంలో అభినయ థియేటర్ రీసెర్చ్ సెంటర్ చెందిన థియేటర్ ప్రాక్టీషనర్లకు ఒక సాధారణ వేదిక ఉండేది. ఆమెకు వారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో 2005 నుండి 2007 వరకు త్రిసూర్ స్కూల్ ఆఫ్ డ్రామాలో థియేటర్ ఆర్ట్స్ ప్రోగ్రామ్‌లో చేరారు. తన థియేటర్ విద్యను ఎల్‌కోల్ ఇంటర్నేషనల్ డి థియేట్రే జాక్వెస్ లెకాక్‌లో పూర్తి చేశారు. తర్వాత రెండేండ్ల పాటు ఫిజికల్ థియేటర్‌ను పూర్తి చేశారు. తర్వాత నటిగా, మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు.

పుచ్చకాయ బ్యాగుతో...

కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్‌లో కని ఓ బ్యాగ్ పట్టుకున్నారు. అదే పుచ్చకాయ బ్యాగ్. పుచ్చాకాయను పోలి ఉన్న బ్యాగ్‌తో ఆమె రెడ్ కార్పెట్‌పై నడిచారు. పుచ్చకాయ ముక్క పాలస్తీనా ప్రతిఘటనకు చిహ్నం. ఆ దేశానికి సంఘీభావంగా ఆమె ఆ బ్యాగ్ పట్టుకున్నారు. అయితే దానిపై సోషల్ మీడియాలో కాంట్రవర్సీ నడిచింది. ఆమె పాలస్తీనాపై కపట ప్రేమ చూపిస్తున్నారు అంటూ విమర్శలు వచ్చాయి. దానిపై స్పందిస్తూ 'అక్కడ చాలామంది చాలా వాటికి సపోర్ట్ చేశారు. బ్యాడ్జెస్ వేసుకున్నారు. రకరకాల వస్తువులతో తమ సంఘీభావాన్ని తెలిపారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను. చాలామంది వర్క్ ప్లేసుల్లో మహిళలపై జరుగుతున్న దారుణాల గురించి, కేన్స్‌లో వర్కర్లకు ఇస్తున్న తక్కువ జీతాల గురించి ఇంకా చాలా విషయాలపై గొంతెత్తారు. నేను పాలస్తీనాకి సంఘీభావం తెలపాలి అనుకున్నాను అంతే. ఒక వ్యక్తిగా నేను కొన్నిసార్లు అనేక ఆలోచనలను పంచుకుంటాను. కొన్ని సమస్యలపై ఎలా నిలబడాలో నిర్ణయించుకుంటాను. విపరీతమైన సంఘటనలు ఏకకాలంలో జరుగుతున్న ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. నేటి పరిస్థితులు ఎవరికీ అనుకూలంగా లేవు. వీటిని మనం లైట్‌గా తీసుకుంటే కుదరదు. అందుకే నా సంఘీభావం ప్రకటించాను' అంటూ పంచుకున్నారు.





నాలాంటివారెందరో...

తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ 'నేను ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్నప్పుడే ప్రశాంతంగా ఉండగలను. జీవనోపాధి కోసమే సినిమాల్లో నటించాల్సి వచ్చింది. 2020లో నేను నటించిన మలయాళ చిత్రం 'బిరియాని'కి కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డు, మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ నటి అవార్డును గెలుచుకున్నాను. కానీ అంతకు ముందు నా జీవితమంతా కన్నీళ్లతో పోరాటమే. నా దగ్గర డబ్బు లేని సమయంలో సజిన్(సజిన్ బాబు) నన్ను సంప్రదించారు. స్క్రిప్ట్ చదివిన తర్వాత ఈ క్యారెక్టర్ చేయలేనని చెప్పా. ఎందుకంటే అది ముస్లింల హక్కుల గురించి మాట్లాడే సినిమా. అయితే నన్ను కలిసిన సజిన్ ఓ ముస్లిం. ఇవన్నీ వాస్తవ జీవితాలని నాకు చెప్పారు. అయినా నేను ఒప్పుకోలేదు. అయితే మూడు నెలల తర్వాత చిత్ర నిర్మాత మళ్లీ నన్ను సంప్రదించారు. ఆ సినిమాలో నటిస్తే 70 వేలు ఇస్తామన్నారు. అప్పుడు నా అకౌంట్‌లో మూడు వేలు మాత్రమే ఉన్నాయి. దాంతో సినిమా చేసేందుకు ఒప్పుకున్నాను. ఇలా నాలాంటి నటులు సినీ పరిశ్రమలో ఎంతో మంది ఉన్నారు. ఒకవేళ థియేటర్ ఆర్టిస్టుగా నాకు సంపాదన బాగుండి వుంటే సినిమాల్లోకి వచ్చి ఉండేదాన్ని కాదేమో' అంటూ ఆమె పంచుకున్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా తీసిన కేరళ స్టోరీ చిత్రంలో అవకాశం వస్తే ఆమె దాన్ని సీరియస్‌గా తిరస్కరించారు. తన రాజకీయ ఆలోచనలకు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉందన్నారు. ఆమె అన్నట్టుగానా ఆ చిత్రం తర్వాత కాలంలో అనేక ప్రాంతాల్లో నిషేధానికి గురయ్యింది. ■



మదర్ థెరిసా పాత్రతో...

థియేటర్ ప్రొడక్షన్స్ భగవదజ్జుకం, లాస్ ఇండాస్, హెర్మాన్ హెస్సే, సిద్ధార్థ వారి రంగస్థల వేదికలపై నటించారు. ఆమె బర్నింగ్ ఫ్లవర్స్ - 7 డ్రీమ్స్ ఆఫ్ ఎ ఉమెన్ అనే ఇండో-పోలిష్ ప్రొడక్షన్‌లో పరిశోధించి, అభివృద్ధి చేసి నటించారు. ఆంథాలజీ చిత్రం కేరళ కేఫ్‌లో కనిపించిన తర్వాత కనికి నటిగా గుర్తింపు వచ్చింది. తర్వాత శిక్కర్, కాక్‌టెయిల్ వంటి సినిమాల్లో ముఖ్యమైన పాత్రలను పోషించారు. ఈశ్వరన్ సాక్షియై అనే మలయాళ ధారావాహికలో మదర్ థెరిసా పాత్రతో ప్రజాదరణ పొందారు.

కిందకు దిగేందుకు సిద్ధపడం

థియేటర్ నేపథ్యం నుండి రావడంతో సరైన ఎంపికలు చేయడంలో ఆమెకు బాగా సహాయపడింది. 'ఇది నాకు స్థిరంగా ఉండటంలో, సవాళ్లను ఎదుర్కోవడం, ఎలాంటి పరిస్థితులనైన తట్టుకొని నిలబడంలో సహాయపడింది. థియేటర్ నటులుగా మేము ఎట్టి పరిస్థితుల్లోనూ కిందకు దిగేందుకు సిద్ధపడం' అన్నారు. మలయాళ సినిమాకి పునరాగమనం గురించి అడిగితే ఆమె నవ్వుతూ పరిశ్రమలో పాత్రల కోసం ఆడిషన్‌కు మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఆమె రాబోయే ప్రాజెక్ట్‌లలో రెండు మలయాళ వెబ్ సిరీస్‌లు, ఒక మలయాళ చిత్రం, ఒక హిందీ చిత్రంతో పాటు రెండు వెబ్ సిరీస్ ఉన్నాయి. అలాగే ఒక తమిళ చిత్రం కూడా ఉంది.





బడి ఊడ్చేదెవరు..?

(మొదటిపేజీ తరువాయి)


చెప్పినట్టుగా.. అన్ని స్కూళ్లకు స్కావెంజర్లను నియమించడం ద్వారా స్వచ్ఛ వాతావరణంలో ప్రభుత్వ స్కూళ్లను నడిపించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

హైదరాబాద్ పరిధిలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో లక్షకుపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే ప్రభుత్వ పాఠాశాలల్లో పారిశుధ్య పనుల కోసం గతంలో స్కావెంజర్లు ఉండేవారు. 40మందిలోపు విద్యార్థులు ఉంటే ఒకరిని రూ.2వేలు, అంతకంటే ఎక్కువ విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులకు రూ.2500 చొప్పున వేతనం చెల్లించేవారు. ఈ వేతనంతోనే సదరు కార్మికులు నిత్యం పాఠశాలల ప్రాంగణాలు, గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. అంతేగాక హైస్కూళ్లలో వందలాది మంది విద్యార్థులకు వీరి సేవలు ఎంతో కీలకం. కానీ రెండేండ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దుచేసింది. దాంతో సిటీలో సుమారు 800కుపైనే.. రాష్ట్రంలో 20వేలకుపైనే కార్మికులు ఉపాధి కోల్పోయారు. పాఠశాలల్లో పరిశుభ్రతను ప్రభుత్వం.. హెచ్ఎంలు, ఉపాధ్యాయ్యులపై నెట్టేసింది. వారి నుంచి వ్యతిరేకత పెరగడంతో ఆ తర్వాత జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. ఇదివారికి అదనపు భారమే కాదు.. ఈ పనులకు అదనపు చెల్లింపులు కూడా లేవు. అయినప్పటికీ జీహెచ్ఎంసీ కార్మికులు పాఠశాలల్లో ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నారు. కానీ మరుగుదొడ్ల పరిశుభ్రత చేయడం లేదు. దాంతో బడుల్లో స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. టాయిలెట్ల పరిస్థితి అధ్వానంగా తయారు కావడంతో విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో పనిచేసిన వారిని తిరిగి పిలిచి కొంత డబ్బులు చెల్లించి పనులు చేయించుకునే పరిస్థితి నెలకొంది.

రెండు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం..!

ఎల్లుండి నుంచి స్కూళ్ల ప్రారంభమైతే పరిశుభ్రత ఎలా అనేది ఇప్పుడు ప్రశ్నార్థంగా మారింది. పట్టణ ప్రగతిలో భాగంగా పారిశుధ్యం, హరితహారం, తదితర పనుల్లో జీహెచ్ఎంసీ కార్మికులు తీరిక లేకుండా ఉన్నా.. వీరికి బడుల బాధ్యత అప్పగించడంతో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో అమలుకాక అపరిశుభ్రంగా మారుతున్నాయి. సిబ్బంది కొరత, అదనపు పని భారం వల్ల వారు పాఠశాలలకు వచ్చినా కేవలం బడి ఆవరణ మాత్రమే క్లీన్ చేస్తున్నారు. దీంతో అటు స్వచ్ఛ కార్మికులు లేక.. ఇటు జీహెచ్ఎంసీ కార్మికులు చేయక.. టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వాటినే విద్యార్థులు ఉపయోగించే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. ఈ నేపథ్యంలో స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బడుల ప్రారంభంలోపే.. స్కావెంజర్లను నియమించాలి :
ఏ.శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి, టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో టాయిలెట్స్ క్లీనింగ్, ఇతర పనుల బాధ్యతలను రెండేండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జీహెచ్ంఎసీ, మున్సిపాలిటీలు, పంచాయతీలకు అప్పగించింది. స్కూళ్లలో క్లీనింగ్ పనులు సరిగ్గా జరగడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు జూన్ 12న స్కూల్స్ ప్రారంభం రోజునే అన్ని పాఠశాలలకు స్కావెంజర్లను నియమించాలి.

పార్లమెంట్‌లో రైతుల గొంతుక

- ఎంపీ అమ్రారామ్‌కు ఏఐకేఎస్ అభినందన
- బీజేపీ అడ్డాలో సీపీఐ(ఎం) గెలుపుపై హర్షం
- హాజరైన సీతారాం ఏచూరి, బృందా కరత్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎంపీగా ఎన్నికైన ఎఐకెఎస్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు అమ్రారామ్ కు ఏఐకేఎస్ ఘనంగా సత్కరించింది. ఇండియా ఫోరం తరపున ఆయన రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా విజయం సాధించారు. ఆదివారం నాడిక్కడ ఏఐకేఎస్ కార్యాలయంలో అమ్రారామ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పుష్పగుచ్ఛం అందించి సత్కరించి అభినందించారు.



అనంతరం సీతారాం ఏచూరి మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రైతుల కోసం పోరాడుతున్నారని, అమ్రారామ్ ఇప్పుడు లోక్‌సభలో రైతులు, కూలీల కోసం పోరాడుతారని అన్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ మాట్లాడుతూ అమ్రారామ్ రైతుల మనిషి అని, రైతు పోరాటాలతో పెనవేసుకొని ఉన్నారని అన్నారు. ఏఐకేఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి, ఎస్కేఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ హన్నన్ మొల్లా మాట్లాడుతూ రైతు ఉద్యమానికి ప్రతీకగా అమ్రారామ్ నిలిచారని, ఇప్పుడు పార్లమెంట్‌లో రైతుల గొంతుక ప్రతిధ్వనిస్తుందన్నారు. ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలే మాట్లాడుతూ రైతుల కోసం పోరాటం చేయడం అమ్రారామ్ నుంచి నేర్చుకున్నానని అన్నారు. ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల వేళ ఎక్కడ చూసినా ఒక్కటే గొంతు వినిపించేదని, మా ఎంపీ అమ్రారామ్ అని, ఆయనే సరైనోడని తెలిపారు. ఏఐకేఎస్ ఆర్థిక కార్యదర్శి పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అమ్రారామ్ పార్లమెంట్‌లో అడుగుపెట్టడంతో రైతు ఉద్యమానికి మరింత ఊపు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్, తపన్ సేన్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జేఎన్‌యూఎస్‌యూ మాజీ అధ్యక్షురాలు ఐషీఘోష్, ఢిల్లీ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ (డీయూటీఏ) మాజీ అధ్యక్షుడు రాజీవ్ కన్వర్, డీఎస్ఎంఎం నేత నత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజులు... వరుస సమీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన మధిరలో సమీక్ష సమావేశం కూడా నిర్వహించారు. ఈనెల 12, 13 తేదీల్లో ఖమ్మం జిల్లాలో సమీక్షా సమావేశాలు జరపాలని నిర్ణయించారు. దీనికి కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరవుతారని ఆయన కార్యాలయం ఆదివారం తెలిపింది. ఎలక్షన్ కోడ్ ముగియడంతో రేవంత్ సర్కార్ పాలనపై దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్ర స్థాయిలో అన్ని శాఖల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయి సమీక్షలు చేయనున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఏండ్ల తరబడి ఒకే పోస్ట్‌లో పాతుకుపోయిన అధికారుల బదిలీల ప్రక్రియను తొలి దశలో చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ మేరకు వచ్చే వారంలో అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ భారీగా బదిలీలు జరుగుతాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అధికారుల పనితీరుపై ప్రతి నెలా నివేదికలు, సమీక్షలు చేయాలని కూడా సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈనెల 9న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ కార్యాచరణ ప్రారంభమైంది. ఈనెలాఖరు నాటికి ఈ ప్రక్రియ ముగియనుంది. మరోవైపు ఆరు గ్యారెంటీల అమలుపై ప్రధానంగా దృష్టి పెట్టి, దానికి అవసరమైన ఆర్థికాభివృద్ధిని రాబట్టుకోవాలని భావిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లుల మంజూరును అమల్లోకి తెచ్చారు. స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం- అభివృద్ధి జోడెడ్ల బండి తరహాలో పాలనను ముందుకు తీసుకెళ్లాలని సీఎం, డిప్యూటీ సీఎం భావిస్తున్నారని ఆయా కార్యాలయాలు తెలిపాయి.

12 ,13న ఖమ్మంలో సమీక్ష

నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ఖమ్మం జిల్లాలో ఇందిరా, రాజు సాగర్ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేశారనీ, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈనెల 12న సీతారామ సాగునీటి ప్రాజెక్టు, వైరా రిజర్వాయర్‌కు సాగర్ కాల్వ అనుసంధానం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు సాగునీటి సరఫరా అంశాలను సమీక్షించనున్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీటిని మళ్లించేందుకు ఎన్నికల కోడ్‌కు ముందే రూ.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు డిప్యూటీ సీఎం కార్యాలయం తెలిపింది. 13న జరిగే సమీక్షలో సాగునీటి ప్రాజెక్టు పనులు, వాటి ప్రగతిని తెలుసుకుంటారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ఆయా ప్రాజెక్టుల వద్దకు క్షేత్రస్థాయి పర్యటన చేపడతారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏనుకూరు నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం వంటి పనులను వారు పరిశీలిస్తారు. అలాగే మన ఊరు- మనబడి, వివిధ సంక్షేమ పథకాల అమలును సైతం పరిశీలిస్తారు.

ఇక సెలవ్...

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకున్న స్మృతి కట్టడం వద్దే కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. రామోజీరావు చితికి ఆయన కుమారుడు, ఈనాడు ఎండీ సీహెచ్ కిరణ్ నిప్పంటించారు. సినీ, రాజకీయ ప్రముఖులు, బంధువులు, సన్నిహితులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి.

ఫిల్మ్‌సిటీలోని నివాసం నుంచి ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పోలీస్ బ్యాండ్ నడుమ రామోజీ అంతిమయాత్ర ప్రారంభమయింది. అక్కడ నుంచి రామోజీ గ్రూప్ సంస్థల కార్యాలయాల మీదుగా స్మారకకట్టడానికి చేరుకుంది. అభిమానుల నినాదాలతో ఫిల్మ్‌సిటీ మార్మోగింది. అంతిమయాత్ర స్మృతి కట్టడం వద్దకు చేరుకున్న తర్వాత ఆయన భౌతికకాయాన్ని కుటుంట సభ్యులు వాహనం నుంచి కిందకు దింపారు. కుటుంబ సంప్రదాయ క్రతువులు నిర్వహించిన అనంతరం చంద్రబాబు నాయుడు, లోకేశ్, తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, పలువురు సినీ ప్రముఖులు రామోజీకి కడసారిగా నివాళులర్పించారు. చంద్రబాబు నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంత్యక్రియల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ప్రముఖ వైద్యులు గురవారెడ్డి, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు పోచారం శ్రీనివాసరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు సినీ, రాజకీయప్రముఖులనేకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో రికార్డు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. అందుకే ఈదురు గాలులు, అకాల వర్షాలకు కూడా రైతులు నష్టపోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు వెనుకాడలేదు. ధాన్యం సేకరణలో జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్ధిపేట, సిరిసిల్ల, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిర్మల్, మంచిర్యాల, జనగామ జిల్లాలు ముందంజలో ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం అందడంతో నారాయణ్‌పూర్, కొండగావ్, దంతేవాడ, బస్తర్ జిల్లాల సరిహద్దుల్లో ఈ నెల 6 అర్ధరాత్రి సమయంలో భద్రతా సిబ్బంది ప్రత్యేక బృందాలతో ఈ ఆపరేషన్ చేసినట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌లాల్ తెలిపారు. ఇరు వర్గాల మధ్య అడపాదడపా జరిగిన క్రాస్ ఫైరింగ్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. ఈ ప్రాంతంలో రక్తపు మరకలు ఉన్నాయని, మరో మావోయిస్టు గాయపడ్డాడో, మరణించాడో తెలియాల్సి ఉందన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి చెందిన ఈ ఆరుగురిలో నలుగురిపై రూ.8 లక్షలు, ఒకరిపై రూ.5 లక్షలు, మరొకరిపై రూ.లక్ష రివార్డులు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆ ప్రాంతాల్లో 71 ఎన్‌కౌంటర్లలో 123 మంది మావోయిస్టులు చనిపోయారు. 136 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 339 మంది లొంగిపోయారు.

నిర్మాణంలో ఉన్న భవనాలు త్వరలో ప్రారంభం

- అమరావతిలో 25 భవనాలను పరిశీలించిన ఏపీ సీఎస్

అమరావతి: రాజధాని పరిధిలో నిర్మాణంలో ఉన్న 25 భవనాలను త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి పరిధిలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాలుగో తరగతి ఉద్యోగులు, ఎన్‌జిఒల భవనాలను పరిశీలించారు. అలాగే రాయపూడి పరిధిలో ఉన్న సిఆర్‌డిఎ భవనంలో మొదలుపెట్టిన పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి ఉద్దండ్రాయునిపాలెంలో గతంలో ప్రధాని శంకుస్థాపన చేసిన స్థలాన్ని, సీడ్ యాక్సెస్ రోడ్డులో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. వెంకటపాలెంలో నిర్మాణంలో ఉన్న పేదల ఇండ్లను చూశారు.

స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో విన్నర్ టీమ్ ఇండియా. 120 పరుగుల ఛేదనలో పాకిస్థాన్ చతికిల పడింది. భారత బౌలర్లు సమిష్టి ప్రదర్శనతో పాక్ బ్యాటర్ల ఆట కట్టించారు. మహ్మద్ రిజ్వాన్ (31) పోరాడినా టీమ్ ఇండియా 6 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. రిషబ్ పంత్ (42) రాణించటంతో తొలుత భారత్ 119 పరుగులు చేసింది.



119 నిలుపుకున్నారు!

- పాక్‌పై భారత్ ఘన విజయం
- రాణించిన రిషబ్ పంత్, బుమ్రా
- భారత్ 119/10, పాకిస్థాన్ 113/7

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024

నవతెలంగాణ-న్యూయార్క్

ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా జోరు కొనసాగుతుంది. గ్రూప్-ఏలో వరుసగా రెండో విజయం సాధించిన రోహిత్‌సేన అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారం న్యూయార్క్ నాసా కౌంటీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పొరుగు దేశం పాకిస్థాన్‌పై భారత్ 6 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా (3/14), హార్దిక్ పాండ్య (2/24) రాణించటంతో పాకిస్థాన్ ఛేదనలో చతికిల పడింది. ఓపెనర్ మహ్మద్ రిజ్వాన్ (31, 44 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) పోరాటం చేశాడు. అంతకుముందు, రిషబ్ పంత్ (42, 31 బంతుల్లో 6 ఫోర్లు) సహా అక్షర్ పటేల్ (20, 18 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో 119 పరుగులు చేసింది. పాక్ పేసర్లు నసీం షా (3/21), రవూఫ్ (3/21) మెరవటంతో భారత్ 19 ఓవర్లలోనే ఆలౌటైంది. గ్రూప్-ఏలో వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడిన పాకిస్థాన్.. టోర్నీలో సూపర్8 దశకు చేరుకునే అవకాశాలను దాదాపుగా ఆవిరి చేసుకుంది!.

రిజ్వాన్ పోరాడినా..: 120 పరుగుల ఛేదనలో పాక్ దూకుడుగా సాగింది. బాబర్ ఆజామ్ (13), ఉస్మాన్ ఖాన్ (13)లు మహ్మద్ రిజ్వాన్ (31)తో కలిసి మంచి ఆరంభాలు అందించారు. ఫకర్ జమాన్ (13) సైతం నిష్క్రమించినా.. ఓ ఎండ్‌లో రిజ్వాన్ ఒంటరి పోరాటం చేశాడు. రిజ్వాన్ క్రీజులో ఉండగా పాక్ గెలుపు దిశగా సాగింది. రెండో స్పెల్‌లో బంతి అందుకున్న బుమ్రా.. తొలి బంతికే రిజ్వాన్ కథ ముగించి భారత్‌ను రేసులోకి తెచ్చాడు. షాదాబ్ ఖాన్ (5), ఇమద్ వసీం (15), ఇఫ్తికార్ అహ్మద్ (5) తేలిపోయారు. ఆఖరు ఓవర్లో నసీం షా (10 నాటౌట్) ఊరట పరుగులు సాధించాడు. 20 ఓవర్లలో 7 వికెట్లకు 113 పరుగులే చేసిన పాక్ 6 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.



పంత్ ఒక్కడే..!: టాస్ నెగ్గిన పాకిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సీనియర్ బ్యాటర్లు మరోసారి ఆశించిన ఆరంభం అందించలేదు. విరాట్ కోహ్లి (4), రోహిత్ శర్మ (13) మూడు ఓవర్లలోపే నిష్క్రమించారు. ఓ ఫోర్‌తో మెరిసిన కోహ్లి కవర్స్‌లో క్యాచ్ ఇవ్వగా.. ఓ సిక్సర్, ఫోర్ బాదిన రోహిత్ ఎక్కువసేపు వికెట్ కాపాడుకోలేదు. రిషబ్ పంత్ (42)తో జతకలిసిన అక్షర్ పటేల్ (20) మూడో వికెట్‌కు 39 పరుగుల విలువైన భాగస్వామ్యం నమోదు చేశాడు. ఎదురుదాడికి ప్రయత్నించిన ఈ జోడీ.. పాక్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. పంత్ స్పిన్‌పై తడబడినా విలక్షణ షాట్లతో బౌండరీలు బాదాడు. అక్షర్ పటేల్ తర్వాత సూర్యకుమార్ యాదవ్ (7) పంత్‌కు చక్కటి సహకారం అందించాడు. 11.2 ఓవర్లలో 89/3తో మంచి స్కోరు దిశగా సాగిన భారత ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. నిలకడగా పరుగుల వేట సాగించిన పంత్ నిష్క్రమణతో పాక్ పట్టు బిగించింది. సూర్య (7), దూబె (3), హార్దిక్ పాండ్య (7), రవీంద్ర జడేజా (0) నిరాశపరిచారు. లోయర్ మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో 19 ఓవర్లలో భారత్ 119 పరుగులకు కుప్పకూలింది. సిరాజ్ (7 నాటౌట్) అజేయంగా నిలిచాడు. పాకిస్థాన్ బౌలర్లలో నసీం షా (3/21), హరీశ్ రవూఫ్ (3/21), మహ్మద్ ఆమీర్ (2/23) వికెట్ల వేటలో రాణించారు.

2022 యుఎస్ ఓపెన్, 2023 వింబుల్డన్.. 2024 ఫ్రెంచ్ ఓపెన్. ఇదీ స్పెయిన్ యంగ్ బుల్ కార్లోస్ అల్కరాజ్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేట. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై ఐదు సెట్ల మారథాన్ మ్యాచ్‌లో గెలుపొందిన అల్కరాజ్ ఫ్రెంచ్ కింగ్ అవతరించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కరాజ్‌కు ఇది తొలి టైటిల్ కాగా.. కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ విజయం.



ఫ్రెంచ్ కింగ్ అల్కరాజ్

ఫైనల్లో జ్వెరెవ్‌పై గెలుపు
ఫ్రెంచ్ ఓపెన్ 2024

పారిస్ (ఫ్రాన్స్): స్పెయిన్ యంగ్ బుల్, వరల్డ్ నం.3 కార్లోస్ అల్కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించాడు. ఐదు సెట్ల పాటు ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో జర్మనీ స్టార్, వరల్డ్ నం.4 అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై మెరుపు విజయం సాధించాడు. నాలుగున్నర గంటల పోరులో 6-3, 2-6, 5-7, 6-3, 6-2తో కార్లోస్ అల్కరాజ్ గెలుపొందాడు. నాల్గో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)కి ఉత్కంఠ టైటిల్ పోరులో పరాజయం తప్పలేదు.

మెన్స్ సింగిల్స్ ఫైనల్లో అల్కరాజ్ తొలి సెట్‌ను 6-3తో గెల్చుకుని ముందంజ వేశాడు. కానీ వరుసగా రెండు సెట్లను 6-2, 7-5తో సొంతం చేసుకున్న జ్వెరెవ్ టైటిల్ దిశగా దూసుకెళ్లాడు. మూడు సెట్ల అనంతరం 2-1తో నిలిచిన జ్వెరెవ్ టైటిల్‌కు ఒక్క సెట్ దూరంలో నిలిచాడు. ఈ సమయంలో అల్కరాజ్ అద్భుతంగా ఆడాడు. ఒత్తిడిలో గొప్పగా పుంజుకున్నాడు. 6-1, 6-2తో చివరి రెండు సెట్లను సొంతం చేసుకుని ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడాడు. అల్కరాజ్ 3 ఏస్‌లు కొట్టగా, జ్వెరెవ్ 8 ఏస్‌లు కొట్టాడు. అల్కరాజ్ 9 బ్రేక్ పాయింట్లతో సత్తా చాటగా.. జ్వెరెవ్ ఆరు బ్రేక్ పాయింట్లు సాధించాడు. పాయింట్ల పరంగా 93-73తో అల్కరాజ్ పైచేయి సాధించాడు. అల్కరాజ్ గేమ్ పాయింట్లలోనూ 25-19తో పైచేయి సాధించాడు. అల్కరాజ్ 52 విన్నర్లతో మెరువగా.. జ్వెరెవ్ 38 విన్నర్లతో సరిపెట్టుకున్నాడు. జ్వెరెవ్ 60 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ఇక మహిళల డబుల్స్‌లో కోకో గాఫ్ తొలి టైటిల్ సాధించింది. చెక్ భామ కేథరిన్‌తో కలిసి 7-6(7-5), 6-3తో ఇటలీ పావొలిని, ఎర్రానిలపై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో లారా, రోజర్ జోడీ టైటిల్ సొంతం చేసుకుంది. మెన్స్ డబుల్స్‌లో పావిక్, మార్సెలో విజేతలుగా నిలిచారు.

ఎదురులేని ఆసీస్

ఇంగ్లాండ్‌పై 36 పరుగులతో గెలుపు

ఆస్ట్రేలియా 201/7, ఇంగ్లాండ్ 165/6

నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్



డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ చతికిల పడింది. 202 పరుగుల ఛేదనలో మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో పరాజయం మూటగట్టుకుంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం, ఆసీస్ చేతిలో ఓటమితో డిఫెండింగ్ చాంపియన్ గ్రూప్ దశ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది. ఫిల్ సాల్ట్ (37, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (42, 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఛేదనలో అదిరే ఆరంభం అందించారు. తొలి వికెట్‌కు 7.1 ఓవర్లలోనే 73 పరుగులు జోడించారు. కానీ ఓపెనర్లు ఇద్దరూ జంపా మాయలో పడటంతో ఇంగ్లాండ్‌కు కష్టాలు మొదలయ్యాయి. విల్ జాక్స్ (10), జానీ బెయిర్‌స్టో (7) విఫలమయ్యారు. మోయిన్ అలీ (25), హ్యారీ బ్రూక్ (20 నాటౌట్), లివింగ్‌స్టోన్ (15) అంచనాలను అందుకోలేదు. 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసిన ఇంగ్లాండ్ 36 పరుగుల తేడాతో భారీ ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. ట్రావిశ్ హెడ్ (34, 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవిడ్ వార్నర్ (39, 16 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (35, 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (30, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా గ్లెన్ మాక్స్‌వెల్ (28, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆసీస్ స్పిన్నర్ జంపా (2/28) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు మ్యాచుల్లో రెండు విజయాలతో గ్రూప్- బిలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుంది.



ఉగాండా ఢమాల్

39 పరుగులకే ఆలౌట్
కరీబియన్ల ఏకపక్ష విజయం

నవతెలంగాణ-ప్రావిడెన్స్

తొలిసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడుతున్న పసికూన ఉగాండాపై వెస్టిండీస్ పంజా విసిరింది. కరీబియన్ పేసర్ అకీల్ హొస్సేన్ (5/11) ఐదు వికెట్ల విజృంభణతో ఉగాండా ఉలిక్కిపడింది. 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. అల్జారీ జొసెఫ్ (2/6) సైతం మెరవటంతో ఉగాండా టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యల్ప స్కోరుకు ఆలౌటైంది. 174 పరుగుల భారీ ఛేదనలో ఉగాండా బ్యాటర్లు విలవిల్లాడారు. కరీబియన్ భీకర పేస్ ముందు తేలిపోయారు. టెయిలెండర్ జుమా (13 నాటౌట్) ఒక్కడే ఉగాండా ఇన్నింగ్స్‌లో రెండెంకల స్కోరు సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 173 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (44, 42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆండ్రీ రసెల్ (30 నాటౌట్, 17 బంతుల్లో 6 ఫోర్లు) సహా నికోలస్ పూరన్ (22), రోవ్‌మాన్ పావెల్ (23), రూథర్‌ఫోర్డ్ (22) రాణించారు. గ్రూప్-సిలో రెండు విజయాలు సాధించిన వెస్టిండీస్.. అఫ్గనిస్థాన్‌తో సమానంగా 4 పాయింట్లు గెల్చుకుంది. మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో అఫ్గాన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉండగా, విండీస్ రెండో స్థానంలో కొనసాగుతుంది. ఇదే గ్రూప్‌లో న్యూజిలాండ్ అట్టడుగు స్థానంలో ఉంది.



శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష

నవచిత్రం

ఆకాశానికే జాబిలి అందం..

దర్శకుడు కె.విజయ్‌భాస్కర్ మళ్లీ ఓ సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. 'నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' వంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలను తెరకెక్కించిన ఆయన స్వీయ దర్శకత్వంలో 'ఉషా పరిణయం' అనే అందమైన టైటిల్‌తో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి లవ్ ఈజ్ బ్యూటీఫుల్ అనేది ఉపశీర్షిక. విజయ్‌భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్‌భాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా నటిస్తుండగా, తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం కాబోతుంది.

చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఆకాశానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం..' అంటూ సాగే ఓ ప్రేమగీతాన్ని తొలి లిరికల్ సాంగ్‌గా విడుదల చేశారు.

ఆర్.ఆర్. ధ్రువన్ సంగీత సారథ్యంలో రూపొందిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ఆర్.ఆర్.ధ్రువన్ ఈ ప్రేమగీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, 'ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. ప్రేమకథలో సరికొత్తగా ఉండే విధంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ చిత్రం ప్రేమకు నేనిచ్చే డెఫినేషన్. ఇదొక మంచి లవ్‌స్టోరీ. సినిమా లవర్స్‌కు విందుభోజనంలా ఉంటుంది. అన్ని ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉన్నాయి. ఈ సినిమా సంగీతంలో ధ్రువన్ విశ్వరూపం చూస్తారు' అని అన్నారు.

సూర్య, రవి, శివతేజ, అలీ, వెన్నెలకిషోర్, శివాజీ రాజా, ఆమని, సుధ, ఆనంద్ చక్రపాణి, రజిత, బాలక్రిష్ణ, సూర్య, మధుమణి తదితరులు ఈ చిత్రంలో ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

నేటి వివాహ బంధాలకు ప్రతిబింబం



చైతన్య రావ్, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న సినిమా 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ చిత్రాన్ని న్యూ రీల్ ఇండియా బ్యానర్ పై కేకేఆర్, బాలరాజ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని ప్రయోగాత్మకంగా ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ కామెడీగా దర్శకుడు బాల రాజశేఖరుని రూపొందించారు. ఈ సినిమా ఈ నెల21న వరల్డ్ వైడ్‌గా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర టీజర్‌ను అమల అక్కినేని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'యాక్టింగ్, స్క్రీన్ ప్లే రైటింగ్‌లో ప్రొఫెసర్‌గా బాల అమెరికాలో చాలా కాలం పనిచేశారు. తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలనే ఆయన కల ఈ సినిమాతో నెరవేరినందుకు సంతోషంగా ఉంది. మా అన్నపూర్ణ కాలేజ్ ఫ్యాకల్టీలు, స్టాఫ్, స్టూడెంట్స్‌ను బాల ఈ మూవీ టీమ్‌లోకి తీసుకున్నారు. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. ఈ రోజు సమాజంలోని రొమాంటిక్, వివాహ బంధాలను గురించి ఒక బలమైన కథను చూపించబోతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండే సబ్జెక్ట్ ఇది. ప్రేక్షకులు ఈ సినిమాని ఆదరించి, విజయాన్ని అందిస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

'మా మూవీ నుంచి టీ సిరీస్ మ్యూజిక్ ద్వారా రిలీజ్ చేసిన నాలుగు సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. కల్యాణి మాలిక్ వీటిని కంపోజ్ చేశారు. స్ఫూర్తి జితేందర్ టైటిల్ సాంగ్‌కు మ్యూజిక్ చేశారు. మంచి రొమాంటిక్ కామెడీ మూవీగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే చిత్రమిది' అని దర్శకుడు బాల రాజశేఖరుని చెప్పారు.



ఒగ్గు కథ ప్రధాన ఆకర్షణగా యేవమ్

పాశ్చాత్య పోకడలో తెలుగుదనం ఉన్న సినిమాలు, తెలుగు వారి సంప్రదాయాలు చూపించే సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయి. సహజత్వంతో కూడిన ఈ అంశాలను హైలైట్ చేస్తూ చూపించే సినిమాలను తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు. తాజాగా 'యేవమ్' చిత్రంలో తెలంగాణ ఒగ్గు కథ కల్చర్‌ని హైలైట్ చేస్తూ, తెలంగాణ సంస్కృతిలోని ముఖ్యమైన అంశమైన ఒగ్గుకథను ఈ చిత్రంలో చూపించారు చిత్ర దర్శకుడు ప్రకాష్ దంతులూరి. ఈ చిత్రంలో ఓ కీలకమైన సన్నివేశం వచ్చేటప్పుడు ఆ సన్నివేశంలోని గాఢతను తెలంగాణ ఒగ్గుకథతో చెబుతున్నారు. హిందూ సంప్రదాయంలోని గ్రామ దైవాల గొప్పతనాన్ని ఒగ్గుకథలో కూడా ఈ చిత్రంలో చూపించారు. ఈ ఒగ్గు కథను కూడా రియల్‌గా ఒగ్గు కథలను పాడే కళాకారులతోనే చెప్పించడం విశేషం.

దర్శకుడు మాట్లాడుతూ,'ఈ ఒగ్గుకథతో కథలోని గాఢతను, సన్నివేశంలోని సారాంశంను చెప్పించడంతో ప్రేక్షకులు కథలో ఇన్‌వాల్వ్ అవ్వడమే కాకుండా వారికి కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుంది. ఈ నెల 14న విడుదల కాబోతున్న ఈ చిత్రం అందని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

చాందిని చౌదరి, దిని చైదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవదీప్, పవన్ గోపరాజు, కెమెరా: ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం: కీర్తన శేషు, నీలేష్ మందలపు, ఎడిటర్ : సుజనా అడుసుమిల్లి.

జూన్ గుబులు..!

ఫీజులు పెంచిన ప్రయివేటు పాఠశాలలు

- గతేడాది కంటే 20-40 శాతం అధికం
- విద్యాహక్కు చట్టానికి యథేచ్ఛగా తూట్లు
- చితికిపోతున్న మధ్య తరగతి కుటుంబాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మరో రెండు రోజుల్లో బడి గంట మోగనున్నాయి. మారిన సామాజిక పరిస్థితుల్లో అప్పు చేసైనా తమ పిల్లలను పేరున్న పాఠశాలలో చదివించాలని తల్లిదండ్రులు తపనపడుతుంటారు. దీన్ని ఆసరా చేసుకుంటున్న కొన్ని ప్రయివేటు స్కూల్స్ కొత్త ప్రవేశాలు, డొనేషన్లు, నెలవారీ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్, షూస్, బ్యాగులు, రవాణా చార్జీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబుకు చిల్లు పెడుతున్నారు. జూన్ వచ్చిందంటే చాలు అనేక ఖర్చులు తలకు మించిన భారంగా మారుతున్నాయి. ఈ భారాలతో మధ్య తరగతి కుటుంబాలు చితికిపోతున్నాయి.

కొత్త పేర్లు.. కొత్త స్కూళ్లు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటర్నేషనల్, టెక్నో, ఈ-టెక్నో, ఒలంపియాడ్, భూం భూం, విజన్ కేతనం, టాలెంట్ అంటూ చివరన పేర్లు పెట్టి ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఫీజులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగ్స్ సైతం విక్రయిస్తున్నారు. మరికొన్ని పాఠశాలలకు అనుబంధంగా బుక్ స్టాల్స్ ఏర్పాటు చేసి, అక్కడే బుక్స్ కొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. యూనిఫామ్‌లు, క్యారేజ్ బ్యాగ్, షూస్ వంటివి కూడా పాఠశాల వాళ్లు చెప్పిన దగ్గరే కొనుగోలు చేయాలని నిబంధనలు పెడుతున్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పుస్తకాలను విక్రయించొచ్చని డీఈవో ఉత్తర్వులు ఇచ్చారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని స్కూల్స్ యథేచ్ఛగా పాఠశాలలోనే పుస్తకాల విక్రయానికి తెరలేపాయి. ఇక స్కూల్ బస్సు రవాణాకు ఫీజు అదనం.

రకరకాల ఫీజులు..

ప్రయివేటు పాఠశాలల్లో రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 వేల నుంచి రూ.10వేలు, అడ్మిషన్ ఫీజు రూ.5వేల నుంచి రూ.10వేలు, నర్సరీకి బుక్స్, స్టూడెంట్ కిట్ రూ.15 వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నారు. ఓ సాధారణ ప్రయివేటు స్కూల్‌లో రెండు జతల బట్టలకు రూ.8 వేల నుంచి రూ.10వేలు, స్పోర్ట్స్ డ్రెస్ రూ.2 వేల నుంచి రూ.5 వేలు, టై, బెల్ట్, బ్యాడ్జీ కలిపి రూ.5వేలు, రెండు జతల షూస్ కలిపి రూ.1500 వరకు చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు, డీజిల్ ధరలు, బస్సుల మెయింటెనెన్స్‌కు ఖర్చులు పెరిగాయంటూ అదనంగా కిలోమీటర్లను బట్టి వసూలు చేస్తున్నారు. 5 కి.మీ పరిధిలో రూ.10 వేల నుంచి రూ.25 వేలు, 5 నుంచి 10 కి.మీ.లకు రూ.30వేలు, 10 కి.మీ కంటే ఎక్కువైతే రూ.40 వేలు వసూలు చేస్తున్నారు. పిల్లల ఫీజులకు తోడు రవాణా ఛార్జీల భారంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒకేసారి ఫీజు మొత్తం చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నారు. ఇప్పటికైనా సర్కార్ స్పందించి ఈ ఫీజు దోపిడీని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

20-40శాతం ఫీజు పెంపు

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయి. గతేడాది కంటే ఈసారి 20-40 శాతం ఫీజులు పెంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఎన్ని కష్టాలెదురైనా సరే.. తమ పిల్లలను బాగా చదివించాలనే తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ము చేసుకుంటూ, జలగల్లా పీల్చిపిప్పి చేస్తున్నాయి. పిల్లలకు ఉత్తమ విద్యనందించాలనే ఆశ ఒక వైపు, అధిక ఫీజులతో మోయలేని భారం మరో వైపుతో తల్లిదండ్రులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి తోడు ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఫీజులు హడలెత్తిస్తున్నాయి.

ఫీజుల నియంత్రణ కరువు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్లే స్కూల్స్ 100, యూపీఎస్ స్కూల్స్ 550, హై స్కూల్స్ వెయ్యి వరకు ఉన్నాయి. ఇలా మొత్తం కలిపి 1600 వరకు ప్రయివేటు స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో ఫీజుల నియంత్రణ కొరవడింది. ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఫీజులను నియంత్రించడానికి 2017లో ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తిరుపతిరావు అధ్యక్షతన అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఏటా ఫీజులను ఎంత పెంచాలనే దానిపై ఈ కమిటీ నివేదికను సమర్పించింది. ఆ నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయకపోవడంతో ప్రయివేటు స్కూల్స్ ఆడిందే ఆట.. పాటిందే పాట అన్న చందంగా మారింది. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు తీసుకొచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఫీజులపై స్పష్టత లేకపోవడంతో ప్రయివేటు స్కూల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం సరైన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు.

సర్కార్ వెంటనే స్పందించాలి



ప్రయివేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఫీజుల వసూలుపై సర్కార్‌పై వెంటనే స్పందించాలి. సీబీఎస్‌ఈ, ఐసీఎస్సీ లాంటి పేర్లతో స్కూల్స్ పెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ప్రతీ ఏడాది 40శాతం ఫీజులు పెంచడం సరికాదు. వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి. విద్యాశాఖా మంత్రి లేకపోవడంతో స్కూళ్లపై పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు నిబంధనలు అతిక్రమిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి.

రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.